మానుషి
గత వారం...
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 185 పేజీలు: 10+4 వెల: 6.50

అమెరికా, ఇరాన్ మధ్య నేటి నుంచి చర్చలు

కోర్టుల్లో 5.64 కోట్ల కేసులు పెండింగ్

5



170 నిమిషాల్లోనే అగ్గిపెట్టెలో పట్టే చీర

2

మగ్గం మాయ!
మరమగ్గానికి సవాల్‌గా చేనేత వేగం



5

ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం

బీహార్‌లో బిజెపి కంచుకోట బద్దలు
20వేలు పైగా మెజార్టీతో గెలుపు

# గోల్కొండ కోటలోనే పంద్రాగస్టు వేడుకలు

**జాతీయ పతాకం ఆవిష్కరించనున్న సిఎం రేవంత్**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం

>>2





నీట్ ఆందోళనలు:

## విద్యార్థుల కేసుల విత్‌డ్రాపై నిర్ణయం రాష్ట్రాలకే

**సుప్రీం కోర్టు స్పష్టీకరణ**

**వారిపై కేసులుండవు: కేంద్ర సర్కార్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** చట్ట ప్రకారం అనుమతించబడిన చోట, విద్యార్థి నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల నుండి ఉత్పన్నమయ్యే విచారణలను మూసివేయడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి) లేదా మరే ఇతర రాష్ట్రానికైనా తన జులై 28 నాటి ఉత్తర్వు అడ్డుకాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై జరిగిన ప్రదర్శనలలో, ఢిల్లీలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్, తదనంతరం పలు రాష్ట్రాల్లో జరిగిన నిరసనలతో సహా,

>>2

# సింగరేణికి కొత్త ఊపిరి

**వేలంలో దక్కించుకున్న మణుగూరు పికె ఒసి2**

**120 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు అంచనా**

**మరో 2 వేల మందికి పైగా ఉద్యోగాలు**



**హైదరాబాద్, అగస్టు 3, ప్రభాతవార్త:** సింగరేణి మరో బొగ్గు గనిని సాధించింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియా అస్తిత్వానికి అతి కీలకమైన పీకే ఓసీ2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కైవసం చేసుకుంది. గత నెల రోజుల వ్యవధిలో సింగరేణిలో నమోదైన రెండో అతి పెద్ద విజయంగా యాజమాన్యం పేర్కొంది. మణుగూరు పీకే ఓసీ2 డిప్ సైడ్ గనితో 120 మిలియన్ టన్నుల నాణ్యమైన జీ8 గ్రేడ్ బొగ్గును వెలికితీయొచ్చని అంచనా. ఈ బ్లాక్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును మన విద్యుత్ అవసరాలకు వినియోగించుకోనే అవకాశం ఉందని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. మరీ ముఖ్యంగా, సింగరేణిలో అత్యంత కీలకమైన ఏరియాల్లో ఒకటైన మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని పరిరక్షించడంలో ఈ బ్లాక్ కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభించడమే కాకుండా, మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని భావిస్తోంది. అంతేకాకుండా ఈ బ్లాక్‌లోని నాణ్యమైన బొగ్గు నిల్వల ద్వారా రాబోయే 20 సంవత్సరాల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయడంతో రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని సింగరేణి అధికారులు చెబుతున్నారు. అలాగే ఇటీవల తాడిచర్ల 2 బ్లాక్‌కు సంబంధించి మైనింగ్ లీజులకు కేంద్రం నుండి అనుమతి పొందింది. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను 45 ఏళ్ల పాటు వెలికితీయడానికి అవకాశం ఉంటుందని అంచనా. కాగా ఈ వేలంలో మణుగూరు పీకే ఓసీ2 బ్లాక్ దక్కడం చారిత్రక విజయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. అమెరికా నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడుకోవడానికి కొత్త బ్లాక్‌లను దక్కించుకోవాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. సింగరేణికి తమ ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే ఈ రోజు ఈ విజయం సాధ్యమైందన్నారు. అసలు ప్రారంభం అవుతుందా

>>2

**పికెఒసి-2 కోల్ బ్లాక్ సింగరేణికి**

## దక్కడం సంతోషకరం

**-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు3:** సింగరేణి సంస్థ ఆర్థికాభివృద్ధి దిశగా మరో కీలకమైన ముందడుగు వేస్తూ ఎన్నో ఏళ్లకయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని పీకేఓసీ-2(ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్) డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల 2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. పీకేఓసీ2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ

>>2

# ప్రపంచ దేశాలతో పోటీ

**రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు రండి**

**ఎన్నారైలకోసం చట్టబద్ధ వ్యవస్థ ఏర్పాటు**

**'ఆటా' జాతీయ మహాసభల్లో డి.సిఎం భట్టి**



బాల్టిమోర్‌లో 'ఆటా' జాతీయ సభల్లో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అగస్టు 3, ప్రభాతవార్త:** దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో దీటుగా తెలంగాణ రాష్ట్రాన్ని పోటీపడే స్థాయికి తీసుకెళ్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రపంచ దేశాలతో పోటీపడేలా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. అమెరికాలోని బాల్టిమోర్‌లో జరిగిన ఆట జాతీయ మహాసభల్లో పాల్గొని ప్రసంగిస్తూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసులు ముందుకు రావాన్నారు. ఇందు కోసం సింగిల్ విండో విధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని అనుమతులు వెంటనే ఇస్తూ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పారిశ్రామికంగా, సామాజికంగా ప్రవాస భారతీయులు చేపట్టే ప్రతి కార్యక్రమంలో వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మలచాలనే స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పెట్టుబడులకు, పరిశ్రమలకు అత్యంత అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం వేగంగా దూసుకెళ్తోందని వివరించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న 56 కిలోమీటర్ల మూసీ నదిని లండన్ లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరించి, స్వచ్ఛమైన నీరు పారేలా ప్రక్షాళన చేయడం ద్వారా నగర రూపురేఖలు మార్చబోతున్నామని పేర్కొన్నారు. జిల్లాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) నిర్మిస్తున్నామని, వాటిని అనుసంధానం చేస్తూ

>>2

'సుప్రీం' జడ్జిలు

# 38కి పెంపు

**బిల్లుకు లోక్‌సభ ఆమోదం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన సుప్రీం కోర్టు జడ్జిల సంఖ్య సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించారు. బిల్లుపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చర్చను

>>2



సోమవారం అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, పొన్నం

# పరిహారం ఇవ్వండి

**పోలవరం సహా ఇతర ప్రాజెక్టులకు ముంపు పరిహారం బాధ్యత కేంద్రానిదే**

**గౌరవెల్లి పంపును ఆన్‌చేయండి..**

**అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం**

**పర్యావరణ అనుమతులు త్వరగా సాధించాలి..**

**ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలి: మంత్రి**

**హైదరాబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:** పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల ప్రభావితమైన ప్రాంతాలతోపాటు ముంపు ప్రాంతాల్లో నిర్వాసితుల పరిహారం మౌలిక సదుపాయాలు, ఆస్తుల పరిహారం చెల్లించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదే అని నీటిపారుదలశాఖ ఒక సమన్వసమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం కాకుండా ఉన్న అనే అంశాలను చర్చించాల్సిన అవసం ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సుప్రీంకోర్టు నాలుగు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వడంతో సంబంధిత జిల్లాల మంత్రులు అధికారులతో సమీక్షా సమావేశం ఆయన నిర్వహిస్తూ పోలవరం బ్యాక్‌వాటర్ ప్రతికూల ప్రభావంపై అధ్యయనాలు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీసీ,రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి బలరాంనాయక్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లడుతూ గౌరవెల్లి

>>2

# ఒక్క ఓటునూ తీయం

**ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ మెరుగు**

**ఒఎస్‌డిడి కేసులపై పునఃపరిశీలన చేశాకే తుది నిర్ణయం: సిఇఒ సుదర్శన్‌రెడ్డి**



సోమవారం విడియో కాన్ఫరెన్స్‌లో సిఇఒ సుదర్శన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ నాణ్యతను మెరుగుపరచేందుకు ఫొటోలు లేకపోవడం, జన్మతేదీ వ్యత్యాసాలు, లింగ వివరాల్లో పొరపాట్లు, సంతకాలలో లోపాలను సరి చేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా.వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి డిజిటైజేషన్ పురోగతి, సంబంధిత అంశాలను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ముఖ్యంగా గైర్హాజరైన (ఆబ్‌సెంట్), నివాసం మార్చుకున్న (షిఫ్టెడ్), మరణించిన (డెడ్), నకిలీ (డుప్లికేట్) ఓటర్ల (ఏఎస్‌డిడి) జాబితాల పునఃపరిశీలన, విశ్లేషణ, నో మ్యాపింగ్ కేసులు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి

>>2





సోమవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

# 'నకిలీ' ముఠా అరెస్టు

**కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, కెమెరాలు స్వాధీనం: ఆదిలాబాద్ ఎస్పీ మహాజన్**

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త, ఆగస్టు 3:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ రికార్డులను నకిలీగా సృష్టించి ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ముఠాను పోలీసులు గుర్తించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను తెలియజేశారు. వివరాలను గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి మహ్మద్ లుక్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో నకిలీ రబ్బర్ స్టాంపు తయారు చేసి, ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేసి జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు, ఇంటి పన్ను ధ్రువపత్రాలు తదితర గ్రామపంచాయతీ పత్రాలను కంప్యూటర్ల ద్వారా తయారు చేసినట్లు గుర్తించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా ఆధార్ సంబంధిత పత్రాలు, ఓటర్ గుర్తింపు కార్డులు, పాన్ కార్డులు తయారు చేసి అనర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేలా చేసి

>>2

# యూత్ డిక్లరేషన్ అమలు చేశారా?

**జెన్ జి ప్రకటనల్లో సిఎంకు చిత్త శుద్ధి ఉందా?**

**విద్యా మంత్రి పదవికి రాజీనామా చేసి యువకునికి అప్పగించాలి: కెటిఆర్**





సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** రాష్ట్ర ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన చేతిలో లేని అంశాలపై మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 21 ఏళ్లకే చట్టసభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలంటూ మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, తెలంగాణ యువతకు యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జెన్‌జీకి చెందిన యువకుడిని విద్యాశాఖ మంత్రిగా నియమిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేస్తూ, ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతలను యువకుడికి అప్పగించాలని సవాల్ విసిరారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 21 ఏళ్ల అంశంపై అసెంబ్లీలో తీర్మానం

>>2




సోమవారం సచివాలయంలో పంద్రాగస్టు వేడుకలపై సమీక్ష చేస్తున్న సిఎస్ సంజయ్ జాజు ఇతర ఉన్నతాధికారులు

# పంద్రాగస్టు వేడుకలు

>> స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాటు, సిట్టింగ్ ఇతర సౌకర్యాలు, అత్యవసర సేవలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

రోడ్లు, భవనాల శాఖ వేదిక నిర్మాణం, స్టేజ్, సిట్టింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్, రహదారుల మరమ్మతులు, తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు వీఐపీలు, పాల్గొనేవారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు వేదిక పరిసరాల్లో పారిశుద్ధం, పరిశుభ్రత, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ తగిన సంఖ్యలో వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఫైర్ టెండర్లు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, బ్యాకప్ ఏర్పాట్లను చేపట్టాలని సిఎస్ ఆదేశించారు. ఇతర శాఖలు కూడా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, అన్ని పనులను వేడుకలకు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి తనిఖీలు, సమీక్షలు నిర్వహించాలని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, వాణి ప్రసాద్, జీఏడీ (పొలిటికల్) ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విత్‌డ్రాపై నిర్ణయం రాష్ట్రాలకే

>> పాల్గొన్న విద్యార్థులకు క్షమాభిక్ష ప్రసాదిస్తామన్న తన హామీ విషయంలో తాము "గట్టిగ్గా ఉన్నామని కేంద్రం సమర్పించిన తర్వాత ఈ స్పష్టత వచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, నేర చరిత్ర లేని పక్షంలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలవంతపు చర్యలు తీసుకోకుండా నిరోధిస్తూ గతంలో ఇచ్చిన తన ఆదేశం పరిధిని కూడా స్పష్టం చేసింది. అత్యాచారం, ఇతర ఘోరమైన నేరాలతో సహా తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితులకు ఈ రక్షణ వర్తించదని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లను మొదట గుర్తించి, వర్గీకరించవచ్చని, ఆ తర్వాత అధికారులు ప్రతి కేసులోనూ తగిన చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించవచ్చని కూడా ధర్మాసనం సూచించింది. "ఇతర రాష్ట్రాల్లో ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయనే దానిపై మీరు సమాచారాన్ని సేకరించగలిగితే ఈ వర్గీకరణ తర్వాత, మీరు చట్టాన్ని అనుసరించవచ్చు" అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మూసివేత లేదా ఉపసంహరణకు పరిగణించదగిన కేసులపై ఇరుపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చిన తర్వాత, న్యాయస్థానం ఈ ప్రక్రియను "సాధ్యం" చేయగలదని జస్టిస్ జయమాల్య బాగ్చి తెలిపారు. దర్యాప్తు సంస్థలు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023 (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 193 కింద కేసు ముగింపు నివేదికలను దాఖలు చేయవచ్చని, అదే సమయంలో సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చట్టబద్ధమైన ప్రక్రియకు అనుగుణంగా విచారణ నుండి ఉపసంహరణ కోరవచ్చని ఆయన సూచించారు. తదుపరి విచారణ కోసం ఆగస్టు 18కి వాయిదా వేసింది.

## సింగరేణికి కొత్త ఊపిరి

>> లేదా తెలియని స్థితిలో ఉన్న ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుమతులు సాధించేందుకు తానే ఒడిశాకు వెళ్లి అక్కడి ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి ఒప్పించానని, ఫలితంగా ఈ రోజు 36 ఏళ్ల పాటు సంస్థకు బలమైన పునాది వేసే నైనీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అదే సమయంలో 2013 లో యూపీఏ హయాంలో మైనింగ్ అనుమతులు జారీ చేసిన తాడిచర్ల 2 బ్లాక్ తమ కృషి వల్లే మైనింగ్ లీజులు సింగరేణికి దక్కాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు.

## దక్కడం సంతోషకరం

>> తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. పీకేఓసీ2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని వెల్లడించారు.

**25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది..**

తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు పీకేఓసీ 2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు.

**నైని, తాడిచర్ల2, శిలీవీది2 డిప్‌సైడ్ బ్లాక్ రావడంతో....**

సింగరేణికి 860 మిలియన్ టన్నుల రిజర్వ్లు సమకూరుతాయి... 6,500 మందికి జీవనోపాధి లభిస్తుంది... సగటున 35 ఏళ్లపాటు ఏడాదికి 22 మిలియన్ టన్నుల చొప్పున ఉత్పత్తి చేయవచ్చు... ఈ 3 బ్లాక్స్ వల్ల సింగరేణికి రూ.1,95,510 కోట్లకు పైగా రెవెన్యూ వస్తుంది... రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మగ్గం మాయ!
## 170 నిమిషాల్లోనే
# అగ్గిపెట్టెలో పట్టే చీర
### మరమగ్గానికి సవాల్‌గా చేనేత వేగం
### గిన్నిస్ రికార్డుపై కన్ను!

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** చేనేత నైపుణ్యానికి చిరునామా అయిన రాజన్న సిరిసిల్ల జిల్లా మరోసారి జగద్విదితమైంది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సంప్రదాయ చేనేత మగ్గం సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారు. ఆధునిక మరమగ్గం (పవర్‌లూమ్) వేగానికి ఏమాత్రం తీసిపోకుండా.. కేవలం 170 నిమిషాల్లో (2 గంటల 50 నిమిషాలు) పూర్తి చీరను నేసి అందరినీ విస్తుపోయేలా చేశారు. సాధారణంగా చేనేత మగ్గంపై ఒక చీర నేయడానికి కనీసం ఒక రోజు సమయం పడుతుంది. అయితే, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అదే సంప్రదాయ మగ్గంపై అత్యంత వేగంతో హరిప్రసాద్ చీరను నేయడం చేనేత చరిత్రలోనే అరుదైన ఘట్టం. ఇది కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదు.. సిరిసిల్ల చేనేత కార్మికుల అపార నైపుణ్యం, క్రమశిక్షణ, కళాత్మకతకు అద్దం పట్టింది. ఇది గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కాలని అంటున్నారు..

**హరిప్రసాద్ రూపొందించిన ఈ చీర కొలతలు, ప్రత్యేకతలు**

పొడవు 5.5 మీటర్లు, వెడల్పు 45 అంగుళాలు, బరువు కేవలం 175 గ్రాములు. సాంకేతికత 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్ప్ పోగులతో రూపుదిద్దుకుంది. ఈ చీరను ప్రత్యేక పద్ధతిలో మడిచి, సాధారణ అగ్గిపెట్టెలో ఇమిడేలా చేసి ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించగా.. చూసేవారంతా ముక్కున వేలేసుకున్నారు. సంప్రదాయ చేనేత మగ్గం కూడా ఆధునిక యంత్రాలతో పోటీపడగలదని కార్యరూపంలో నిరూపించిన హరిప్రసాద్ ప్రయత్నం చేనేత కార్మికుల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ప్రజాప్రతినిధులు, చేనేత రంగ ప్రముఖులు కొనియాడారు.

## వారం - వర్జ్యం

**04-08-2026, మంగళవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢ మాసం, దక్షిణాయణం,**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,**
తి.షష్ఠి రా.10.00
న.రేవతి రా.9.50
వ.ఉ.9.54-ఉ.11.29
దు.1. ఉ.8.22-ఉ.9.13
దు.2. రా.11.46-రా.12.37
రాహు. మ.3.00-మ.4.30
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** ప్రజలతో సంబంధాలు మెరుగు పరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

**వృషభం :** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెను వెంటనే రావు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

**మిథునం :** శత్రువర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభ పడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**కర్కాటకం :** ఎవ్వరినీ నమ్ముకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

**సింహం :** పని వత్తిడి అధికమవటం వలన క్షణం తీరిక లేకుండా శ్రమిస్తారు. స్త్రీలతో విభేదాలు కాకుండా జాగ్రత్తలు పాటించండి.

**కన్య :** పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

**తుల :** అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కళా రంగంలోని వారికి విదేశీ పర్యటనలు

**ధనుస్సు :** కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శనం చేసుకుంటారు. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మకరం :** సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. వాహన సౌఖ్యం.

**కుంభం :** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే శ్రేయోదాయకం.

**మీనం :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పరిహారం ఇవ్వండి

>> పంపును ఆన్ చేయడానికి సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సుప్రీంకోర్టు పాలమూరు రంగారెడ్డి, సీతారామా డిండి గౌరవెల్లి ప్రాజెక్టుల భవిష్యత్‌కు ఒక కొత్తగవాక్షం ఏర్పాటు చేసిందని కొనియాడారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంకు ఒక కాలనిర్ణయపట్టిక ఏర్పాటు చేసుకొని ముందుకు పోవాలని ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇంటర్‌స్టేట్ వింగ్‌ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణం, సాంకేతికఅంశాలు, గ్రీన్ ట్రిబ్యునల్ సుప్రీం కోర్టు నుంచి చట్టంపరమైన అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్రమైన నివేదిక రూపంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతులు సాధనకు ఏడు రోజుల నుంచి ఆరు నెలల వరకు స్పష్టమైన కార్యాచరణ ఉండాలని మంత్రి నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన నివేదికలను 30రోజుల్లో తయారించాలని సూచించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్‌పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయవ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీం కోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

**సీతమ్మసాగర్‌ను త్వరగా పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి**

ఖమ్మం జిల్లా గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని అన్నారు. నిర్దేశిత గడువులోపు ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు అంకితం చేయాలనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# ఒక్క ఓటునూ తీయం

>> ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న అన్ని లోపాలను అత్యంత ఖచ్చితత్వంతో సరిదిద్దాలి. అన్ని ఏఎస్‌డిడి కేసులను తుది నిర్ణయానికి ముందు పునఃపరిశీలించి, సరైన వర్గీకరణ చేయాలి. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా లేదా పొరపాటున తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలి. లోపాలు గుర్తించిన సందర్భంలో రోల్ బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి, రికార్డులను మళ్లీ పరిశీలించి అవసరమైన సవరణలు చేయాలి. బూత్ లెవల్ అధికారుల (బిఎల్ఓ), బూత్ లెవల్ సూపర్వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌లు) ద్వారా క్షేత్రస్థాయి ధృవీకరణను మరింత బలోపేతం చేయాలి.

నిర్లక్ష్యం గుర్తించిన చోట క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలి. బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ) సంతకాలతో సిద్ధం చేసి, వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలి. 85 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి సంబంధించిన వ్యత్యాసాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంతో పాటు, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అలాగే, జీహెచ్ఎంసీ కమిషనర్ అండ్ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని పట్టణ జిల్లాల జిల్లా ఎన్నికల అధికారుల పురోగతిని ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించారు.




సోమవారం పార్లమెంటు వద్ద నిరసన కార్యక్రమంలో ఎంపి జయాబచ్చన్ ఇతర ఎంపీలు

# 'నకిలీ' ముఠా అరెస్టు

>> తెలంగాణ ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు విచారణలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు నేరాన్ని చేస్తూ, మిగతా నిందితుల పాత్రను వెల్లడించడంతో వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ సీపీయూలు, మానిటర్లు, ప్రింటర్లు, హార్డ్‌డిస్క్‌లు, మొబైల్ ఫోన్లు, సుప్రీమా రియల్‌స్కాన్‌జీ10 ఫింగర్‌ప్రింట్ స్కానర్, సిఎంఐ టెక్ కెమెరా, లాజిటెక్ వెబ్ కెమెరా తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించి వాటిలోని డిజిటల్ ఆధారాలను సేకరించనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు ఇప్పటివరకు ఎంతమంది పేర్లతో నకిలీ పత్రాలు రూపొందించారు, ఎవరెవరు వాటిని ఉపయోగించారు, మరెవరైనా ఈ కుట్రలో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అరెస్టు అయిన వారిలో కేశవపట్నం కు చెందిన షేక్ హారూన్, ఇస్లాంపురా కాలనీకి చెందిన అబ్దుల్ షఫీక్, అదే ప్రాంతానికి చెందిన షేక్ దిల్‌షాద్ అహ్మద్, హనుమాన్ కాలనీకి చెందిన అబ్దుల్ రహమాన్ ఖాన్, ఇస్లాంపురాకు చెందిన సయ్యద్ నౌషాద్‌లు ఉన్నారు, కాగా మరో నిందుతుడు అబ్రార్ అలీ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే, ఎస్‌హెచ్‌వో ఇచ్చోడా ఇన్స్పెక్టర్ కే నరేష్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలతో పోటీ

>> కొత్తగా 36 రేడియల్ రోడ్లను ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆ ప్రాంతాన్ని ఆనుకుని సరికొత్తగా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర ప్రగతికి మానవ వనరుల అభివృద్ధే కీలకమని నమ్మిన ప్రభుత్వం, అందుకోసం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు తెలియచేశారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు సైతం అమెరికా దాకా ఎదిగి ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 100 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలను 25 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో, రూ. 200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ బృహత్తర యజ్ఞంలో ప్రవాసులు భాగస్వాములై రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు, తెలంగాణలో ఉంటున్న వారి తల్లిదండ్రుల సమస్యల కోసం చట్టబద్ధత కలిగిన ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ ఆలోచనలో ఉందన్నారు. ప్రపంచంలోని తెలంగాణ వాసులు తమ ఇబ్బందులు, స్వరాష్ట్రంలో ఉంటున్న తమ తల్లిదండ్రుల సమస్యలను ఈ ప్రత్యేక వ్యవస్థ దృష్టికి తీసుకొచ్చినట్లయితే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలంగాణ పౌరులు ప్రపంచంలో ఏ నలుమూలల ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 'సుప్రీం' జడ్జిలు 38కి పెంపు

>> ప్రారంభించారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ కోరారు. విపక్షాల నిరసనలతో బిల్లుపై చర్చించకుండానే స్పీకర్ ఆమోదం తెలిపారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు విషయంపై మే నెలలోనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దానిని కార్యరూపంలోకి తీసుకొస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిసుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్ 2026ను జారీచేశారు. ఈ ఏడాది జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే. ఇప్పుడు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం 76 ఏళ్లలో సంఖ్యాపరంగా 30కు, నిష్పత్తి ప్రకారం 375 శాతం పెరిగినట్లయ్యింది.

# అమలు చేశారా?

>> చేసినా అది ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదని, ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసే అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నం తప్ప మరొకటి కాదని కేటీఆర్ అన్నారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి సాధించిన విజయం అంటే 150 మంది గురుకుల విద్యార్థుల మరణాలా? ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులకు "ఎండ్రిన్ తాగి చావండి" అనే పరిస్థితి కల్పించడమా? రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 10 వేల కొత్త ఉద్యోగాలకే పరిమితం కావడమా? ఏ విషయంలో ఆయన విజయవంతమయ్యారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.

యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం కారణంగానే యువతలో తీవ్ర ఆగ్రహం, నిరాశ పెరుగుతోందని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యువత ఓట్లు అడిగిన రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఇతర రాష్ట్రాల్లో నీతులు చెప్పే రాహుల్ గాంధీ, తన పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో విద్యార్థులపై జరుగుతున్న అన్యాయం, మోసం, అణచివేత, అక్రమ కేసులు, అరెస్టులపై ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటిని ప్రస్తావిస్తూ తాము ఇప్పటికే రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశామని, తెలంగాణ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అన్యాయంపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, యువతకు ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇందుకు సిద్ధం కాకపోతే యువతకు చేసిన ద్రోహాన్ని అసెంబ్లీలో బీఆర్ఎస్ తరఫున గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. చివరగా తెలంగాణ యువతకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రివర్స్ పంపింగ్, మానేరు నుంచి ఎస్ఆర్ఎస్‌పీకి నీటిని తరలించే కార్యక్రమాలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ ఎన్ని విమర్శలు చేసినా, ఆ ప్రాజెక్టు వల్ల రైతులకు, రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంపై రుద్దుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీ అప్పులను రాష్ట్ర ప్రజలపై మోపే ప్రయత్నం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించే దశకు తీసుకెళ్తే, వాటిని రద్దు చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డేనని విమర్శించారు. అప్పట్లో మెట్రో విస్తరణకు అభ్యంతరం చెప్పని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తోందో, మెట్రోను టేకోవర్ చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. దేశంలోని అనేక చిన్న పట్టణాలకు మెట్రోలను మంజూరు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ మెట్రో విస్తరణకు మాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం కూడా అన్యాయమేనన్నారు.


## కేంద్ర ఉద్యోగులకు డిఎ పెంపు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సోమవారం ఓ శుభవార్త అందింది. ఈసారి కరవు భత్యం పెంపుపై స్పష్టత వచ్చింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా ఈసారి కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డిఎ పెరిగే అవకాశం ఉందని ఆర్థిక శాఖ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు పెరగనున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం జులై 1 నుంచి ఈ డిఎ పెంపు అమలులోకి రానుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న డిఎ మూల వేతనంలో 60 శాతంగా ఉంది. తాజాగా పెంపుతో ఇది 63 శాతానికి చేరబోతోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన పారిశ్రామిక కార్మికుల వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఈ డిఎ శాతాన్ని ప్రభుత్వం ఖరారు చేస్తుంది. కేంద్రం సాధారణంగా ప్రతి యేటా జనవరి 1, జులై 1 తేదీల నుంచి అమలులోకి వచ్చేలా రెండుసార్లు డిఎను సవరిస్తుంది. గతేడాది జులై నుంచి ఈ యేడాది జూన్ వరకు 12 నెలల కాలంలోని వినియోగదారుల ధరల సూచీ సగటు ఆధారంగా ఈ లెక్కింపు చేస్తారు. ఏడో వేతన సంఘం నిర్దేశించిన లెక్క ప్రకారం డిఎ దాదాపు 63.7 శాతానికి చేరింది. అయితే దశాంశ పాయింట్లను మినహాయించే సాంప్రదాయం ఉండటంతో ప్రభుత్వం దీనిని 63 శాతంగా ఖరారు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు పెరిగే 3 శాతం డిఎ వల్ల ఉద్యోగుల కనీస వేతనం ఆధారంగా జీతాలు పెరగబోతున్నాయి. మూల వేతనం 18 వేల రూపాయలు ఉన్న ఉద్యోగికి నెలవారీ జీతంలో 540 రూపాయలు పెరుగుతాయి. అలాగే బేసిక్ పే 30 వేల రూపాయలు ఉన్న వారిని ప్రతి నెలా 900 రూపాయలు, ఒకవేళ బేసిక్ పే 50 వేల రూపాయల వరకు ఉంటే వారికి దాదాపు 1,500 రూపాయల చొప్పున పెరగనుంది.

# ప్రపంచ నగరాల్లో తీరప్రాంతం కుంగుబాటు

## జర్మనీ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయన నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 3: తీర ప్రాంతాల్లో నేల క్రమంగా కుంగిపోవడం పర్యావరణ సమ తుల్యతకు మరో పెద్ద ముప్పుగా మారిందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ రెండు కారణాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లది మంది ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్, టులేన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు సగటున ఏడాదికి 6 మిల్లీ మీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధన తెలిపింది. ఇది ప్రపంచ సగటు కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి పైగా ప్రజలు తక్కువ ఎత్తులో ఉన్న తీర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో సముద్ర మట్టం పెరగడమే కాదు, నేల కూడా క్రమంగా దిగజారడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని శాస్త్రవేత్తలు వివరించారు. తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలను అధికంగా తోడేయడం, చమురు, సహజవాయువు వెలికితీత, నదీ డెల్టాల్లోని మృదువైన నేల కుంగిపోవడం, భారీ భవనాల బరువు వంటి కారణాలతో భూమి దిగజారుతోందని అధ్యయనం వెల్లడించింది. దీనికి తోడు భూకంప ఫలకాల్లో కదలికలు, మంచు యుగం తర్వాత భూపొరలో జరుగుతున్న సహజ మార్పులు కూడా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది. కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నైజీరియా, ఈజిప్ట్, చైనా, ఇండోనేషియా తీర ప్రాంతాల్లో ఏడాదికి 7 నుంచి 10 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల నమోదవుతోంది. అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీలో ఈ పెరుగుదల 4 నుంచి 5 మిల్లీమీటర్ల మధ్య ఉంది. ఇండోనేషియా రాజధాని జకార్తా అత్యంత ప్రమాదంలో ఉన్న నగరంగా అధ్యయనం పేర్కొంది. అక్కడ సగటున ఏడాదికి 13.7 మిల్లీమీటర్ల మేర నేల కుంగిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ వేగం 42 మిల్లీమీటర్ల వరకు నమోదైంది. చైనాలోని టియాంజిన్, థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్, నైజీరియాలోని లాగోస్, ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా కూడా ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. అయితే అన్ని తీర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి లేదని పరిశోధకులు తెలిపారు. స్వీడన్, ఫిన్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి పైకి లేస్తుండటంతో అక్కడ సముద్ర మట్టం ప్రభావం తక్కువగా కనిపిస్తోందని వివరించారు. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం ద్వారా నేల కుంగిపోవడాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు. ఒకప్పుడు ఏడాదికి 10 సెంటీమీటర్లకుపైగా కుంగిపోయిన టోక్యోలో ప్రభుత్వ చర్యలతో పరిస్థితి మెరుగుపడిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ఇతర దేశాలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



## ఆర్టీసీ డ్రైవర్, శ్రామిక పోస్టుల ఫలితాలు విడుదల

### 1,743 పోస్టులకు 1,604 మంది ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: రాష్ట్ర ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక పోస్టులకు గత ఏడాది సెప్టెంబరు నెలలో వెలువడిన నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన భర్తీల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్ పోస్టులు వెయ్యి వుండగా ఇందులో 894 మంది మాత్రమే ఎంపికయ్యారు. శ్రామిక్ పోస్టులు 743 వుండగా 694 మంది పురుషులు, 16 మంది మహిళలు ఎంపికయ్యారు. రెండు కేటగిరిలో 1743 పోస్టులు వుండగా 1604 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కాగా డ్రైవర్, శ్రామిక్ పోస్టులకు ఎంపికైన వారు ఈ నెల ఏడవ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి 11వ తేదీ అర్థరాత్రి వరకు పోలీసు వెబ్‌సైట్ ద్వారా అటెస్టేషన్ ఫారంను పూర్తి చేసి సంబంధిత డాక్యుమెంట్లను అందులో ఉంచాల్సి వుంటుంది. దీని తరువాత ఈ నెల 17వ తేదీన అభ్యర్థులు సంబంధిత జిల్లా ఎస్పీలు, కమిషనేట్లలో మూడు జతల అటెస్టేషన్ ఫారంలతోపాటు సంబంధిత పత్రాలను అందజేయాల్సి ఉంటుంది.



సోమవారం ఉదయం మాతంగేశ్వరీ ఆలయం ఎదురుగా భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత

## ఈ యేడాది వానలు కుంభవృష్టి.. నా విగ్రహ ప్రతిష్ట చేయించాలి

### 'భవిష్యవాణి'లో స్వర్ణలత

హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 3, ప్రభాతవార్త: ఈ యేడాది వర్షాలు కుంభవృష్టిగా కురుస్తాయని, వడదల సంభవిస్తాయని, అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, ప్రాణనష్టం సంభవిస్తుందని, ప్రజ లంతా జాగ్రత్తగా ఉండాలని, నా విగ్రహాన్ని ప్రతిష్టిస్తానని మాటలు చెప్పినారు కానీ పట్టించుకోవడం లేదు. ఆరు నెల్లలో విగ్రహ ప్రతిష్ట చేయాలి. లేకుంటే ప్రాణనష్టం జరిపిస్తా, అడ్డొచ్చేవాళ్లను పాదాల కింద నలిపేస్తా అంటూ ఉజ్జయిని మహాకాళీ బోనాల జాతరలో మరో ప్రధాన ఘట్టమైన రంగం (భవిష్యవాణి)లో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సోమవారం ఉదయం దేవాలయంలో మాతంగేశ్వరీ ఆలయం ఎదురుగా ముఖం నిండా పచ్చని పసుపు పూసుకుని, నుదిటిపై ఎర్రని కుంకుమ ధరించి చేతిలో తంబురా పట్టుకుని పచ్చికుండపై అమ్మవారి ఆలయానికి ఎదురుగా నిలబడి, అమ్మ వారిని ఆవాహనం చేసుకుని భవిష్యవాణి వినిపించారు. గత యేడాది కూడా విగ్రహ ప్రతిష్ట చేస్తామని చేయలేదని, అందుకే మీరు ఎన్ని పూజలు చేసినా శాంతం వడం లేదని, ఇలా కంటతడి పెట్టిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసారు. దానికి అడ్డ పడేవాళ్లు ఎవరైనా మాస్కూ ఊరుకోకుండా పాదాల కింద నలిపేస్తా న్నారు. నేను అడిగింది చేస్తా. కోరిందల్లా కొంగు బంగారం చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల్లో భయం లేకుండా పోతుందని, వావివరుసలు లేకుండా తప్పులు చేస్తున్నారని, అందుకే ప్రాణనష్టాలు జరుగుతున్నా యన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విప్పు లవిడిగా వదిలివేస్తారని, ప్రజల్లో అహంకారం పెరిగిపోతుందన్నారు. కళ్ల తలకెక్కి ఘోరాలు చేస్తుంటే ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు. మీరు మాత్రం కంటతడి పెట్టిస్తున్నారు. మనసు తృప్తి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఆరునెల్లల్లో విగ్రహ ప్రతిష్ట చేయాలని సూచించారు.

## ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

### బెయిల్ ఇవ్వరాదని కోర్టుకు వినతి

### మరో ఇద్దరు బాధితుల వాంగ్మూలం

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిని లైంగికంగా వేధించడంతో పాటు ఆమె ప్రైవేటు వీడియోలు, ఫోటోలను భర్తకు పంపిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు సోమవారం నాడు ఉప్పర్‌పల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు ఇతనికి బెయిల్ ఇవ్వరాదని కూడా న్యాయమూర్తిని అభ్యర్థించారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణలో వు న్న తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఘటనపై జులై 18వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని 66 సెక్షన్ కింద కేసు నమోదవడం తెలిసిందే. అదే రోజున ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయడం విదితమే. దీని తరువాత అతను అజ్ఞాతంలో వెళ్లి హైకోర్టును ఆశ్రయించ డం, న్యాయస్థానంలో నిందితుడికి ఊరట లభించలేదు. అనంతరం గత నెల 28వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డి చేయగా మరుసటి రోజు రిమాండు కు తరలించారు. దీని తరువాత అతని వ్యవహారంపై జాతీయ పోలీసు అకాడమి అధికారులు డిజిపికి లేఖ రాశారు. ఇదే సమయంలో నేషనల్ పోలీసు అకాడమి అధికారులు అతని ఒకరోజ్ బెజ్‌లో ఉదయ్ కృష్ణారెడ్డి అడ్డుకు తీసుకున్న గదిలో లాప్‌టాప్‌ను, సెల్‌ఫోన్‌ను, కత్తిని జప్తు చేసి లోతుగా ఆరా తీయగా అతను మరికొందరు మహిళలతోనూ సన్నిహిత సంబంధాలు నెరిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇద్దరు బాధితుల నుంచి పోలీసులు ఆదివారం నా డు వాంగ్మూలాలు తీసుకున్నారు. వీరిద్దరు ఎవికి చెందిన వారుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డిని మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని అత్తాపూర్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. దీంతో పాటు ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని పోలీసులు కోరారు. పోలీసుల పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగనుంది.

## వసతిగృహంలో ఇద్దరు విద్యార్థులపై లైంగికదాడి

### పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్ (దుండిగల్), ఆగస్టు 3, ప్రభాతవార్త: మైనార్టీ వసతిగృహంలో ఐదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై ముగ్గురు సీనియర్ విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన దుండిగల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేటలోని ఓ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యా ర్థులు జబీవల లైంగికదాడికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థులు నిర్భా వాక లకు తెలుపకుండా శనివారం ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తమ తల్లి దండ్రులకు తెలియజేశారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఆదివారం దుండిగల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వసతిగృహంలో భద్రత, వార్డెన్ పర్యవేక్ష లోపంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కు అందజేస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తదితరులు

## రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి చెక్కు అందజేత

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి బీమా కింద లభించిన కోటి రూపాయలను చెక్కు రూపంలో డిజిపి సి.వి ఆనంద్ సోమవారం అందజేశారు. మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ చరణ్‌కుమార్ ఈగల్ విభాగం లో డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా 2025 సెప్టెంబరు 22వ తేదీన అర్ధరాత్రి సమయంలో విధి నిర్వహణ నిమిత్తం మహారాష్ట్రలోని దేవార్పూ ర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చరణ్ కుమార్‌కు మొదట స్థానికంగా వైద్యం అందజేసి అనం తరం హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కోలుకుని గత ఏడాది అక్టోబరు 28వ తేదీన డిశ్చార్ అయ్యాడు. అయితే ఇ ంటికి చేరుకున్న కొద్దిసేపటికే అతను తీవ్ర అస్వస్థతకు గురవగా మరోసారి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించాడు. తమ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మరణించడంతో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా పోలీసు ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించిన ఎస్‌బిఐతో మాట్లాడి మృతుడి కుటుంబానికి బీమా కింద కోటి రూపాయలు వచ్చేలా చేశారు. దీనికి సంబంధించిన చెక్కును డిజిపి ఆనంద్ కాని స్టేబుల్ కుటుంబానికి అందజేశారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తదితరులు పాల్గొన్నా రు.

## రోబోటిక్ శస్త్రచికిత్సల్లో నిమ్స్ అరుదైన ఘనత

### అభినందించిన సిఎం రేవంత్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆ గస్టు 3, ప్రభాతవార్త: నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రి మరో మైలురాయిని అధిగమిం చింది. రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో ఈ అరుదైన ఘనతను సాధిం చింది. రోబోటిక్ సర్జరీ సేవలను ప్రారంభిం చిన మూడేళ్లలోనే 1,000 విజయ వంతమైన రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తిచేసి ప్రభుత్వ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ వేయి శస్త్రచికిత్సల్లో యూరా లజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకా లజీ 162 శస్త్రచికిత్సలను రోబోటిక్ ద్వారా నిర్వ హించింది. ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రా శయం, కాలేయం, ప్యాంక్రియాస్, పేగులు, గర్భాశయం, అండాశ యాలకు సంబంధించిన క్లిష్టమైన కేన్సర్‌లతోపాటు ఇతర ప్రధాన శస్త్రచికిత్సలను నిమ్స్‌లో విజయ వంతంగా నిర్వహించారు. మొత్తం శస్త్రచికిత్సల్లో



నిమ్స్ వైద్యులతో డాక్టర్ రాహుల్ దేవరాజ్

90 శాతానికిపైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా రోగులకు ఉచితంగా నిర్వహించినట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ స్పష్టం చేశారు. ఆయన మా ట్లాడుతూ వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం కృషితోనే ఇది సాధ్యమైందని, ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. భవిష్యత్తు లోనూ అత్యాధునిక వైద్యసేవలను ప్రజలకు అందు బాటులో ఉంచేందుకు నిమ్స్ మరింత కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నిమ్స్ సాధించిన ఈ అరుదైన ఘనత నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ డైరెక్టర్‌తోపాటు వైద్యబృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌కు 'ఎక్స్'లో గుర్తుతెలియనివ్యక్తి అభ్యంతకర పోస్ట్

### సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్‌గా వున్న డిజి ర్యాంకు ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌కు ఎక్స్ (ట్విటర్)లో గుర్తు తెలియని వ్యక్తి అభ్యంతకర పోస్ట్ పెట్టాడు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. దీనిపై వెం టనే స్పందించిన టిజిసిఎస్‌బి అధికారులు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, సదరు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ని ందితుడు వాడిన ఫోన్ ఆధారంగా అతని కోసం గాలిస్తున్నారు. ఉన్నతస్థాయిలో వున్న అధికారులపై ఇటువంటి పోస్ట్‌లు పుంటితే కఠిన చర్యలు తీసుకుంటామని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు.

## రేపు టిజిపిజిసెట్-2026 ఫలితాల విడుదల

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అను బంధ కళాశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవే శాల కోసం జులై 8 నుంచి 16 వరకు నిర్వహించిన టీజీపీజీసెట్-2026 ఫలితాలను రేపు(బుధవారం) విడుదల చేయనున్నారు. టీజీపీజీసెట్-2026ను కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో విడుదల చేయనున్నట్లు పిజిసెట్-2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల సోమవారం తెలిపారు.

## బ్రిక్స్ ఎసిడబ్ల్యుజి 2వ సదస్సుకు ఆతిథ్యమిస్తున్న భారత్

### 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో సమావేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు3: బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం (ఏసీ డబ్ల్యుజి) రెండో సమావేశానికీ, అస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశానికీ భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) ఆతిథ్యమివ్వనుంది. బ్రిక్స్-2026కు భారత అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో 2026 ఆగస్టు 4,5 తేదీల్లో తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.భారత అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ ఇతివృత్తమైన స్థితిత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం స్ఫూర్తిగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ప్రారంభిస్తారు. బ్రిక్స్ సభ్యదేశాల ప్రతినిధులతో పాటుగా సీనియర్ విధాన రూపకర్తలు, నిపుణులు, ప్రాక్టీషనర్లు, అవినీతి నిరోధక, లా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. 2026 జూన్ 2,3 తేదీల్లో వర్చువల్‌గా జరిగిన బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం మొదటి సమావేశం ఫలితాల ఆధారంగా హైదరాబాద్ సమావేశం జరుగుతోంది. ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిని ఎదుర్కోవడం, పాలనలో పారదర్శ కతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై బ్రిక్స్ సభ్యదేశాలు చర్చిస్తాయి. దిగువ పేర్కొన్న అంశాల ద్వారా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడంపైనే చర్చలు దృష్టి సారిస్తాయి. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్థుల ఆచూకీని గుర్తించడానికి, అప్పగింత ప్రక్రియలకు మద్దతు ఇవ్వడానికి అనధికారిక సహకారాన్ని బలోపేతం చేయడం. ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్వర్క్ ద్వారా సమాచారాన్ని పంచుకోవడాన్ని, కార్యాచరణ సహకారాన్ని విస్తరించడం. ఫిన్‌టెక్, డిజిటల్ ఆస్తులు, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక సాధనాల నుంచి ఉత్పన్నమయ్యే అవినీతి సంబంధిత ప్రమాదాలను నివారించడంలో, ఎదుర్కోవడంలో అనుభవాలను, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం. ఆవిష్కరణ, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన అనే అంశంపై 2026 ఆగస్టు 5న ఓ ప్రత్యేక అనుబంధ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థ, పౌర భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం, పరిపాలనలో నిజాయితీని బలోపేతం చేయడానికి ఉపయోగించిన విధానాలతో సహా సాంకేతిక ఆధారిత పరిష్కారాలపై తమ అనుభవాలను పంచుకోవడానికి బ్రిక్స్ సభ్యులకు వేదికగా ఈ అనుబంధ కార్యక్రమం నిలుస్తుంది. చర్చలు, అనుభవాలను పంచుకోవడం, సహకార కార్యక్రమాల ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని ప్రోత్సహించాలనే భారత్ నిబద్ధతని హైదరాబాద్ సమావేశం తెలియజేస్తోంది. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న భారత నేతృత్వంలో జరిగే చివరి సమావేశం కావడంతో ఈ అవినీతి నిరోధక కార్యాచరణ బృంద సమావేశం ఈ ఏడాదిలో సాధించిన పురోగతిని పరిశీలన చేస్తుందని భావిస్తున్నారు. అలాగే ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిని నిరోధించడం, సాంకేతిక ఆధారిత పరిపాలన, సంస్థాగత సామర్థ్య నిర్మాణంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య స్థిరమైన సహకారానికి పునాది వేస్తుందని అంచనా వేస్తున్నారు.

## కావేరి జలాల వివాదం

### సుప్రీంకోర్టులో తమిళనాడు సర్కార్ పిటిషన్

చెన్నై, ఆగస్టు 3: కబిని, కృష్ణరాజ సాగర్ జలాశయాల నుండి 15 రోజుల పాటు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జులై 30న సెంట్రల్ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సిడబ్ల్యుఎంఎ) తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేలా కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ, ముఖ్యమంత్రి సి. జోసఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం సోమవారం (ఆగస్టు 3, 2026) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆగస్టు 12 లేదా అంతకంటే ముందుగా 4.536 టిఎంసిల నీటిని (15 రోజుల పాటు 3,500 క్యూసెక్కుల చొప్పున) విడుదల చేయాలని తమిళనాడు కోర్టును కోరింది. సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, జి. ఉమాపతిల పర్యవేక్షణలో, తుషార్ నాయర్ రూపొందించిన ఈ పిటిషన్‌ను న్యాయవాది బి. కరుణాకరణ్ దాఖలు చేశారు. జూన్ 1 నుండి ఆగస్టు 12 వరకు అంతర్ రాష్ట్ర సరిహద్దు పాయింట్ అయిన బిల్లిగుండులు వద్ద ఏర్పడిన నీటి కొరతను ప్రొరేటా (నిష్పత్తి) పద్ధతిలో భర్తీ చేసేలా కర్ణాటకను తగిన ఆదేశాలు జారీ చేయాలని, ఇందుకోసం తక్షణమే 26.954 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరుతూ సిడబ్ల్యుఎంఎని ఆదేశించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరింది. అలాగే, కర్ణాటక జలాశయాల్లోని నీటి ప్రవాహాలను ప్రతి 10 రోజులకు ఒకసారి పర్యవేక్షించాలని, బిల్లిగుండులు వద్ద నిర్ణీత నెలవారీ/ రోజువారీ నీటి విడుదలను నిర్ధారించాలని సిడబ్ల్యుఎంఎని ఆదేశించాలని కూడా కోరింది. మరోవైపు, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నీటి పరిస్థితి "కొంచెం మెరుగుపడింది" పేర్కొంటూనే, ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన కన్నడ సంఘాలను తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

## మల్యాలలో విషాదం

### ప్రమాదవశాత్తు కుంటలోపడి ఇద్దరు హాస్టల్ విద్యార్థుల దుర్మరణం

### ఈత సరదానే ప్రాణం తీసిందా?

మల్యాల/జగిత్యాల జిల్లా, ప్రభాతవార్త: జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ కు చెందిన ఇద్దరు విద్యార్థులు సోమవారం నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. హాస్టల్ కు చెందిన 4 వ తరగతి విద్యార్థి జగన్నాథ సుశాంత్ ( 10) 5 వ తరగతి విద్యార్థి పవన్ విష్ణు (11) లు సోమవారం ఉదయం హాస్టల్ నుండి పక్కనే గల ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు, పాఠశాల సమయం ముగిసిన అనంతరం తిరిగి వీరిద్దరూ హాస్టల్ కు రాలేదని తెలిసింది, కాగా హాస్టల్ కు సమీపంలో గల కొత్త కుంట ఒడ్డుపై ఇద్దరి విద్యార్థుల దుస్తులు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు, కొద్దిరోజు సమీపంలోని ఉన్న ఈ కుంటలో ఇటీవల వర్షాలకు అధికంగా నీరు చేరింది, అయితే విద్యార్థులు సరదాగా ఈత స్నానానికి వెళ్లి ప్రమాదంలో ప్రమాదవ శాత్తు కుంటలో జారి పడ్డట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, కుంటలో భారీ స్థాయిలో నీరు చేరడం వల్ల విద్యార్థులు మృతి చెందినట్లు భావిస్తున్నారు, కుంటలో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలను పోలీసులు జాలర్లను రప్పించి బయటకు తీశారు, సంఘటన స్థలానికి జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి మల్యాల సిఐ రాజ్యనాథ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ సందీప్ వెళ్లి సంఘటనపై దర్యాప్తు చేపట్టారు, మృతి చెందిన విద్యార్థులను పోస్టుమార్టంకై జగిత్యాల ఆసుపత్రికి తరలించారు, ఇదిలా ఉండగా, విద్యార్థులు మృతికి గల కారణాలపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, హాస్టల్ నుండి ఉదయం బయలుదేరిన విద్యార్థులు పాఠశాల మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది, కుంటలో ఈతకు వెళ్లారా, టాయిలెట్ కై వెళ్లిన సందర్భంలో ప్రమాద వశాత్తు జారి మృతి చెందారాన్న కోణంపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

## డిగ్రీలో 2.47 లక్షల సీట్లు ఖాళీ

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: రాష్ట్రంలో డిగ్రీలో ఈ యేడాది 2,47,740 సీట్లు ఖాళీగా ఉన్నాయి. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)-2026 పేరుతో అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో సీట్లు కేటాయింపు చేసి కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పించారు. అలాగే స్పెషల్ ఫేజ్‌ను సైతం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు, ప్రభుత్వ రంగ డిగ్రీ కాలేజీలు 929 ఉండగా వాటిలో 4,37,809 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,90,069 మంది చేరారు. ఇంకా 2,47,740 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ మధ్యనే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇంజినీరింగ్‌లో సీటు పొందలేక పోయినవారు డిగ్రీలో చేరాలని భావిస్తున్న నేపథ్యంలో విద్యా ర్థులు, ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాల విజ్ఞప్తుల మేర కు తెలంగాణ ఉన్నత విద్యా మండలి మరోసారి స్పెషల్ డ్రైవ్ ఫేజ్ అడ్మి షన్లను చేపట్టాలని నిర్ణయించినట్లు దోస్త్-2026 కన్వీ నర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి నిర్ణయించి అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం జారీ చేశారు.

స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌లో రూ. 400తో ఈ నెల 6 నుంచి 11 వరకు రిజిస్ట్రేషన్ చేసు కోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 6 నుండి 12 వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 12న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వ హించనున్నారు. ఈ నెల 14న సీట్ల కేటా యింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ ఇవ్వడానికి అవకాశం కల్పించారు.. ఈ నెల 17, 18 తేదీల్లో ఆయా కాలేజీల్లో చేరాలని సూచించారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్-2 వెబ్ ఆప్షన్లను ఈ నెల 20, 21 తేదీల్లో అవకాశం కల్పించగా.. ఈ నెల 22న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు బాలకిష్టారెడ్డి ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సాయంత్రం వరకు దోస్త్ ఆన్‌లైన్ కాలేజీల్లో 1,61,560 సీట్లు భర్తీ కాగా, ఆఫ్‌లైన్‌లోని డిగ్రీ కాలేజీల్లో 28,509 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు 1,90,069 సీట్లు భర్తీ అయ్యాయి.

**6 నుంచి స్పెషల్‌డ్రైవ్ ఫేజ్ అడ్మిషన్లు**

**12 వరకు ఆప్షన్లకు అవకాశం.. 14న సీట్ల కేటాయింపు**

**17, 18 తేదీల్లో కాలేజీల్లో చేరాలి**

## పోలీస్ శాఖ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

### నిరుద్యోగ జెఏసి నేత కొండంగల్ రవి

హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 3, ప్రభాతవార్త:ప్రభుత్వం ప్రకటించిన 7,437 పోస్టులతో పాటు, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 19వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ నేత కొండంగల్ రవి డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు చౌరస్తాలో నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వందలాది మంది నిరుద్యోగులతో నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నోటిఫికేషన్ ఆలస్యం అవటంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని, కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవ త్సరాలకు పెంచాలని కోరారు. దరఖాస్తు రుసుము తగ్గించాలని విజ్ఞప్తి చేశా రు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, 19వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయకపోతే అసెంబ్లీ ముట్ట డిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇందిరాపార్కు చౌరస్తాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జేఏసీ నేతలు మధుసూదన్, శ్రీకాంత్ రాథోడ్, వీరేశ్, కరుణాకర్, ప్రతాప్, శివ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


వార్త

వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.

- ఆర్థర్ మిల్లర్

# కావేరి రావణకాష్ఠమేనా?

రెండు దక్షిణాది రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వినియోగ సమస్య మళ్లీ రాజుకుంటోంది. కర్ణాటక తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇదే తరుణంలో తమిళనాడుకు రోజుకి 3,500 క్యూసెక్కుల చొప్పున 4.5 టిఎంసిల నీటిని విడుదల చేయాలని కావేరి జలాల యాజమాన్య ప్రాధికార సంస్థ (సిడబ్ల్యుఎంఎ), కావేరి జలాల నియంత్రణ కమిటీ (సిడబ్ల్యుఆర్‌సి)లు ఆదేశించడంతో మళ్లీ ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. ఈ యేడాది సాధారణ వర్షపాతంలో కేవలం 35 శాతం మాత్రమే నమోదైన పరిస్థితులలో కావేరి జలాల విడుదల విషయంలో కర్ణాటక ప్రభుత్వం ససేమిరా అంటోంది. కాగా ఆదివారం కర్ణాటకలో ప్రభుత్వ పక్షాన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కావేరి విషయంలో తమ సొంత ప్రయోజనాలే ముఖ్యమని, వాటిని చట్టపరిధిలోనే నిలబెట్టుకుందామని కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ విజ్ఞప్తి చేశారు. జల వివాద పరిష్కారానికి ఈనెల 13న కన్నడ సంఘాలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈనేపథ్యంలో ఎలాంటి బంద్‌లకు పిలుపునివ్వొద్దని రాజకీయ పార్టీలు కన్నడ సంఘాలను ఆయన కోరారు. తనతో భేటీ అప్పుడే కాదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు కర్ణాటక సిఎం శివకుమార్ హితవు చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి విధ్వంసరచన మంచిదికాదని ఉభయ రాష్ట్రాలు తలపోయడం మంచిదే. కావేరి నది కర్ణాటకలో పుట్టి తమిళనాడు పుదుచ్చేరి, కేరళ గుండా ప్రవహిస్తుంది. ఇది వందేళ్ల నాటి జగడం. ప్రతి వేసవికి, యేటా వచ్చే నైరుతి రుతుపవనాల వైఫల్యానికి ఈ చిచ్చు రగులుతుంటుంది. కర్ణాటక కావేరి నదిలో చెప్పుకోదగిన జలరాశులేమీలేవు. ఉన్న నీటినిసాగునీటికే కాకుండా కేవలం తాగునీటి చెరువులను నింపేందుకు కాలవల ద్వారా నీటిని పంపిస్తున్నామని ఆ రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తోంది. గత యేడాది తమిళనాడుకు 31 టిఎంసిల నీటిని విడుదల చేసింది. ఈ యేడాది కావేరి జలాశయాల్లో తగినంత నీరు లేదు. ఈ కారణం చేత పొరుగు రాష్ట్ర ప్రయోజనాలను పూర్తి స్థాయిలో కాపాడే పరిస్థితి కర్ణాటకకు లేదు. గతంలో ఎప్పుడు కావేరి ఎండిపోయి నీటి సమస్య వచ్చినా బంద్‌లు, విధ్వంసాలు, రాస్తారోకోలు వంటి కార్యాచరణకు రైతులు పూనుకునేవారు. ఈసారి ఉభయ రాష్ట్రాల మధ్య చిచ్చు రగలకుండా ప్రభుత్వాలు కృషి చేయడం ఆహ్వానించదగిన పరిణామం. కర్ణాటకలోని అఖిల పక్షాలు ప్రధానిని కలవనున్నాయి. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారంగా 'మేకెదాటు' ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం ముందుకు తెచ్చింది. తమిళనాడు ఇంకా రంగంలోకి దిగలేదు. కానీ గతంలోలా కాకుండా ఈసారి ఆయా ప్రభుత్వాల ఆలోచనావైఖరి మారి ఉభయ రాష్ట్ర ప్రయోజనాలకు ఉమ్మడి కార్యాచరణ, సామరస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న యోచన చేస్తుండడం మంచిదే. గతంలో ఉద్యమాల వైఖరిఎటూ తేల్చకుండా సమస్యను పెండింగ్‌లో ఉంచి చప్పున చల్లార్చే తతంగంలా జరిగింది. దానితో సమస్య పరిష్కారం కాదుకదా! ఉభయ రాష్ట్రాల ప్రజలు రైతాంగం మధ్య ఆవేశకావేశాలు మాత్రం చల్లారేవికాదు. అందుకనే అంతరాష్ట్ర నదీజలాల వివాదాల సుడిలో కర్ణాటక, తమిళనాడుల మధ్య భావోద్వేగాలు రేకెత్తడం పరిపాటిగా మారింది. అత్యంత సుదీర్ఘకాలంగా కావేరి జలజగడాలు రావణ కాష్ఠంలో కాలుతోంది. కావేరి బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి మట్టాల తగ్గుదల కారణంగా జలజగడాలు ప్రారంభమవుతున్నాయి. ఏ రాష్ట్ర సమస్య వారిది. ఎవరి ప్రయోజనాలు వారు కాపాడుకోవాలన్న ఆరాటం. ప్రతిసారీ రాజకీయ పార్టీలు, రైతుసంఘాల ఆందోళనలు, బంద్‌కు పిలుపునివ్వడం షరా మామూలే. మళ్లీ ఈసారీ అదే దారిలో ఘర్షణలు పెరిగే పరిస్థితి ఉంది. కావేరి నదిని 2018లో సుప్రీంకోర్టు జాతీయ ఆస్తిగా ప్రకటించి 2రాష్ట్రాలు వాడుకోదగిన వాటాలను ఖరారుచేసింది. ఆ ప్రకారంకర్ణాటకకు 284.75 టిఎంసిలు, తమిళనాడుకు 404.25 టిఎంసిల నీటి వాటాదక్కింది. ఇందులోనే బెంగళూరు తాగునీటి అవసరాల బాధ్యత కూడాచేపట్టింది. ఐదు రాష్ట్రాల రాజకీయ భావోద్వేగాలను అదుపులో పెట్టుకుని సంయమనం పాటించి ఒక అవగాహనకువస్తే ఉభయతారకంగా ఉంటుంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంతో ఉన్నందున ముందుగా ఒక అవగాహనకు రావాలి. రుతుపవనాల అనిశ్చితితోపాటు ఈసారి ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు తారాట్లాడుతుండగా వర్షపాతంలోటు కనపడుతోంది. మళ్లీ పొరుగు రాష్ట్రాలు జలజగడాల దారి పడుతున్నాయి. దాదాపు రెండు రాష్ట్రాలు సాంప్రదాయ వరినే పండిస్తున్నాయి. ఇది వర్షాధార సాగు దాంతో నీటిమీద ఆధారపడితే తప్ప సాగు, సమృద్ధి కానేరదు. ఎప్పుడు కావేరి నదీజలాలపై ఆందోళనలు ప్రారంభమైనా ఆస్తినష్టం జరిగేది. వివాదం తారాస్థాయికి చేరేది. ఫలితంగా భారీ అల్లర్లు విధ్వంసం. కానీ ఎన్నడూ శాశ్వత పరిష్కారం దొరికిన దాఖలాలు లేవు. 1991లో కావేరి నీటి పంపకాల తీర్పుల సమయంలో గొడవలు జరిగి, భాషాప్ర యుక్తదాడులు జరిగాయి. 2016 సెప్టెంబరులో సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు తమిళనాడుకు నీటిని విడుదల చేయాల్సివచ్చినప్పుడు కర్ణాటకలో రైతులు ఆందోళనకు దిగారు. తమిళనాడులో కరువై, సాంబ పంటలకు జులై నెలలో నీరుకావాలి. దాని కోసమే ఆ రాష్ట్రం ఆరాటం. ఈసారైనా ఉభయ రాష్ట్రాలుశాశ్వత పరిష్కారం కోసం ఆలోచించాలి. ఏ ఆందోళనలకు దారి తీస్తాయో తెలియకుండా ఉంది. ఈసారైనా ఉభయ రాష్ట్రాలు శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించాలి.



ఓర్పు, నేర్పు, సహనం ఉన్నవారికి కార్యసిద్ధి నిశ్చయం. ఓర్పుగా ఆలోచించగలిగితేనే చేయగలిగిందేదో చేయగలరు.

కె. స్టానిస్లావిస్కీ



ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.


జి. ఇలియట్

# ఇంధన భద్రతకు 'సముద్ర మథనం'

**దేశీయ ఇంధన వనరులను పెంచడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడంవంటి అనేక లక్ష్యాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో కీలక రంగాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడం నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమైన విధానాల్లో ఒకటి. ఆ క్రమంలో సముద్ర మంథన్ మరో ముఖ్యమైన అడుగు. సముద్ర గర్భంలో ఉన్న సంపదను వెలికితీయడం ఎంత ముఖ్యమో, దానిని శాస్త్రీయంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే, భారతదేశ ఇంధన భద్రత మరింత బలోపేతమై, స్వావలంబన దిశగా దేశ ప్రయాణానికి ఇది ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.**

వనకల్ల వీరప్ప

భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఇంధన అవసరాలు కూడా పెరుగుతున్నాయి. పరిశ్రమలు, రవాణా, వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పట్టణ జీవనం. ఇలా ప్రతి రంగానికీ ఇంధనం అవసరం. ఈ అవసరాలను తీర్చేందుకు ఇతర దేశాలపై ఎక్కువగా ఆధారపడటం దీర్ఘకాలంలో దేశ ఆర్థికవ్యవస్థకు భారంగా మారే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మారడం, వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలు,యుద్ధాలు, సరఫరాలో అంతరాయాలు వంటి పరిణామాలు మన ఇంధన భద్రతను ప్రభావితం చేయగలవు. అందుకే దేశంలోనే లభించే వనరులను గుర్తించి వినియోగించుకోవడం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో సముద్ర గర్భంలో దాగి ఉన్న చమురు, సహజవాయు నిల్వలను అన్వేషించేందుకు రూ.84,084 కోట్లతో సముద్ర మంథన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే ఐదేళ్లలో లోతైనసముద్ర ప్రాంతాల్లో విస్తృతంగా తవ్వకాలు చేపట్టడం, సముద్ర గర్భంలోని వనరులపై సమగ్ర సమాచారం సేకరించడం, గుర్తించిన నిల్వల నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ఈ కార్యక్రమంలోని ప్రధాన లక్ష్యాలు. ఇది కేవలం చమురు, సహజవాయు కోసం చేసే అన్వేషణ కాదు. దేశ భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన దీర్ఘకాలిక ప్రణాళిక. సముద్రమంథనం మన పురాణాల్లో దాగిఉన్న అమృతాన్ని వెలికితీసినఘట్టం. అదే భావనను ఆధునిక కాలానికి అన్వయిస్తూ సముద్ర గర్భంలోని సహజ సంపదను వెలికితీసే కార్యక్రమానికి 'సముద్ర మంథన్' అనే పేరు పెట్టడం అర్థవంతంగా ఉంది. అయితే దీని లక్ష్యం కేవలం చమురు, సహజవాయు ఉత్పత్తిని పెంచడం మాత్రమే కాదు. విదేశీ పరిణామాల వల్ల ఇంధన సరఫరాకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, దేశ అవసరాలకు తగినంత ఇంధనాన్ని సాధ్యమైనంత వరకు దేశీయంగా సమకూర్చుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో లోతైన సముద్రాల్లో తవ్వకాలు, సముద్ర గర్భంపై సమాచార సేకరణ, ఉత్పత్తికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, చమురు-సహజవాయు రంగానికి అవసరమైన పరికరాలు, సేవా కేంద్రాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా సముద్ర గర్భానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడంపై చూపుతున్న శ్రద్ధ ఎంతో కీలకం. ఎక్కడ చమురు లేదా సహజవాయు నిల్వలుండే అవకాశం ఉందో తెలుసుకోవడానికి సముద్ర గర్భంలోని భౌగోళిక నిర్మాణాన్ని ముందుగా అధ్యయనం చేయాలి. ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులతో ఈ సమాచారాన్ని విశ్లేషించడం వల్ల అన్వేషణలో సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేయవచ్చు. లోతైన సముద్రాల్లో అన్వేషణ సాధారణ తవ్వకాలతో పోలిస్తే ఎంతో క్లిష్టమైనది. భారీ యంత్రాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన సిబ్బంది అవసరం. పెట్టుబడి కూడా ఎక్కువే. ఈ కారణంగా ప్రారంభ దశలో ప్రభుత్వ సహకారం చాలా అవసరం. ప్రభుత్వం మద్దతు ఇస్తే ప్రైవేటు సంస్థలు, సాంకేతిక సంస్థలు కూడా ఈ రంగంలోకి రావడానికి ముందుకు వస్తాయి. దేశీయ సంస్థలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనుభవం ఉన్న సంస్థల భాగస్వామ్యంతో కొత్త సాంకేతికతమనకు అందుబాటులోకి వచ్చే అవకాశంఉంటుంది. ఈ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి కూడా బలాన్ని చేకూరుస్తుంది. ఆత్మనిర్భరత అంటే ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడం కాదు.



మనకు అవసరమైన కీలకరంగాల్లో మన సామర్థ్యాన్ని పెంచుకుని, ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవడం. దేశంలోనే చమురు, సహజవాయు ఉత్పత్తి పెరిగితే దిగుమతులపై ఒత్తిడి కొంత తగ్గుతుంది. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకునే అవకాశంఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరిగినా వాటి ప్రభావాన్ని కొంతవరకు నియంత్రించగలుగుతాం. ఇక ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనం కేవలం ఇంధన రంగానికే పరిమితంకాదు. లోతైనసముద్ర అన్వేషణకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, నౌకలు, సాంకేతిక సేవలు, ఇంజినీరింగ్ పనులు, సమాచార విశ్లేషణ వంటి అనేక రంగాలుఅభివృద్ధి చెందుతాయి. దేశీయ సంస్థలకు కొత్త అవకాశాలులభిస్తాయి. కొత్త నైపుణ్యాలు అవసరమవడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశంఉంది. ఈవిధంగా సముద్రమంథన్ దేశ పారిశ్రామిక రంగానికికూడా కొత్త ఊపునిచ్చే సామర్థ్యం కలిగి ఉంది. ఇంధనం విషయంలో స్వావలంబనకు ఆర్థిక ప్రాధాన్యంతో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యమూ ఉంది. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ సజావుగా సాగాలంటే ఇంధన సరఫరా నిరంతరంగా ఉండాలి. అంతర్జాతీయ సంక్షోభాలు,యుద్ధాలు లేదా సరఫరా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడినప్పుడు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అందువల్ల దేశీయ వనరులను అభివృద్ధి చేసుకోవడం ఆర్థిక అవసరం మాత్రమే కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కూడా. అయితే సముద్ర సంపదను వినియోగించుకునే క్రమంలోపర్యావరణాన్ని విస్మరించకూడదు. సముద్రంలో అనేక రకాల జీవులు, చేపల సంపద, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలున్నాయి. తీర ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారుల జీవనోపాధి కూడా సముద్రంపైనే ఆధారపడి ఉంది. కాబట్టి అన్వేషణ పనులు చేపట్టేటప్పుడు సముద్ర జీవవైవిధ్యానికి, మత్స్యకారుల ప్రయోజనాలకు నష్టంకలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆధునిక భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నియమాలు కచ్చితంగా అమలు చేయాలి. అలాగే భారీగానిధులు కేటాయించడం మాత్రమే కార్యక్రమం విజయానికి హామీ కాదు. పనులు నిర్ణయించిన సమయంలో పూర్తికావాలి. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలి. నిపుణుల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలి. అనుమతుల విషయంలో అనవసర జాప్యం లేకుండా చూడాలి. పెట్టుబడిదారులకు స్పష్టమైన విధానాలు, స్థిరమైన నిబంధనలు ఉండాలి. అప్పుడే ఈభారీ కార్యక్రమం ఆశించిన ఫలితాలను అందిస్తుంది. భారతదేశ భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో చమురు, సహజవాయుతో పాటు సౌర, పవన, జల, అణు, హరిత ఇంధన వనరులకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకదానిని మరొకదానికి ప్రత్యామ్నాయంగా చూడకుండా, అన్నింటినీ సమన్వయం చేసుకున్న సమగ్ర ఇంధన విధానం అవసరం. దేశీయ చమురు, సహజవాయు అన్వేషణ ఆ విధానంలో ఒకముఖ్యమైన భాగంగా ఉండాలి. ఈదృష్టితో చూస్తే సముద్ర మంథన్ ఒక సాధారణ ప్రభుత్వ పథకం కాదు. భారతదేశం తన సముద్ర సంపదను కొత్త కోణంలో చూసే ప్రయత్నం. దేశీయ ఇంధన వనరులను పెంచడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడంవంటి అనేక లక్ష్యాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో కీలక రంగాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడం నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమైన విధానాల్లో ఒకటి. ఆ క్రమంలో సముద్ర మంథన్ మరో ముఖ్యమైన అడుగు. సముద్ర గర్భంలో ఉన్న సంపదను వెలికితీయడం ఎంత ముఖ్యమో, దానిని శాస్త్రీయంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే, భారతదేశ ఇంధన భద్రత మరింత బలోపేతమై, స్వావలంబన దిశగా దేశ ప్రయాణానికి ఇది ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది. ●

# యువతరం జోరుతో ఊపందుకున్న ఉద్యమాలు

ఐ.ప్రసాదరావు

నీట్ పేపర్ లీక్ అయిన తరువాత విద్యావ్యవస్థలో ప్రక్షాళన కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ మొదటిగా సామాజిక మాధ్యం ద్వారా చేపట్టిన నిరసన ఉద్యమం అనతికాలంలోనే ప్రత్యక్షరూపం ధరించి, చివరికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా వరకూ దారితీసింది. ఇంకా వారి పలు డిమాండ్ల సాధన కోసం పలువిధాలుగా దేశ వ్యాప్తంగా గళం విప్పుతున్నారు. ఇటువంటి సమయంలో మరికొన్ని 'కాపీ క్యాట్' ఉద్యమాలు దేశవ్యాప్తంగా పలు అంశాలపై సామాజిక మాధ్యమాల ద్వారా పురుడు పోసుకుంటున్నాయి. ముఖ్యంగా కుల ఆధారంగా కాకుండా ప్రతిభ, సమాన అవకాశాలు ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలి అని 'రిజర్వేషన్ హటావో' సామాజిక ఉద్యమం ఊపందుకుంది. ఇంకా నాణ్యమైన పెట్రోల్ కావాలని 'ఈ 20జనతా పార్టీ' కబూతర్, జనరల్, జాతివాద్, భగ్వా జనతా పార్టీ వంటి అనేక సామాజిక మాధ్యమాల నిరసన ఉద్యమాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమతమ సాంప్రదాయ పద్ధతిలో, వేచిచూసే ధోరణితో పనిచేస్తే, ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుంది. దీనికి ప్రధాన కారణం గత 30 సంవత్సరాలుగా వారు అధికారం నిలబెట్టుకోవడానికి ఓటు బ్యాంకు రాజకీయాలు చేసారు తప్పా, యువత ఆకాంక్షలను నెరవేర్చే దిశగా అడుగులు వేయలేదు. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్లే నిరుద్యోగ యువత రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొంది. ముందుగా ఈ 'జెన్ జెడ్ యువత' అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సెల్‌ఫోన్ ఇతర యాప్‌ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో వారివారి అభిప్రాయాలను షేర్ చేసుకుంటూ ఉద్యమాలకు ఊపిరులు ఊదుతూ, పాలకులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తదుపరి ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటున్నారు. దీంతో అధికార పార్టీ ఆపసోపాలు పడే పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేతనే నేటి ప్రభుత్వాలు ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో పేరుకుపోయిన అసంతృప్తిని తొలగించి, వారి సమస్యలు పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు వివిధ ఉద్యోగ, ఉన్నత విద్యా అర్హత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు తరచూ లీక్ అవడంతో మనస్తాపం చెందిన యువత, విద్యార్థులు, సామాజిక మాధ్యమాల ద్వారా ఒకటై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఇటీవల కాలంలో 152 పేపర్ లీక్‌లు అయినట్లు తెలుస్తోంది.. ముఖ్యంగా ఎంతో కష్టపడి, తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లో లక్షలు, వేల రూపాయలు ఖర్చు చేసి చదివిస్తున్నారు. తీరా ఈ లీక్‌లు వలన పిల్లలు భవితవ్యం, తల్లిదండ్రులు భవితవ్యం మృగ్యంఅవుతుంది. కొంతమంది విద్యార్థులు తీవ్రంగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనికంతటికీ కారణం అవినీతి, వ్యవస్థలో లోపాలు, విద్య ప్రైవేటీకరణ కార్పోరేటీకరణ అవడమే సరికదా, జరుగుతున్న తప్పిదాలను ప్రభుత్వాలు సరిచేయకుండా, సమర్థించుకోవడం పరిపాటిగా మారింది. దీంతో విసుగు చెందిన యువత విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా నిరసన ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల వాగ్దానాలు పాలకులు మరవడం పెద్ద పొరపాటు అని ఇకనైనా గ్రహించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పలుచట్టాలు మార్చాలి. ముఖ్యంగా యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఎప్పుడూ కార్పోరేట్ ప్రపంచానికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం మానాలి. సంపన్నులు అభివృద్ధే దేశాభివృద్ధి అనే భావన నుంచి నేటి ప్రభుత్వాలు బయటపడాలి. ●

# మధ్యాహ్న భోజన ఏజెన్సీల వెతలు తీరేదెన్నడు?



కామిడి సతీష్ రెడ్డి

విద్యార్థుల కడుపు నింపేందుకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం చెల్లించేబిల్లులు ఏమాత్రం పొంతన లేకపోవడంతో వంట చేయడం ఆర్థిక భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్డు బయట మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.9 ఉండగా, ప్రభుత్వం రూ.6 మాత్రమే చెల్లిస్తుండడం ఎంతవరకు సమంజసమని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకం వంటఏజెన్సీలకు భారంగా మారుతోంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి రోజురోజుకూ పెరుగుతోన్న కూరగాయలు, నిత్యావసర సరుకులతోపాటు కోడిగుడ్ల ధరలు అడ్డంకిగా మారుతున్నాయి. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లిస్తున్న వంట ఖర్చులు ప్రస్తుత మార్కెట్ ధరలకు ఏమాత్రం సరిపోవడంలేదు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు రవాణా చార్జీలు పెరిగాయి. దీంతో నిత్యావసర సరుకుల ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయల దిగుబడి తగ్గిమార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పెరిగిపోతున్నాయి. ఇటీవలకాలంలో కోడిగుడ్ల ధరలు సైతం గణనీయంగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన మధ్యాహ్న భోజన మెనూను అమలు చేయడం కష్టసాధ్యంగా మారిపోతోందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు లక్షల సంఖ్యలో వున్నాయి. వీరికి పీఎం పోషణ్ మధ్యాహ్నభోజన పథకం కింద అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను భరిస్తోంది. మధ్యాహ్న భోజనం అందించడానికి కుక్స్ కం హెల్పర్స్ ఏజెన్సీలుగా పనిచేస్తున్నారు. ప్రతీరోజు మెనూ ప్రకారం వంటలు చేసి వడ్డిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం ప్రస్తుతం రోజువారి చార్జీల కింద ఏజెన్సీలకు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.6.78పైసలు, ప్రాథమికోన్నత (6 నుంచి 8వ తరగతి) విద్యార్థులకు రూ.10.17, ఉన్నత పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు రూ.13.17 చెల్లిస్తున్నారు. కోడిగుడ్డుకు అదనంగా రూ.6 చెల్లిస్తారు. ప్రస్తుత మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు ఒక్కో విద్యార్థికి ఒక్కో కోడిగుడ్డును అందించాల్సి ఉంటుంది. అదేవిధంగా పారితోషికంగా నెలకు రూ.3వేలు చెల్లించనున్నారు. ఒక్క కోడి గుడ్డుపై రూ.2భారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంకోసం ప్రభుత్వం అందిస్తున్న మెస్‌చార్జీ, వంట ఖర్చులు మార్కెట్‌ధరల ప్రకారం ఏమాత్రం సరిపోని పరిస్థితులున్నాయి. విద్యార్థులకు వారంలో మూడు రోజులు అందించే ఒక్క కోడిగుడ్డుపైనే రూ.2



అదనపు భారం ఏజెన్సీలపై పడుతోంది. వంటగ్యాస్, కూరగాయలు ధరల పెరుగుదలతో ఏజెన్సీల నిర్వాహణ మోయలేని భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీల్లో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసే సన్న బియ్యం, మినహా మధ్యాహ్న భోజన, మెనూ ప్రకారం సిద్ధం చేయడానికి అవసరమైన నిత్యావసర సరుకులు ఏజెన్సీలే సమకూర్చాల్సి ఉంటుంది. దీంతో ప్రస్తుతం పెరుగుతున్న ధరల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా వారానికి మూడు కోడిగుడ్లు అందించడం ద్వారా సంబంధిత ఏజెన్సీల మీద ఆర్థిక భారం పడుతుంది. వారం రోజుల మెనూ అమలు సైతం సమస్య అవుతుంది. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో సోమవారం నుంచి శనివారం వరకు మెనూ నిర్ణయించింది. ఈ మెనూ ప్రకారం కూరగాయలు, సాంబారు, పప్పు దినుసులు, ఆకు కూరలతోపాటు చిక్కి వంటి పోషకాహార పదార్థాలను అందించాల్సి ఉంటుంది. అయితే పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో నాణ్యమైన భోజనం అందించడం కష్టసాధ్యమవుతుందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల ప్రభావం కూరగాయల దిగుబడిపై పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్న టమాట, బీరకాయ, బెండకాయ, బీన్స్,క్యారెట్, ఆకుకూరల ధరలు సైతం గణనీయంగా పెరిగాయి. పప్పులు,వంట నూనె, పసుపు, కారం ఇతర మసాల దినుసుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. వంటగ్యాస్ ధరలు పెరగడంతో ప్రభుత్వం నిర్ణయించిన వంటచార్జీలతో నాణ్యమైన సరుకులు అందించలేకపోతున్నామని నిర్వాహకులు అంటున్నారు. నాణ్యతలో రాజీపడినప్పటికీ ప్రతీనెల అప్పులుచేసి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు చెబుతున్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట చార్జీలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని వంట ఏజెన్సీలు కోరుతున్నాయి. పెరిగిన ధరల ప్రకారం ప్రతీవిద్యార్థికి రూ.25 మెస్‌చార్జీగా నిర్ణయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కోడిగుడ్లు, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని సూచిస్తున్నారు. ఈమేరకు వంట ఏజెన్సీ సంఘాలు జిల్లా కలెక్టర్లకు, విద్యాశాఖాధికారులకు తమ సమస్యల పరిష్కారంకోసం వినతిపత్రాలు, ధర్నాలు, ఆందోళనలు సైతం చేపడుతున్నారు. మధ్యాహ్న భోజన వంట చార్జీలను పెంచాలి. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు కోడిగుడ్ల ధరల పెరుగుదల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలు ఆర్థికంగా నష్టపోవల్సివస్తోంది. ప్రస్తుతం మార్కెట్ రేట్లకు, ప్రభుత్వం అందిస్తున్న కుకింగ్ చార్జీలకు పొంతన లేదు. మార్కెట్‌లో ఒక్క కోడిగుడ్డు ధర రూ.8నుంచి రూ.9 ఉండగా, ప్రభుత్వం మాత్రం కేవలం రూ.6 చెల్లిస్తుంది. పిల్లలకు పెద్దసైజు కోడిగుడ్డు పెట్టడం ద్వారా ఏజెన్సీ ఒక్క కోడిగుడ్డుపై రూ.2 నుంచి రూ.3 నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కుకింగ్ చార్జీలను సమీక్షించి, తక్షణమే పెంచాలి. ప్రతీ విద్యార్థికి కనీసం రూ.25 చెల్లించాలి. వంటగ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేసి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి. ●

# ప్రజావాక్కు

## రోడ్లపై ఉమ్మివేస్తే శిక్షించాలి

మనదేశంలో ఎంత చదువుకున్నా, ఎంత నాగరీకులము అనుకున్నా ఒక్కసారి అనాగరికమైన చేష్టలు చేస్తుంటారు. ఇతరదేశాలలో రోడ్లమీద చెత్తవేస్తే జరిమానా ఉంటుంది. కారులో పోతూ అరటికాయ తింటే తొక్క దాచిపెట్టి ఆగిన చోట చెత్త బుట్టలో వేస్తారు. మనం మాత్రం ఉదాహరణకు మన దేశంలో బస్సులోపోతూ నీళ్ల తగిన బాటిల్స్, అరటితొక్కలు విసిరి బయట పడేస్తారు. అవి వెనుక వచ్చే వారి ముఖాన పడతాయి. వీలైతే తగాదా, లేకపోతే తిట్టుకుంటూ పోవడం. ఇక చెత్త సంగతి సరి. ఇలాంటిదే నిన్న బొంబాయి హైకోర్టుకు ఒక కేసువస్తే, న్యాయమూర్తులు జి.ఎస్.కులకర్ణి, ఆర్తి సాధేలు సంయుక్తంగా ఇలాచెత్త వేయ్యటాన్ని, రోడ్లమీద ఉమ్మి వేయడాన్ని చాలా తీవ్రంగా పరిగణించి, ఇలా వేసేవారిపై తగు చర్యలు తీసుకోవాలని, శిక్షి ంచాలని తెలిపారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విమర్శల పర్వం

పోయిన అధికారాన్ని లాక్కోవాలని మళ్లీ అధికార పీఠంపై అధిష్టించాలని బి.ఆర్.ఎస్ వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఎలాగోలా గెలిచి తొలిసారి తెలంగాణలో పాగా వేయాలని బిజెపి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్న పార్టీ వారిని అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ వారికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. తాము ఎంతో కష్టపడి సంపాదించుకున్న అధికారాన్ని నిలుపుకోవడానికి మరింతఎక్కువగా కష్టపడవలసిన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులపై కుళ్లు, అసూయతో కూడిన విమర్శలు చేస్తూ ఈ రెండు పార్టీలో అధికారం కోసం పాకులాడుతున్నాయి. వీరి తీరు ఇలా ఉంటే ప్రజాభిమానానికి దూరం కావలసి వస్తుంది.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## నిత్యావసర ధరలను తగ్గించాలి

ఇవాళ ప్రతి రోజూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అన్నింటిపై పన్నుల భారం పెంచుతూనే ఉన్నారు. ఇలా అన్నింటిపై ధరలు పెంచుకుంటూ పోతే సామాన్యుడుఎలా బతకాలో ఎవరూ ఆలోచించడం లేదు. పెరుగుతున్న ధరలను నిత్యం అదుపులో ఉంచడానికి ఏమార్గాలు లేవా? పాలకులు నాయకులు మేధావులు ఆలోచించాలి. సామాన్యుడిపై భారంగా మారుతున్న ఈ ధరలను అదుపు చేయలేకపోతే బతకడం కష్టం.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

## ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేసేదిశగాచర్యలు తీసుకోవాలి. నేటియుగం ఇంటర్నెట్ కాలం. పూర్వం పుస్తకం హస్త భూషణం. ప్రస్తుతం అండ్రాయిడ్ ఫోన్ హస్త భూషణం. నేటి కాలంలో అండ్రాయిడ్ ఫోన్ లేని ఇల్లులేదు. ప్రతీపాఠశాలలో వాట్సాప్‌గ్రూపులున్నాయి. ఈగ్రూపులల్లో ప్రతీరోజు పిల్లల కథలు పోస్ట్‌చేసి వారిచే చదివించాలి. ఇలా పోస్ట్‌చేసిన కథలు విద్యార్థులు ఫోన్లో గ్రంథాలయంగా ఏర్పాటు చేసుకోవాలి. వారంలో వచ్చిన కథలు ప్రతీ శనివారం నోబాగ్‌డేగా ఉంచి తరగతిలో విద్యార్థులచే చెప్పించాలి. దసరా,పండుగ సెలవుల్లో విద్యార్థులు పాఠశాల వాట్సాప్ గ్రూపుల్లో పాతవి రాయడం చేయాలి. లేదా వాయిస్స్‌తో చదివి వినిపించాలి. ఇలా చేయడం వలన పిల్లల మానసిక వికాసం సాధ్యంఅవుతుంది. ఆదివారంవచ్చే సండే మ్యాగజైన్లు కూడా పోస్ట్ చేయొచ్చు. దిన పత్రికలు కూడా ప్రతీ రోజూ పోస్ట్ చేస్తే విద్యార్థుల్లో ప్రపంచ జ్ఞానం పెరుగుతుంది. పూర్వం విష్ణుశర్మ కథలు ద్వారా రాజకుమారుల్లో మానసిక పరిపక్వత సాధించిన తీరు మనకు తెలిసిందే.

- రాళ్లబండి సంగం నాయుడు, హైదరాబాద్

## పెరుగుతున్న పేదరికం

భారత్ ఒక వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. అయితే గత రెండు దశబ్దాలలో పేదరిక నిర్మూలన జరిగిన మాట వాస్తవం. కానీ అంత కంటే ఎక్కువగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి అన్నది కూడా వాస్తవం. ఇది పేదరికం కంటే ప్రమాదకరం. 2006 లో తెచ్చిన ఉపాధి హామీ పథకం లాంటివి ప్రజల జీవనప్రమాణ స్థాయినిగ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్నిఅందుకోవడానికి ఉపయోగపడ్డాయేమో కానీ, ఆర్థిక అసమానతలు తగ్గించడంలో విఫలమయ్యాయి. ఇక్కడ ప్రభుత్వం పోషించే పాత్రకూడా ముఖ్యమే. ఎందుకంటే కార్పొరేట్ వర్గాలకు పరిశ్రమల స్థాపన పేరుతో ఇచ్చే తాయిలాలు పునాది పైన అత్యంత ధనవంతులుగా పారిశ్రామిక వేత్తలు ఎదుగుతున్నారు. పేదలు పేదలుగానే ఉండిపోతున్నారు.

- భారత అవినాష్, జనగామ

## అక్రమ వసూళ్లు ఆపాలి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు బడులు, కాలేజీలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల రక్తం పిలుస్తున్నాయి యాజమాన్యాలు. అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలను సీజ్ చేయాలి. వారిపై చర్యలు తీసుకొని అమలు చేయాలి.


-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కోర్టుల్లో 5.64కోట్ల కేసులు పెండింగ్

## సుప్రీంకోర్టులో దశాబ్దకాలంగా 10వేల కేసులు
## హైకోర్టుల్లో 30యేళ్లకు పైగా 80,660 కేసులు
## అంతేస్థాయిలో పెరిగిపోతున్న కోర్టుల్లో ఖాళీలు
## పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** దేశంలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది; సుప్రీంకోర్టులో 10,000కు పైగా కేసులు దశాబ్ద కాలంగా, హైకోర్టులలో 80,660 కేసులు మూడు దశాబ్దాలకు పైగా పరిష్కారం కోసం వేచి ఉన్నాయి. సుప్రీంకోర్టులో 96,000కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ద్వారా వెల్లడించారు. వీటిలో 10,000కు పైగా కేసులు 10యేళ్లకు పైగా పరిష్కారం కాకుండా ఉన్నాయి.
అలాగే, 558 కేసులు 20యేళ్లకు పైగా పెండింగ్‌లో ఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో 26 కేసులు 30యేళ్లకు పైగా పరిష్కారం కాలేదని ఆయన వివరించారు. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి)లో అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, సుప్రీంకోర్టు, దేశంలోని 25 హైకోర్టులు, జిల్లా/అనుబంధ కోర్టులలో కలిపి మొత్తం 5.64 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టులలో 80,660 కేసులు మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి మేఘ్వాల్ పేర్కొన్నారు. ఇది న్యాయవ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసుల తీవ్రతను తెలియజేస్తోంది.
న్యాయవ్యవస్థలో జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, కేసుల పరిష్కారం అనేది పూర్తిగా న్యాయవ్యవస్థ పరిధిలోని అంశమని మేఘ్వాల్ అన్నారు. అంటే, కేసులు పరిష్కరించడానికి కోర్టులకు కార్యనిర్వాహక శాఖ (ప్రభుత్వం) ఎటువంటి గడువులను నిర్దేశించదు.
రాష్ట్రాల వారీగా ఉన్న వివరాలు సుప్రీంకోర్టు, హైకోర్టులలోని పెండింగ్ కేసులను మాత్రమే కవర్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నివేదించిన మొత్తం 5.64 కోట్ల పెండింగ్ కేసుల సంఖ్యలో జిల్లా, అనుబంధ కోర్టులలోని కేసులు కూడా ఉన్నాయని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి) పేర్కొంది.
**జాప్యానికి కారణాలేమిటంటే..** కేసుల సంక్లిష్టత, సాక్ష్యాధారాల స్వభావం, న్యాయవాదులు (బార్), దర్యాప్తు సంస్థలు, సాక్ష్యాలు, వ్యాజ్యదారులు వంటి సంబంధిత వర్గాల సహకారం వంటి అనేక అంశాల వల్ల ఈ జాప్యం జరుగుతోందని ప్రభుత్వం వివరించింది. తగినంత మంది న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక కోర్టు సిబ్బంది, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. విధానపరమైన నియమాలను సరిగ్గా అమలు చేయడం, న్యాయ ప్రక్రియలో పాలుపంచుకునే భాగస్వాములందరి మధ్య సమన్వయంపై కూడా కేసుల సమర్థవంతమైన పరిష్కారం ఆధారపడి ఉంటుందని మేఘ్వాల్ అన్నారు.

**హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఖాళీలు కొనసాగుతున్నాయి:**
న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక సిబ్బంది లభ్యతతో సహా, తగినంత న్యాయ సిబ్బంది, మౌలిక సదుపాయాలపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని కేంద్రం పేర్కొంది. భారతీయ కోర్టులలో పెరుగుతున్న ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థలోని ఖాళీలను భర్తీ చేయడానికి చాలా వరకు త్వరితగతిన చర్యలు తీసుకున్నప్పటికీ, హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఇవి కొనసాగుతూనే ఉన్నాయి.
ప్రస్తుతం 25 హైకోర్టులలో మంజూరైన 1,122 మంది న్యాయమూర్తులకు గాను 341 న్యాయమూర్తుల ఖాళీలు ఉండగా, దిగువ కోర్టులలో మంజూరైన 30,868 మంది న్యాయమూర్తులకు గాను 7,311 ఖాళీలు ఉన్నాయి. కేసుల పరిష్కార వేగం అనేక కార్యాచరణ, విధానపరమైన అంశాలచే ప్రభావితమవుతుందని, అందువల్ల పెండింగ్ అనేది కేవలం ఒకే కారణానికి ఆపాదించదగిన సమస్య కాకుండా, బహుముఖ సమస్య అని కేంద్ర న్యాయశాఖ మంత్రి నొక్కి చెప్పారు.

## అమెరికా-ఇరాన్ మధ్య నేటి నుంచి చర్చలు



**వాషింగ్టన్, ఆగస్టు 3:** అమెరికా-ఇరాన్ మధ్య హఠాత్తుగా ఘర్షణలు ప్రారంభం అవుతుంటాయి. అవి తీవ్రరూపం దాల్చుతాయేమోనని ప్రపంచం ఆందోళనకు గురవుతున్న సమయంలో చర్చల గురించి ప్రకటన వస్తుంది. ఇప్పుడూ అదే జరిగింది. కొన్ని రోజులుగా ఇరాన్‌పై చేస్తోన్న భారీ దాడులను ప్రస్తుతానికి అమెరికా నిలిపివేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రెండు దేశాల మధ్య చర్చలు ప్రారంభం అవుతాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాము ఇరాన్‌పై భీకర దాడులు చేపట్టాలని భావించామని, అవే జరిగి ఉంటే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అది పెద్ద దాడిగా మిగిలి ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే ఘర్షణల ఆలోచన పక్కన పెట్టి, దౌత్యంవైపే మొగ్గు చూపామని పేర్కొన్నారు. మిలిటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలని పశ్చిమాసియాలోని మిత్ర దేశాలు కోరాయని ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో వెల్లడించారు.
'మేం వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. చర్చలు సోమవారం మధ్యాహ్నం ప్రారంభం అవుతాయి. చూద్దాం ఏం జరుగుతుందో. ఘర్షణల కంటే సంప్రదింపుల ద్వారా పరిష్కారానికే నేను ప్రాధాన్యంఇస్తాను. వాటి వల్ల ఎన్నో ప్రాణాలు నిలుస్తాయి. చర్చలతో విధ్వంసాన్ని అడ్డుకోవచ్చు. వాస్తవానికి ధ్వంసమైన వాటిని నిర్మించేందుకు ఎన్నో యేళ్లు పడుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందం ఎప్పటిలోగా కుదరొచ్చని ఆయనకు ప్రశ్న ఎదురైంది. 'నేనైతే ఒప్పందం కుదుర్చుకోవడానికే ఇష్టపడతాను. ఎందుకంటే ప్రజలను చంపాలని మేం అనుకోవడంలేదు. అది మాకు ఇష్టంలేదు' అని వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధి ఈ చర్చల్లో కీలకాంశమంగా ఉంటుందనేది తెలిసిందే. అలాగే ఇరాన్ అణు ప్రయత్నాల అడ్డుకట్ట వేయడమనేది మరో ముఖ్యాంశం. ఇదిలా ఉంటే.. ఈ దౌత్య ప్రయత్నాల గురించి ఇరాన్ విదేశాంగమంత్రి అరాగ్చీ సౌదీ అరేబియా విదేశాంగమంత్రి, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చర్చల ప్రకటన రాగానే ముడిచమురు ధరలు దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర ఫ్యూచర్స్ 82 డాలర్ల వద్ద కదలాడుతోంది.

## ఉప ఎన్నికలో ప్రశాంత్‌కిశోర్ విజయం
### మంజల్‌పూర్‌లో బిజెపి అభ్యర్థి గెలుపు



**పాట్నా, ఆగస్టు 3:** బీహార్‌లో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. స్వయానా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన స్థానంలోనే ఆ పార్టీ పరాజయం పాలైంది. నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన బాంకీపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ పై 20వేల పైచిలుకు ఓట్లమెజార్టీతో గెలుపొందారు. ప్రశాంత్ కిషోర్ విజయంతో జన్ సురాజ్ పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ప్రశాంత్ కిషోర్ విజయంతో ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ తాజా ఫలితం పటాపంచలు చేసింది. ఉప ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన ప్రశాంత్ కిషోర్ బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని చెప్పారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి బీహార్‌ను పాలించడాన్ని ప్రజలు ఏమాత్రం కోరుకోవడం లేదని వెల్లడించారు. విద్యావ్యవస్థను మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, బిహార్ బిడ్డలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా చూసే ఒక మంచి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని వ్యవస్థలపై మాత్రమే అని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు. స్వతహాగా వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ తన వ్యూహాలకు మరింత పదును పెట్టారు. ప్రజలతో మమేకమవ్వడానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతమైన పీకే బీజేపీ కంచుకోటలో విజయం సాధించారు. 1995 నుంచి బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా మారింది. అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బీజేపీదే పూర్తి ఆధిపత్యం. అలాంటి కమలదళం కంచుకోటను ప్రశాంత్ కిషోర్ బద్దలుకొట్టారు.
**మంజల్‌పుర్‌లో బీజేపీ అభ్యర్థి విజయం**
మరోవైపు, గుజరాత్‌లోని మంజల్‌పుర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన బికాభాయ్ రబారీపై 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. బీజేపీ ఎమ్మెల్యే యోగేశ్ పటేల్ ఆకస్మిక మరణంతో ఆ స్థానం ఖాళీ కాగా తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 182 స్థానాలకు గానూ 156 చోట్ల బీజేపీ విజయం సాధించింది.

## మిడ్‌టర్మ్, పార్టీపై పట్టుకోసం ట్రంప్ ముందస్తు స్కెచ్
### అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ ఆక్సియోస్ విశ్లేషణ

**వాషింగ్టన్,ఆగస్టు 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందస్తు రాజకీయ వ్యూహాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్, సెనెట్‌పై రిపబ్లికన్ పార్టీ పట్టు సాధిస్తుందా లేదా అనే అంశంపై ట్రంప్ ఏమాత్రం ఆందోళన చెందట్లేదని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఆక్సియోస్ విశ్లేషించింది. ఫలితాలు ఎలా వచ్చినా రిపబ్లికన్ పార్టీపై తన ఆధిపత్యం చెక్కుచెదరదని, పైగా మరింత బలపడుతుందని ట్రంప్ భావిస్తున్నట్లు ఆయన సలహాదారుల్ని ఉటంకిస్తూ సంస్థ నివేదిక విడుదల చేసింది. మధ్యంతర ఎన్నికల తర్వాత రిపబ్లికన్ పార్టీపై మరింత పట్టు సాధించి, 2028 అధ్యక్ష ఎన్నికల్ని ప్రభావితం చేయడమే ట్రంప్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొంది. రిపబ్లికన్లు కాంగ్రెస్‌లో మెజార్టీని నిలుపుకుంటే ట్రంప్‌కు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వివరించింది. ట్రంప్ దృష్టి కేవలం ప్రస్తుత తన పదవీ కాలం చివరి రెండేళ్లకే కాకుండా, తర్వాతకూడా రిపబ్లికన్ పార్టీలో తన ఆధిపత్యాన్ని కొనసాగించడంపైనే ఉంది. పార్టీలో ఇప్పటికీ ట్రంప్‌కే అత్యధిక ప్రజాదరణ ఉంది. ట్రంప్ తన అధికారాన్ని లేదా వారసత్వాన్ని సులభంగా వేరొకరికి బదిలీ చేసే వ్యక్తి కాదు. తన పొలిటికల్ నెట్‌వర్క్, ఫండ్ రైజింగ్ పవర్, బలమైన ఓటు బ్యాంక్ ద్వారా తన అధ్యక్ష పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా అమెరికా రాజకీయాల్ని శాసించాలనేదే ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ట్రంప్ డబ్బు అడిగితే ప్రజలు ఇప్పటికీ విరాళాలు ఇస్తున్నారు. అదే ఆయనకు రాజకీయ బలం అని ఒక సలహాదారు పేర్కొనడం గమనార్హం. మరో సలహాదారు మీ బ్యాంక్ ఖాతాను బట్టే మీ రాజకీయ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించినట్లు నివేదిక తెలిపింది. ఇందులో భాగంగా పార్టీని పూర్తి స్థాయిలో తన గుప్పిట్లోనే ఉంచుకోవడమే ఆయన నైజమని నివేదిక స్పష్టం చేసింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం ట్రంప్ మరోసారి అధ్యక్ష పదవికి పోటీచేసే అవకాశం ఉందా అనే అంశంపై వివాదాలు ఉన్నప్పటికీ, ఆయన మాత్రం 2028 పోటీ అవకాశాలపై చర్చను చివరి వరకు కొనసాగించే అవకాశం ఉందని ఆక్సియోస్ పేర్కొంది. అది వాస్తవంగా పోటీ చేయడానికన్నా, పార్టీపై తనప్రభావాన్ని కొనసాగించేందుకు ఉపయోగపడే రాజకీయ వ్యూహంగా కూడా ఉండొచ్చని నివేదిక అభిప్రాయపడింది. 2028 అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కాంబినేషన్‌ను బరిలోకి దింపే ఆలోచనలో ట్రంప్ ఉన్నట్లు రిపోర్ట్ వెల్లడించింది.

## ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై చైనా నిఘా




**వాషింగ్టన్, ఆగస్టు 3:** చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికాకు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వైబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలోఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.
ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్ జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం. ఆ వెబ్‌సైట్‌లో వారి వ్యక్తిగత వివరాలు సహా వారు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారనే సమాచారం నమోదై ఉంది. వీరందరినీ చైనా అధికారులు కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. వారం దరూ స్వదేశాలకు వెళ్లాక కూడా ఈ నిఘా కొనసాగుతుండడం గమనార్హం.
చైనాలోని పోలీస్ విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను విక్రయించే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు కూడా ఈ వెబ్‌సైట్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డేటా అక్కడి పోలీసులకు అందుబాటులో ఉంది.




## పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన

**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారంటూ ప్రతిపక్ష నేతలు సోమవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. విద్యార్థులపై పోలీసు లాఠీఛార్జి, రామాలయ విరాళాల చోరీ అంశాలపై అమిత్ షా జవాబుచెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌సహా పలువురు విపక్ష నేతలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. "అమిత్ షా పార్లమెంట్కు ఎందుకు గైర్హాజరు అవుతున్నారు అమిత్ షా జవాబ్ దో, అమిత్ షా ఎక్కడికి వెళ్లారు లాంటి పలు ప్రశ్నలు ఉన్న బ్యానర్లను ప్రదర్శించారు. మరోవైపు అయోధ్య రామమందిర విరాళాల చోరీ అంశంపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని విపక్ష నేతలు తీవ్ర విమర్శలు చేశారు. చందా చోర్ గద్దీ చోడ్ విరాళాల దొంగ, సింహాసనం వదిలి వెళ్లు అనే నినాదం ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిపిన లాఠీ ఛార్జ్, పెల్లెట్ గన్ గురిపెట్టడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్కు వచ్చి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం డిమాండ్ చేశారు. అలాగే ప్రధానమంత్రి పర్యవేక్షణలో ట్రస్ట్ ఉన్నప్పటికీ, శ్రీరామ మందిరానికి ఇచ్చిన విరాళాలు ఎలా చోరీకి గురయ్యాయో నరేంద్ర మోడీ చెప్పాలని అన్నారు. ఖర్గేతోపాటు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్పీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, టీఎంసీ నేత మహువా మొయిత్రా, సాగరిక ఘోష్, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, అరవింద్ గాంధీ కూడా ఇదే విధమైన డిమాండ్ చేశారు నీటి ఆందోళనకారులపైలాఠీఛార్జి ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. రామ మందిర విరాళాల చోరీ ఆరో పణల వివాదాన్ని కూడా ప్రతిపక్షం లేవనెత్తుతోంది. నేరుగా ఈ విషయంపై ప్రభుత్వాన్నే విమర్శిస్తోంది. కొద్ది రోజుల క్రితం పూర్ణియా ఎంపీ పప్పూ యాదవ్ ఒక సాధువు వేషం వేసుకొని, పార్లమెంట్ ఎదుట ఒక వ్యంగ్యాత్మకమైన స్కిట్ వేశారు. అందులో రాహుల్ గాంధీ కూడా అతిథి పాత్రలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పప్పు యాదవ్‌పై దాడి జరిగిందనే వార్తలు వచ్చాయి. ఈ తరుణంలో జరుగుతున్న పార్లమెంట్ 11వ రోజు సమావేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.


## సహజీవనంలో ఉన్న మహిళలకూ 498ఎ వర్తింపు
### పరస్పర అంగీకారంతో ఉన్న వారికే ఇది పరిమితం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** ఐపిసి సెక్షన్ 498ఎ కేవలం చట్టబద్ధమైన వివాహాలకే పరిమితం కాదని, వివాహ లక్షణాలు కలిగిన సహజీవన సంబంధానికి కూడా ఇది వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, ఆ సంబంధం పరస్పర అంగీకారంతో ఉన్న వయోజనుల మధ్య ఉండాలి. వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యం దానిలో అంతర్భాగంగా నిరూపించబడాలి. ఐపిసి సెక్షన్ 498ఎ, ఇతర నిబంధనల కింద ప్రారంభించిన క్రిమినల్ విచారణను కొట్టివేయడానికి కర్ణాటక హైకోర్టు నిరాకరించిన తీర్పుపై దాఖలైన అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ కేసులలో, నిందితులు చెల్లుబాటు అయ్యే వివాహం ఉనికిని వివాదాస్పదం చేశారు. ఫిర్యాదుదారు చట్టబద్ధంగా వివాహం చేసుకున్న భార్య అయితే తప్ప సెక్షన్ 498ఎ వర్తించదని వాదించారు. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నోంగ్మేకాపమ్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేస్తూ, "వివాహం చేసుకోవాలనే ఉద్దేశం అంతర్భాగంగా ఉన్న 'వివాహ స్వభావం గల సంబంధాల్ను'గా అర్హత పొందే 'సహజీవన సంబంధాలక్ను' సెక్షన్ 498ఎ వర్తిస్తుంద్ని అని స్పష్టం చేసింది. "స్పష్టత కోసం చెప్పాలంటే, సెక్షన్ 498ఎ ద్వారా రక్షి ంచబడే 'సహజీవన సంబంధాల్ను' అనేవి, పరస్పర అంగీకారంతో ఉన్న ఇద్దరు వయోజన వ్యక్తుల మధ్య ఉండేవ్షే అని పేర్కొంది. అప్పీలుదారుల తరఫున సీనియర్ న్యాయవాది ఆనంద్ సంజయ్ ఎం. నూలి హాజరు కాగా, రాష్ట్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ హాజరై తమ వాదనలు వినిపించారు.



## గాలిలోనే ఢీకొన్న సహాయక చర్యల హెలికాప్టర్లు: పైలట్లు మృతి

**ఏథెన్స్,ఆగస్టు 3:** గ్రీస్‌లో ఘోరం జరిగింది. అడవుల్లో చెలరేగిన కార్చిచ్చును అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న రెండు అగ్నిమాపక హెలికాప్టర్లు గాలిలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు పైలటు ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ ఏథెన్స్ లోని పసాతా తీర ప్రాంతంలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. అటికాబొయోటియా సరిహద్దులోని అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు గ్రీస్ ఫైర్ సర్వీస్‌కు చెందిన రెండు బెల్ హెలికాప్టర్లు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.



## పార్లమెంటు ప్రాంగణంలో మళ్లీ అయోధ్య విరాళాల చోరీపై నిరసన

**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా నిరసన కొనసాగించారు. రామ మందిరం విరాళాల చోరీతో పాటు విద్యార్థి నిరసనకారులపై పోలీసుల బలప్రయోగంపై పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం ముందు నిరసన చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన మహువా మోయిత్రా, జేఎంఎంకు చెందిన మహువా మాఝీ, ఆర్ఎస్పీకి చెందిన ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితర ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కేంద్రహోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు ఎందుకు రావడం లేదన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతోపాటు నినాదాలు చేశారు. రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా విరాళాల పెట్టెలను పార్లమెంట్ ఆవరణలో ఉంచారు. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాటి చుట్టూ బారులు తీరారు. కొందరు ఎంపీలు విరాళాల పెట్టెలో నగదుకూడా వేశారు. ఆ తర్వాత విరాళాల ఆదాయం లెక్కింపు సందర్భంగా చోరీ చేయడాన్ని ప్రతీతాత్మకంగా ప్రదర్శించారు.


## నా విద్య, ఆర్థిక వివరాలు ఇస్తా.. ప్రధాని మోడీ డిగ్రీని చూపించగలరా: సిజెపి చీఫ్ అభిజిత్




**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం పట్టుబట్టి సాధించుకున్న కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేపై ఇప్పుడు బీజేపీ శ్రేణులు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఓవైపు సోషల్ మీడియాలో ఆయన్ను టార్గెట్ చేస్తూనే, మరోవైపు ఆయన విదేశీ చదువులకు డబ్బులెక్కడివో విచారణ జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అభిజీత్ దిప్కే ఇవాళ ఓ వీడియో విడుదల చేసి దీనిపై వివరణ ఇచ్చారు. ఓ బీజేపీ కార్యకర్త తన విద్యాభ్యాసం ఎలా పూర్తి చేశానో తెలుసుకునేందుకు పిటిషన్ దాఖలు చేశారని అభిజీత్ దిప్కే తెలిపారు. తాను తన స్కాలర్ షిప్ లేఖతో పాటు విద్య రుణం లేఖను కూడా బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, కానీ వాళ్ల అధినేత తన డిగ్రీ చూపించేందుకు సిద్ధంగా ఉన్నారా అని అభిజీత్ ప్రశ్నించారు. వాళ్ల నేత తన అసలు డిగ్రీని చూపించగలరా అని సవాల్ విసిరారు. అయినా తన విద్యాభ్యాసంతో వీళ్లకు అంత సమస్య ఏముందని అభిజీత్ ప్రశ్నించారు. ఓ సాధారణ మధ్యతరగతి విద్యార్థి బోస్టన్ యూనివర్సిటికీ వెళ్లి చదువుకుని వస్తే వీళ్లకు అంత ఇబ్బంది ఎందుకో తెలియడం లేదని అభిజీత్ దిప్కే తెలిపారు. మీరు విద్యాభ్యాసానికి ఎందు కింత వ్యతిరేకంగా ఉన్నారని ఆయన సదరు బీజేపీ కార్యకర్తను ప్రశ్నించారు. తద్వారా తన వివరాలు అడగటం మాని, ప్రధాని మోడీ డిగ్రీని బయటపెట్టాలని దిప్కే సదరు కార్యకర్తకు సూచించారు. ఇప్పటికే ప్రధాని మోడీ విద్యార్హతల వివరాలు ఇచ్చేందుకు పలు యూనివర్సిటీలు నిరాకరించాయి. సమాచార కమిషన్ కూడా ఆ వివరాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సీజేపీ ప్రధాని మోడీని డిగ్రీ బయ టపెట్టాలని అడగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సంక్షిప్త వార్తలు

## రెండున్నరేళ్ల తర్వాత కనిపించిన ఆంగ్‌శాన్ సూకీ



**నైపితా, ఆగస్టు 3:**ఆంగ్‌శాన్‌సూకీ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు. సుమారు 2.5యేళ్ల తర్వాత ఆమె తొలిసారి బయటి ప్రపంచానికి కనిపించారు. రెడ్‌క్రాస్‌కు చెందిన అంతర్జాతీయ కమిటీ సభ్యుడితో ఆమె భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆఫొటోలను మయన్మార్ మిలిటరీ అధికారులు రిలీజ్ చేశారు. బర్మానేత ఆంగ్ శాన్‌సూకీ ఆర్మీ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. ఆంగ్‌శాన్ సూకీ ఆచూకీ లేదని రెండున్నరేళ్ల క్రితం ఆమె కుమారుడు ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. మిలిటరీ సర్కారు రిలీజ్ చేసిన ఫొటోల్లో సూకీ ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించారు.

## పెషావర్‌లో ఆత్మాహుతి దాడి: 17కి పెరిగిన మృతుల సంఖ్య



**ఖ్వెట్టా,ఆగస్టు 3:** పాకిస్థాన్ వాయువ్య ప్రాంతంలోని ఖైబర్ పఖ్తూన్ ఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఆత్మా హుతి బాంబు దాడిలో మృతుల సంఖ్య17కు పెరిగింది. గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించడంతో మృతుల సంఖ్య పెరిగినట్లు పోలీసులు వెల్లడిం చారు. స్వాత్ జిల్లాలోని కబాల్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆదివారం స్వాత్ పీస్ ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. పేలుడు ధాటికి తొలుత ఐదుగురు భద్రతా సిబ్బందితో పాటు మొత్తం 14మంది ప్రాణాలు కోల్పోగా, డజనుకు పైగా గాయపడ్డారు. తాజాగా గాయపడిన మరో ముగ్గురు మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 17కు చేరింది.

## కేన్సర్ చికిత్సకు వయాగ్రా అద్భుత ఫలితాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 2 :** పురుషుల్లో అంగస్తంభన సమస్యకు వాడే సిల్డినాఫిల్ సిట్రేట్ వయాగ్రా క్యాన్సర్ కణాల వ్యాప్తిని, కణితుల పెరుగుదలను అడ్డుకుంటున్నదని ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పరిశోధకుల అధ్యయనంలో వయాగ్రా క్యాన్సర్ వ్యాప్తి ని నెమ్మదింపజేయటంలో సహాయపడుతుందని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు లభించాయి. అయితే క్యాన్సర్‌కు చికిత్సగా సిఫార్సు చేయడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని భావిస్తున్నారు.

## బాబ్రీమసీదు కమిషన్ హెడ్ జస్టిస్ లిబర్హాన్ కన్నుమూత



**చండీఘడ్,ఆగస్టు 3:** బాబ్రీమసీదు ఎంక్వైరీ కమిషన్‌కు హెడ్‌గా ఉన్న జస్టిస్ మన్మోహన్ సింగ్ లిబర్హాన్ సోమవారం కన్నుమూశారు. ఆయన వయసు 87 ఏళ్లు. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, ఆ ఘటన జరగడానికి కారణాలు, దానితో లింకున్న అంశాలను ఆయన దర్యాప్తు చేపట్టారు. ఆగస్టు2వ తేదీ, ఆదివారం చండీఘడ్‌లో జస్టిస్ లిబర్హన్ తుది శ్వాస విడిచినట్లు పంజాబ్, హర్యానా హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రోహిత్ సూద్ తెలిపారు.

## హైలాకండి జిల్లాలో బాలికపై హత్యాచారం..

**గువాహతి,ఆగస్టు 3:** అస్సాంలోని హైలాకండి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యంత ఘోరమైన స్థితిలో మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ సభ్యులు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగిన విందుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక ఇంట్లో మృతదేహంగా కనిపించింది. ఈ కేసులో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## అయోధ్య ట్రస్టునుంచి వైదొలిగిన ఆర్ఎస్ఎస్‌నేత భయ్యాజీ



**అయోధ్య,ఆగస్టు 3:** అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలిగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసు కోవడం గమనార్హం. తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుం టున్నట్లు 78ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది.



ఉజ్జయిని మహాకాళీ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా దంపతులు

## ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్ (బేగంపేట) ఆగస్టు 3, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళీ అమ్మవారి దేవాలయంలో ఆషాడ బోనాల జాతరలో రెండోరోజు సోమవారం సాయంత్రం గవర్నర్ శివప్రతాప్‌శుక్లా దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకా రం గవర్నర్ దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వారితో పూజలు నిర్వహింపజేసారు. అనంతరం శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# రిఫరల్ హాస్పిటల్‌గా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

### అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సర్వీసులు

### అత్యాధునిక టెక్నాలజీతో ఎంఆర్ఐ సేవలు

### వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే రిఫరల్ సెంటర్‌గా తీర్చి దిద్దుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. త్వరలోనే అక్కడ కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీతో పాటు ఇతర సూపర్ స్పెషాలిటీ సేవలను దశలవారీగా ప్రారంభిస్తామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎంఆర్ఐ యంత్రాన్ని కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే ఎంఆర్ఐ సేవలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ప్రజాప్రతినిధులు చేసిన సూచనలు, హాస్పిటళ్ల అభివృద్ధి, పెండింగ్ అవసరాలను ఒక్కొక్కటిగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ఇటీవలే జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లలో 18 మంది గైనకాలజిస్టులు, 22 మంది అనస్థీషియా స్పెషలిస్టులు, 22 మంది పిల్లల వైద్య నిపుణులను నియమించామని తెలిపారు. అదేవిధంగా సుమారు 330 మంది నర్సింగ్ ఆఫీసర్లను పోస్టింగ్ ఇచ్చామని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామకాలు పూర్తి చేస్తామని, జిల్లాలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మానవ వనరులు(హెచ్ఆర్), మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు, మెడిసిన్స్, డయాగ్నస్టిక్ సేవలను సమగ్రంగా బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి. సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, రేకులపల్లి భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎన్. వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

## డ్రైవర్లు, కండక్టర్ల ఉద్యోగ భద్రత మార్గదర్శకాలకు కమిటీ

### కార్మిక సంఘాలతో చర్చించాక నివేదికను సమర్పించాలి

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టీసీ)లో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల ఉద్యోగ భద్రత కోసం మార్గదర్శకాలను రూపొందించడం కోసం ఆర్‌టీసీ సంస్థ అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. 8 మంది రాష్ట్రస్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కమిటీ సభ్యులు సమావేశాలను ఏర్పాటు చేసుకొని డ్రైవర్లు, కండక్టర్ల ఉద్యోగ భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలను సమర్పించాలని సంస్థ పేర్కొంది. ఉద్యోగ భద్రతకు కమిటీని ఏర్పాటు చేయడం పట్ల ఆర్‌టీసీ కార్మిక సంఘాలు టిజిఎస్ ఆర్‌టీసీకి ధన్యవాదాలు తెలుపుతూ తమ హర్షం ప్రకటించాయి. ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఆర్‌టీసీలోని కార్మిక సంఘాలతో 3 దఫాలుగా జరిగిన చర్చలలో అంగీకరించిన అంశాల అమలులో భాగంగా 8 మంది అధికారులతో ఉద్యోగ భద్రత కమిటీని నియమిస్తూ ఉత్తర్వులను విడుదల చేసిన టిజిఎస్‌ఆర్‌టీసీ యాజమాన్యానికి టిఎస్‌ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్–సిఐటియు) రాష్ట్ర కమిటీ ధన్యవాదములు తెలిపింది. ఉద్యోగ భద్రత కమిటీలో నియమితులైన అధికారులు కార్మిక సంఘాలు ఇచ్చే వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సిఫారసులు ఇవ్వాలని, ఎటువంటి పక్ష పాతం లేకుండా భారత దేశ చట్టాలు, సహజ న్యాయ సూత్రాలకు లోబడి టిజిఎస్‌ఆర్‌టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించేలా సిఫారసులు ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు విజ్ఞప్తి చేశారు. చర్చల సందర్భంగా ఈడీల కమిటీ తెలిపినట్లు అధికారుల సిఫారసులను యూనియన్ నాయకులకు ఇవ్వాలని, వారు తెలిపే అభ్యంతరాలను కూడా పరిశీలన చేసి, కార్మిక సంఘాలతో ఉద్యోగ భద్రత కమిటీ చర్చించి తుది రూపం ఇవ్వాలని కోరారు.

## క్యుములోనింబస్ మేఘాలతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు3:** క్యుములోనింబస్ మేఘాలతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షం కురుస్తోంది. సోమవారం ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో భారీ వర్షం పడింది. వాన పడే సమయంలో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉపరితల ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయి. అంతేకాకుండా వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది.ప్రజలంతా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కాగా, గత 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా మెదక్ జిల్లా పాపన్నపేటలో 8.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



అభివాదం చేస్తున్ననేతలు హుస్సేన్‌నాయక్, సంజీవ్‌నాయక్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, రాంచందర్ తదితరులు

## ప్రైవేట్ వర్సిటీలను వెంటనే రద్దు చేయాలి

### లేదా ఆ వర్సిటీల్లోనూ రిజర్వేషన్లు అమలుచేయాలి

### ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇడబ్ల్యుఎస్ సంఘాల డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:** ప్రైవేట్ యూనివర్సిటీల్లో జరగుతున్న దోపిడీని అరికట్టాలంటే వాటిని వెంటనే రద్దుచేసి ప్రభుత్వ యూనివర్సిటీల్లో కలపాలని ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యాసంజీవ్ నాయక్,రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్‌నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు భాస్కర్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ సోమశేఖర్, రాములు యాదవ్, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ మాట్లాడుడుతూ ఆర్టికల్ 15 (4)లో వెనకబడిన వర్గాలకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ ఇవ్వాలని భారత రాజ్యాంగంలో స్పష్టమువుతంది. అయితే ఆయా వర్గాలు ఉన్నతవిద్యకు రాకుండా ఉండేందుకు కొంతమంది కుట్రలు చేస్తున్నారని అందులోభాగంగానే ప్రైవేట్ యూనివర్సిటీలను ముందుకు తెచ్చారన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా దోపిడీ జరగుతుందని ఎస్సీ,ఎస్టీ బిసిలను ఉన్నత విద్యను చదువుకోకుండా పెద్దకుట్ర జరుగుతుందన్నారు. అందులో భాగంగా నే ప్రైవేట్ యూనివర్సిటీలు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. ఈప్రైవేట్ యూనిర్సిటీలు దోపిడికి నిలయాలుగా..రిజర్వేషన్ వ్యకిరేక కేంద్రాలు మారాయన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులను ఫీజుల రూపంలో పీల్చి పిప్పిచేస్తున్నాయని మండిపడ్డారు. ఈ డీమ్డ్, ప్రైవేట్ యూనిర్సిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసినేతలు కుల్కచర్ల శ్రీనివాస్, మాలసంఘాల నేతలు రాంచందర్, బేర బాలకిషన్, కోనేటి నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు

## పారిశ్రామిక వ్యవస్థలకు కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకం

### సమాచార, సాంకేతిక మంత్రి శ్రీధర్‌బాబు

### వైభవంగా ఐసిఎస్ఐ-ఎస్ఐఆర్సీ స్వర్ణోత్సవ ప్రాంతీయ సదస్సు

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 3 ప్రభాతవార్త :** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా వారి సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తం 700 మందికిపైగా కంపెనీ సెక్రటరీలతో వైభవంగా జరిగిన ఐసిఎస్ఐ–ఎస్ఐఆర్సీ 50వ స్వర్ణోత్స ప్రాంతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సమాచార, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూని కేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సదస్సును ప్రారంభించి తెలంగాణ ప్రగతిశీల పాలన, పారిశ్రామిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో కంపెనీ సెక్రట రీల పాత్ర కీలకమని అన్నారు. సిఎస్ ఫాల్కన్– మ్యానూవరింగ్ గవర్నెన్స్ అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సద స్సు ఇసిఎస్ఐ ఎస్ఐ ఆర్సీ ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక మైలు రాయిగా నిలిచిం దని, వ్యూహాత్మక పాలనా నిపుణులుగా, వ్యాపార భాగస్వాములుగా, విలువ సృష్టికర్తలుగా కంపెనీ సెక్రటరీల పాత్రను పునర్ నిర్వచించుతూ నిపుణుల ప్రసంగాలు ఆకస్తికరంగా సాగాయి. ట్రాన్సాక్షన్ అడ్వైజరీ, నిధుల సమీ కరణ, విలువ సృష్టి, టెక్నాలజీ ఆధారిత పాలన, సుస్థిర వృత్తిపరమైన పద్ధతులు, నాయకత్వం, వ్యవస్థాపకత, సంపూర్ణ ఆరోగ్యం వంటి సమకాలీన అంశాలపై సాంకేతిక సదస్సులు కంపెనీ సెక్రటరీలు బోర్డులకు, వ్యాపారాలకు విశ్వసనీయ సలహాదారులుగా ఎదగడానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఈ సందర్భంగా ఐసీఎస్ఐ–ఎస్ఐఆర్సీ ఛైర్మన్ సిఎస్.మహాదేవ్ తిరునగరి మాట్లాడుతూ ఈ స్వర్ణోత్స సదస్సు పరిపాలన, నైతిక నాయకత్వం, దేశనిర్మాణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఈ వృత్తి నిబద్ధతన ఎంతగానో తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఈ సదస్సులో కె.పాండియరాజన్, రాజీవ్ ఖైతాన్, ఎ.శంకర్, క్యాపిటల్ అడ్వైజర్స్ సీనియర్ నిపుణులు, ప్రముఖ పరిశ్రమ నాయకులు, కార్పొరేట్ నిపుణులు, మేధావులు పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతినిధులకు ప్రత్యేకమైన 50 బహుమతులు లెగసీ కిట్స్‌ను అందజేశారు. భారతదేశం యొక్క మారుతున్న ఆర్థిక వ్యవస్థలో సుస్థిర వృద్ధి, పారదర్శక పరిపాలన, విలువల సృష్టికి ఉత్ప్రేరకాలుగా మారేందుకు కంపెనీ సెక్రటరీలకు సాధికారత కల్పించాలనే నూతన సంకల్పంతో ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి బతికున్నప్పుడు నిరక్ష్యం చేసి చనిపోయాక రాజకీయాలకు వాడుకుంటున్న కెటిఆర్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 3:** పదేళ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా బిఆర్ఎస్ అవమానించిందని రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్, సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు..? అని ప్రశ్నించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డిని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం...కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అని వ్యాఖ్యానించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.

## మీసేవ కేంద్రాలను పటిష్టపరిచి అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

### ప్రపంచ బ్యాంక్ డిజిటల్-ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్‌ఉత్తమ్‌చందానీతో సిఎస్ సంజయ్‌జాజు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్ట పరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. సమావేశంలో డిజిటల్ ఇండియా - వికసిత్ భారత్–2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు (ఏఐ), సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్‌లు) సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.

**టి-ఫైబర్‌పై సమీక్ష**

అనంతరం టి–ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితరఅంశాలపై అధికారులతో సమీక్షించారు. టి–ఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## రేవంత్‌రెడ్డిపై నిందలు వేసే కెటిఆర్ తస్మాత్ జాగ్రత్త

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

**హైదదరాబాద్,ఆగస్టు3,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీ కరిస్తూ ఆయనపై నీలానిందలతో అవాకులు చెవాకులు ప్రేలుతున్న కెటిఆర్ తస్మాత్‌జాగ్రత్త అని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి హెచ్చరించారు. గాంధీభవన్ ఆయన సోమవారం మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కెటిఆర్ మాట్లాడటం సరికాదనీ హితవు చెప్పారు గతంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇంజినీరింగ్ వ్యవస్థ, విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను ముందుగా గుర్తు చేసుకోవాలనీ అన్నారు. యువతను, విద్యార్థులను మోసం చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన ఆవేదనచెందారు. ప్రజాపాలనలో ఇప్పటికే దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అని చెప్పారు.సంగ్రామ సభలు, ప్రెస్‌మీట్లు పేరుతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కెటిఆర్ మానుకోవాలనీ శివచరణ్‌రెడ్డి వేడుకొన్నారు.

**నోరు అదుపులో పెట్టుకో కెటిఆర్ : ఇందిరాశోభన్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు కంటే పెద్ద పోటీ పరీక్ష మరొకటి లేదని రేవంత్ రెడ్డి గత రెండు దశాబ్దాలుగా ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన 'ప్రజాక్షేత్రం అనే పరీక్ష'లో పదేపదే ఉత్తీర్ణులవుతూ వస్తున్నా రన్నారనీ ఆమె తెలిపారు జడ్పీటిసి స్థాయి నుంచి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న గొప్ప నాయకుడని ఆమె కొనియాడారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు చెప్పారు. కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని మరోసారి రేవంత్‌రెడ్డి గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజాక్షేతంలోనే తగిన గుణపాఠం చెబుతామని ఇందిరాశోభన్ హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎంజిఎస్ఎస్ జాతీయ ఇన్‌చార్జి మనోరంజన్‌కుమార్ పాశ్వాన్

## బియ్యం రవాణాలో పారదర్శకతకు స్మార్ట్ సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్

### టెండర్‌లో చూపిన లారీలో మాత్రమే ఇక కాంట్రాక్టర్ వినియోగించాలి

### ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణాలో పూర్తి పారదర్శకత పాటించేందుకు పౌర సరఫరాల సంస్థలో స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అనే నూతన విధానం ప్రవేశ పెట్టారు. స్మార్ట్ ఎస్‌సిఎం విధానం అమలు చేయడానికి యాప్ ప్రత్యేకంగా రూపొందించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్–2 కాంట్రాక్టర్ లారీల ద్వారా బియ్యం రవాణా చేసేవారు. ఆ లారీలకు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) అమర్చారు. ఆ లారీ ఎటు వెళుతుంది, ఎక్కడ ఆగింది? ఈ విధానంలో తెలుస్తుంది. కానీ బియ్యం ఎక్కడ, ఎంత దిగుమతి అయ్యిందో తెలియదు. ఎఫ్‌సిఐ, ఎసిడబ్ల్యూసి గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణాచేసే స్టేజ్–1 విధానంలోనూ అమలుచేస్తే పారదర్శకత పెరుగుతుందని అధికారులు, డీలర్లు భావిస్తున్నారు. నూతన స్మార్ట్ ఎస్‌సిఎం విధానంలో టెండర్ల సమయంలో అనుమతించిన నంబర్లతో ఉన్న లారీల వివరాలను కాంట్రాక్టర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ లారీల్లో మాత్రమే బియ్యం రవాణా చేయాలి. వేరే వాటిలో పంపాలని చూస్తే ట్రక్‌షీట్ జనరేట్ కాదు. ఒక లారీలో రెండు అంతకుమించిన రేషన్ దుకాణాలకు బియ్యం రవాణా చేస్తుంటారు. ప్రతి దుకాణం డీలర్ తనకు కేటాయించిన బియ్యం లారీలో లోడింగ్ అయిన తర్వాత వాహన నంబరు, బియ్యం ఎన్ని క్వింటాలు లోడ్ చేశామనే వివరాలతో ట్రక్‌షీట్ జనరేట్ అవుతుంది. రవాణా చేసే సమయంలో ముందుగా ఒకదానికి కేటాయించిన బియ్యం అక్కడ దించగానే లారీలో మిగిలిన వివరాలు స్మార్ట్‌యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు అందుతాయి. ప్రస్తుతం ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లో నూతన యాప్ అందుబాటులోకి వచ్చింది. త్వరలో మొబైల్స్ యాప్ అందుబాటులోకి తేనున్నారు. డీలర్, కాంట్రాక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారుల మొబైల్స్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం తెలంగాణలో మూడు నెలల బియ్యం ఒకేసారి రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రవాణా చేస్తున్నారు. స్మార్ట్ ఎస్‌సిఎం విధానంతో కొంత ఆలస్యం అవుతోంది. ఒకటి రెండు రోజుల్లో 50 శాతంపైగా బియ్యం రవాణా చేసేలా ఏర్పాట్లు చేసే అవకాశం ఉందని క్షేత్రస్థాయి అధికారులు భావిస్తున్నారు.

## రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి

### 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయొద్దు : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 3, ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకుంటే ప్రభుత్వం ఓర్వలేకపోతుందని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిలిచి పోయిన రూ 8,000 కోట్ల ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బి.సి. విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ నాయకత్వంలో మాసాబ్ ట్యాంక్ లోనీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మాసబ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలన్నీ విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 14 లక్షల మంది కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్సు పూర్తి చేసిన వారికి కళాశాల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, కోర్టులు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజులు చెల్లించనిదే విద్యార్థులను తరగతులకు రానివ్వడం లేదని, కొత్త అడ్మిషన్లు నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. 2007లో రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన ఈ పథకాన్ని పక్క రాష్ట్రంలో విజయవంతంగా నడుపుతున్నారని, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఎందుకు సరిగా అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకుని పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్ మెంట్ స్కీమును కొనసాగించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.సి. విద్యార్థి సంఘం నాయకులు నీల వెంకటేష్, రాజేందర్ ముదిరాజ్, పగిళ్ల సతీష్, ఆశిష్ గౌడ్, లింగయ్య యాదవ్, భీమ్ రాజ్, నిఖిల్ పటేల్, భారీ అశోక్, సిద్దు యాదవ్, నరేష్ గౌడ్, వంశీ పటేల్, కిరణ్, చిల్లర యశ్వంత్, గోపి, బలరాం తదితరులు పాల్గొన్నారు.



మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నతవిద్యామండలి ముందు ధర్నా చేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, విద్యార్థులు

## మాల్‌గోదాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

### భారతీయ రైల్వే మాల్‌గోదాం శ్రామిక్ సంఘ్ జాతీయ ఇన్‌చార్జి మనోరంజన్‌కుమార్‌పాశ్వాన్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 3, ప్రభాతవార్త:** మాల్‌గోదాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు లేదా కార్పోరేషన్ ఏర్పాటుచేయాలని భారతీయ రైల్వే మాల్ గోదాం శ్రామిక్ సంఘ్ జాతీయ ఇన్‌చార్జి మనోరంజన్ కుమార్ పాశ్వాన్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు కార్మిక చట్టాలపై మాల్‌గోదాం కార్మికులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1998 నుంచి మాల్ గోదాం కార్మికుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తూ కేంద్ర ప్రభుత్వంతో పలు త్రైపాక్షిక సమావేశాలు నిర్వహించిందని, దాని ఫలితంగా కార్మిక చట్టాల్లో పలు సవరణలు జరిగి, మాల్ గోదాం కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. 2024, అక్టోబర్ 9న కేంద్ర కార్మిక శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ, రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్‌కుమార్, రైల్వే, కరాఇ్మకశాఖల అధికారులు, సంఘం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాల్ గోదాం కార్మికుల కోసం ప్రత్యేక లేబర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించామని, దీనిపై ప్రభుత్వం ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. కార్మికులకు ఎల్లప్పుడూ సంఘం అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమాలకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ అధ్యక్షులు రణవీర్‌సింగ్, ఆర్గనైజేసన్ మంత్రి ప్రతీక్ రాథోర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.అశోక్, ఉపాధ్యక్షులు బి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరింత పటిష్టంగా అభివృద్ధి పథకాల అమలు

## ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిపై డ్యాష్ బోర్డు ఏర్పాటు

## వివిధ శాఖల అధికారులతో సిఎస్ సంజయ్‌జాజు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు3:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్కా, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, క్రిస్టినా చొంగ్తూ, వాణి ప్రసాద్, దాన కిషోర్, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయాదేవి మోహన్, ఇలంబర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, లక్ష్యాలు, పురోగతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రాయోజిత పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/విజయ గాధాలపై నివేదిక రూపొందించాలని అన్నారు.

# ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్‌గా మోనిషా చక్రవర్తి



**ముంబయి, ఆగస్టు 3:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా మోనిషా చక్రవర్తిని నియమించింది. సోమవారంనుంచే ఆమె నియామకం నుంచి అమల్లోకి వచ్చింది. ఈడీగా పదోన్నతి పొందే ముందు మోనిషా చక్రవర్తి ఆర్‌బీఐ పర్యవేక్షణ విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్విజన్)లో చీఫ్ జనరల్ మేనేజర్‌ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమె విదేశీ మారక ద్రవ్య విభాగం (ఫారిన్ ఎక్స్ఛేంజ్ డిపార్ట్‌మెంట్), ఆర్థిక మార్కెట్ల నియంత్రణ విభాగం (ఫైనాన్షియల్ మార్కెట్స్ రెగ్యులేషన్ డిపార్ట్‌మెంట్) బాధ్యతలను పర్యవేక్షించనున్నారు. మోనిషా చక్రవర్తికి ఆర్‌బీఐలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. బ్యాంకింగ్ పర్యవేక్షణ, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం మరియు బ్యాంకుల ఖాతాల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో ఆమె సేవలందించారు. ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీతో పాటు బిజినెస్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీను పూర్తి చేశారు.

# నేటి నుంచి నిరవధిక సమ్మె

## ఆయుష్ హౌస్‌సర్జన్లు, పిజి జాయింట్ యాక్షన్ కమిటీ

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ స్కాలర్ల స్టయిఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్, పీజీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు డా. రాజేశ్ కల్యాణ్ మాట్లాడారు. సుమారు పదేళ్లుగా ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ స్కాలర్ల స్టయిఫండ్‌లోఎలాంటి పెంపు జరగలేదని, ప్రస్తుతం అందుతున్న స్టయిఫండ్ కనీస అవసరాలను కూడా తీర్చలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్ పెంపు కోసం ఆరోగ్యశాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు.

# ఎఫ్‌సిఐ స్టోరేజి సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం తోడ్పాటు: మంత్రి ఉత్తమ్‌కుమార్

**హైదరాబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:** ఎఫ్‌సిఐకి స్టోరేజి సామర్థ్యం తెలంగాణ నుంచి సేకరించే బియ్యం కంటే 16.25లక్షల మెట్రిక్ టన్నుల నిల్వసామర్థ్యం తక్కువగా ఉందని దానిని పెంచుకోవడానికి తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తోడ్పాటు అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు, సోమవారం ఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్ అనుజ్‌త్యాగి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిశారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం పెరిగి దిగుబడి వేగంగా పెరగంతో నిల్వ సామర్థ్యంపెంచుకోవాల్సిన అవసరం ఏర్పడిందని మంత్రి ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఆధునిక గిడ్డంగులను నెలకొల్పడం నిల్వమౌళిక సదుపాయాలను గణీయంగా పెంపొందించే ప్రణాళికలు చేసుకోవాలని ఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్ కోరారు. సానుకూలంగా స్పందించిన ఉత్తమ్ విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకారం అందిస్తామని తెలిపారు. ధాన్యం సేకరణకు ఇబ్బంది కాకుండా వెంటవెంట ఎఫ్‌సిఐ తరలించాలని ఆయన కోరారు.



# ఆగస్టులో పెరగనున్న వర్షపాతం

## రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఈ నెలలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. సాధారణం, అంతకన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అతి కొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా విస్తృత శ్రేణి అంచనా ప్రకారం తెలంగాణతో పాటు, ఇతర దక్షిణాది రాష్ట్రాలు ఈ నెల మొదటి అర్థ భాగంలో సాధారణం నుండి అధిక వర్షపాతాన్ని నమోదు చేస్తాయని వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన వ్యవస్థల శ్రేణి, అనుకూలమైన ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు ఈ వర్షపాతం పెరగడానికి దోహదపడదాయి. పొరుగు రాష్ట్రాలైన విదర్భ, ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలిన తీవ్ర అల్పపీడనం కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. మరోపక్క ఈ నెల 6వ తేదీ నుండి 12 మధ్య తెలంగాణలో నైరుతి రుతుపవనాలు తిరిగి పుంజుకుంటాయి. ఫలితంగా రాష్ట్రంలో స్వల్పకాలిక పొడి వాతావరణం ముగిసే వీలుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాగా వారం మధ్యలో వాయువ్య, దాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఒక కొత్త అల్పపీడన ప్రాంతం ఏర్పడనుందని తెలిపింది. ఇది భూ భాగంలోకి చొచ్చుకు రావడంతో తెలంగాణ వ్యాప్తంగా చెదురుమదురు నుండి విస్తారంగా వర్షాలు కురిపించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. చాలా జిల్లాల్లో అయితే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది.

# మోడీ, అమిత్‌షాకు ఇక ఇంటిదారే

## పిసిసి ఛీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

## బీహార్‌లో బిజెపి కంచుకోట బంకిపూర్

## పికెతో బద్దలు : మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:**బంకిపూర్ ఉప ఎన్నిక తీర్పు బిజెపి అహంకారానికి గట్టి దెబ్బ ఇక ప్రధానమంత్రి మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలకు ఇక ఇంటిదారే అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ జోస్యం చెప్పారు. బిజెపి అధికారంలో ఉన్నప్పటికి మధ్యప్రదేశ్ లోని దతియ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజాస్వామిక విజయమనీ ఎంకె గౌడ్ వర్ణించారు. బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నిక ఫలితం కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితం కాదనీ ఇది దేశ రాజకీయాల్లో ఒక కీలకమార్పు నాకు సంకేతమని తెలిపారు. కేంద్రంలోనూ, బీహార్ లోనూ అధికారంలో ఉన్న బిజెపి నియంతృత్వ విధానాలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారనీ, బంకిపూర్ సాధారణ శాసనసభ స్థానం కాదు. బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో రాజీనామా చేసిన నియోజకవర్గమనీ వివరించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బిజెపి కంచుకోటగా ఉన్న ఈ స్థానం ప్రజల తీర్పుతో చేజారడం అధికార అహంకారానికి ఎదురుదెబ్బ. ప్రజల తీర్పు స్పష్టంగా చెబుతోంది. అధికార దుర్వినియోగం, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఇబ్బందులు, సామాజిక విభజన రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారనీ హెచ్చరించారు. .ఎంత బలమైన రాజకీయ కోట అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని బంకింపూర్ మరోసారి నిరూపించిందనీ తెలిపారు. బిజెపి అగ్ర నాయకత్వానికి అత్యంత ప్రతిష్మాత్మకమైన ఈ స్థానంలో ఎదురైన పరాజయం దేశవ్యాప్తంగా రాజకీయ సందేశాన్ని ఇస్తోందనీ పేర్కొన్నారు.

**యువత అసంతృప్తి బిజెపి ఓటమి : పొన్నం ప్రభాకర్**

బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో బిజెపి కి ఎదురైన ఘోర పరాజయం దేశ రాజకీయాల్లో కీలక పరిణామమని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సొంత నియోజకవర్గంగా పేరొందిన బంకిపూర్‌లో,బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ఓటమిపాలవడం ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పుకు నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా బిజెపి కంచుకోటగా ఉన్న బంకిపూర్‌లో భారీ మెజారిటీతో జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారని, ప్రజలు తమ తీర్పుతో బిజెపి అహంకారానికి గట్టి సమాధానం చెప్పారని పేర్కొన్నారు. దేశంలో తమకు ఎదురే లేదని, ప్రజలు తమ వెంటే ఉన్నారని విర్రవీగుతున్న బిజెపి కి బంకిపూర్ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా గుణపాఠం చెప్పారు.

# అద్దంకి దయాకర్, రామ్మోహన్‌రెడ్డికి హరీశ్‌రావు లీగల్ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 3:** ఎంతోకాలంగా రాజకీయాల్లో మచ్చలేని పేరు తెచ్చుకున్న హరీశ్‌రావుపై ఉద్దేశపూర్వ కంగానే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల్లో ఆయనకున్న మంచి పేరును చెడగొట్టాలనే కుట్రతోనే కాంగ్రెస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేశారని లీగల్ నోటీసుల్లో న్యాయవాది పేర్కొన్నారు. దేవాలయాలకు వెళ్లి క్షుద్ర పూజలు చేశారు అని కాంగ్రెస్ నేతలు కావాలనే ఈ దుష్ప్రచారానికి తెరతీశారని నోటీసుల్లో స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, తద్వారా కరువు రావాలనే ఉద్దేశంతోనే' హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లి క్షుద్ర పూజలు, తాంత్రిక పూజలు చేశారంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని న్యాయవాది ఆరోపించారు. పుట్టినరోజు వచ్చినా, మొక్కులు తీర్చుకోవాలన్నా కుటుంబ సమేతంగా గుడికి వెళ్లడం మన సంప్రదాయం. అలా భక్తిశ్రద్ధలతో గుడికి వెళ్లిన విషయాన్ని వక్రీకరించి.. దేవుళ్లను, పవిత్రమైన దేవాలయాలను సైతం తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం సరికాదని పేర్కొన్నారు.

ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమే నని నోటీసుల్లో స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా చేసిన ఈ తప్పుడు వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయే వార్తా ఛానెళ్లు, ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ ఆరోపణలు చేశారో.. అదే మాధ్యమాల ద్వారా బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ప్రెస్ ఆర్కైవ్స్, ఇతర డిజిటల్ లేదా ప్రింట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ఈ తప్పుడు వీడియోలను, పోస్టులను తక్షణమే తొలగించాలని నోటీసుల్లో డిమాండ్ చేశారు.

ఒకవేళ నిర్ణీత గడువులోగా క్షమాపణ చెప్పకపోయినా, వీడియోలు డిలీట్ చేయించలేకపోయినా.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయస్థానంలో సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావాలు వేయాల్సి వస్తుందని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు కాంగ్రెస్ నేతలే పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసుల్లో స్పష్టం చేశారు.

# రైల్వే భద్రతకు అత్యంత ప్రాధాన్యం

## దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 3, ప్రభాతవార్త :** రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం సికిందరా బాద్ రైల్ నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖల ప్రధానాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు భద్రతపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సికిందరాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్‌ఎంలు), వారి బృందాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జీఎం సూచించారు. లోతైన గుంతలు తవ్విన ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు, జారిపడటం, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత నెలలో అధికారులు, పర్యవేక్షకులు నిర్వహించిన భద్రతా తనిఖీలపై సమీక్ష నిర్వహించిన ఆయన, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్టేషన్లు, ట్రాక్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలు చేపడుతున్న భద్రతా చర్యలను సమీక్షించిన జీఎం, తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రైల్వే ట్రాక్‌ల వద్ద అక్రమ ప్రవేశాన్ని అరికట్టేందుకు ఎల్‌సీ గేట్లు, ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట కందకాలు తవ్వడం వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైల్వే ట్రాక్‌లపై అక్రమ ప్రవేశ ఘటనలను నివారించాలని అధికారులను ఆదేశించారు.




అధికారులకు సూచనలు చేస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

# జార్ఖండ్ పేపర్ లీక్‌పై అభ్యర్థుల నిరసన

## సిజెపి సంపూర్ణ మద్దతు

**రాంచి, ఆగస్టు 3:** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష మరియు ఇతర నియామక పరీక్షలలో జరిగిన లీకేజిలపై సమగ్ర దర్యాప్తుజరిపించాలని డిమాండ్‌చేస్తూ వందలాది మంది విద్యార్థులు వరుసగా సోమవారం కూడా తమ నిరసనను కొనసాగించారు.

ఈ ఘటనలపై సీబీఐ విచారణ జరపాలని, నియామక సంస్థలలో సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జేపీఎస్సీ పరీక్ష, జేఎస్‌ఎస్సీ సీజీఎల్ మరియు ఇతర నియామక పరీక్షలలో లీకులు, అవకతవకలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సరైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో జైపాల్ సింగ్ ముండా స్టేడియంలోని నిరసన ప్రదేశంలో నిరాహార దీక్షను ప్రారంభించారు. జెపిఎస్‌సిలో పేపర్ లీక్‌లు చాలాసార్లు జరిగాయి. ఈసారి, అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు లీక్ అయ్యాయి. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సీఐడీ విచారణకు ఆదేశించారు, కానీ మాకు సంతృప్తి లేదని జెపిఎస్‌సి ఆశావహుడు రాహుల్ కుమార్ క్రాంతి తెలిపారు. జెఎస్‌ఎస్‌సి సిజిఎల్ పేపర్ లీక్‌పై గతంలో జరిగిన విచారణలు ఎలాంటి చర్యలకు దారితీయలేదని, తాజా విచారణను కూడా కొన్ని నెలల తర్వాత "కప్పిపుచ్చవచ్చని" ఆయన ఆరోపించారు.

కొనసాగుతున్న సీఐడీ విచారణపై మాకు పూర్తిగా నమ్మకం పోయింది. గత ఏడేళ్లుగా జేపీఎస్సీ, జేఎస్‌ఎస్సీ నిర్వహించిన అన్ని నియామక పరీక్షలపై సీబీఐ విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నామని క్రాంతి అన్నారు. ఏప్రిల్ 19న జరిగిన 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని, జేపీఎస్సీ మరియు జేఎస్‌ఎస్సీ నిర్వహించిన నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సహా కేంద్ర ఏజెన్సీలతో స్వతంత్ర విచారణ జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

# మొక్కజొన్న అమ్మకాల్లో రికార్డు

## టన్నుకు రూ.25,370 పలికిన ధర

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అగస్టు 3, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మొక్కజొన్న విక్రయాల్లో చరిత్ర సృష్టించింది. ఈవేలం విధానాన్ని అమలు చేయడంతో మొక్కజొన్నకు రికార్డు స్థాయిలో ధర లభించిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలాల్లో మెట్రిక్ టన్నుకు గరిష్టంగా రూ.26,500, కనిష్టంగా రూ.24,100, సగటున రూ.25,370 ధర నమోదైందన్నారు. కొనుగోలు ధరతో పోలిస్తే టన్నుకు సుమారు రూ.1,500 లాభం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరనుందని చెప్పారు. యాసంగి 2025-26 సీజన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14.60 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామన్నారు.

వీటిలో సుమారు 3.80 లక్షల టన్నుల మొక్కజొన్న వర్షాలకు తడిచిపోయే ప్రమాదం ఉన్న పరిస్థితుల్లో ఉండటంతో, ఆ స్టాక్‌ను 30 రోజుల్లో లిఫ్టింగ్ పూర్తి చేయాలనే నిబంధనతో ప్రత్యేక ఈవేలం ద్వారా టన్నుకు రూ.22,000 ధరకు త్వరితగతిన విక్రయించినట్లు వివరించారు. దీంతో వర్షాల కారణంగా మొక్కజొన్న దెబ్బతిని ప్రభుత్వానికి సంభవించే భారీ నష్టాన్ని పూర్తిగా నివారించడం సాధ్యమైందని తెలిపారు.

మిగిలిన సుమారు 10.98 లక్షల టన్నుల సురక్షి త గిడ్డంగుల్లో ఉన్న మొక్కజొన్నకు మార్కెట్ పరిస్థితులను విశ్లేషించి బేస్ ప్రైస్‌ను మెట్రిక్ టన్నుకు రూ.24,000గా నిర్ణయించి, జూలై 31, ఈ నెల 1, 3వ తేదీల్లో మూడు విడతలుగా ఈవేలాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

# ఐసెట్ కౌన్సెలింగ్‌లో 13,895 మంది రిజిస్ట్రేషన్

## 5 వరకు స్లాట్ బుకింగ్‌కి అవకాశం, 8 వరకు వెబ్‌ఆప్షన్లు

## 11న సీట్ల కేటాయింపు, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటి వరకు 13,895 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ నెల 5 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తూ, ఈ నెల 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. ఆగస్టు 11న మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. ఇప్పటి వరకు 13,895 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 5742 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. సోమవారం నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం కాగా.. మొదటి రోజు 622 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఐ ఐసెట్-2026లో 91.22 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఐ సెట్‌కు 56,206 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 51,146 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 46,654(91,22శాతం) మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో గత ఏడాది 287 ఎంబీఏ కాలేజీలు ఉండగా వాటిలో 40,601 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 35,141 సీట్లు భర్తీ అయ్యాయి. 80 ఎంసీఏ కాలేజీలు ఉండగా వాటిల్లో 9360 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో 5420 సీట్లు భర్తీ అయ్యాయాయి. కౌన్సెలింగ్ కోసం రాష్ట్రంలో 22 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



# వాహనాల్లో వి2వి కమ్యూనికేషన్ వ్యవస్థకు కేంద్రం శ్రీకారం

## అక్టోబరు ఒకటవ తేదీ నుంచి దశలవారీగా అమలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** దేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, స్మార్ట్ రవాణా వ్యవస్థను ప్రోత్సహించేందుకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) వాహనంనుంచివాహనానికి కమ్యూనికేషన్ వ్యవస్థను దశలవారీగా అమలు చేయాలని ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించి కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు-1989లో సవరణలు చేస్తూ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ముసాయిదా ప్రకారం, వాహనాల ఎల్‌ఎంవి కేటగిరీల్లో 2027 అక్టోబర్ 1 లేదా ఆ తర్వాత తయారయ్యే వాహనాలు ఇప్పటికే వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థతో వస్తే, అవి ఎఐఎస్ 230 ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అనంతరం 2028 అక్టోబర్ 1 నుంచి ఈ కేటగిరీల్లో తయారయ్యే అన్ని కొత్త వాహనాల్లో ఎఐఎస్ 230 ప్రమాణాలకు అనుగుణమైన వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థను తప్పనిసరిగా అమర్చాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను దశలవారీగా అమలు చేయడం ద్వారా వాహన తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, ఇతర భాగస్వాములు కొత్త సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు తగిన సమయం లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా సమీపంలోని వాహనాలు పరస్పరం తమ వేగం, స్థానం, ప్రయాణ దిశ, వేగవృద్ధి వంటి సమాచారాన్ని తక్షణమే పంచుకుంటాయి. దీని వల్ల అకస్మాత్తుగా బ్రేకులు వేయడం, ముందు వాహనంతో ఢీకొనే ప్రమాదం, అసురక్షిత లేన్ మార్పులు, అత్యవసర సేవల వాహనాలు సమీపిస్తున్న సందర్భాలు వంటి పరిస్థితుల్లో ముందస్తు హెచ్చరికలు అందే అవకాశం ఉంటుంది.

# డికె కేబినెట్ విస్త'రణం'

## ఇటు 20 మంది ప్రమాణం.. అటు అసమ్మతి రాగం

## మొదలైన సీనియర్ ఎమ్మెల్యేల రాజీనామాలు

**బెంగళూరు, ఆగస్టు 3:**కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.



గీతాన్ని ఆవిష్కరిస్తున్న బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

# పార్లమెంట్ సమావేశాల్లో బిసిల సమస్యలపై చర్చ ఏది?

## రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే మహిళా బిల్లు అమలు చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** దేశంలోని 80 కోట్లకు పైగా ఉన్న బీసీల హక్కులు, ఆకాంక్షలను విస్మరిస్తే ఢిల్లీ పాలకులకు గద్దె దింపక తప్పదని, రాబోయే రోజుల్లో ఖిబెంగళూరు డిక్లరేషన్‌ఖి కేంద్ర ప్రభుత్వ రాజకీయ భవిష్యత్తును తేలుస్తుందని జాతీయ ఓబీసీ మహాసభ నాయకులు స్పష్టం చేశారు. జాతీయ ఓబీసీ మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ , బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ నేతలు మాట్లాడుతూ.. రూ.కోట్ల ప్రజాధనంతో జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రజాసమస్యల పరిష్కారానికి కాకుండా, అధికారప్రతిపక్షాల పరస్పర దూషణలు, విమర్శలకే పరిమితమవ్వడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బెంగళూరు వేదికగా జరగనున్న మహాసభ ద్వారా బెంగళూరు డిక్లరేషన్ పేరుతో దేశవ్యాప్త బీసీ ఉద్యమ రాజకీయ ప్రణాళికను ప్రకటించబోతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఈ డిక్లరేషన్‌ను ఆమోదించి అమలు చేయకపోతే, రాబోయే రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని నేతలు హెచ్చరించారు. బెంగళూరు సభ తర్వాత దేశంలో వేగవంతమైన సామాజిక, రాజకీయ పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయని నాయకులు ఉద్ఘాటించారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పరిశోధన ఫలితాలు సమాజానికి చేరాలి



- ఎస్వీయూ విసి నర్సింగరావు
- అడ్వాన్స్డ్ మెటీరియల్స్‌పై జాతీయ సదస్సు ప్రారంభం

**తిరుపతి(విద్య), ఆగస్టు 3 ప్రభాతవార్త:** నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన పదార్థాల అభివృద్ధి, శాస్త్రీయ పరిశోధనల ఫలితాలను సమాజానికి చేరవేయడంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టాటా నర్సింగరావు అన్నారు. ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మెటీరియల్స్, డివైసెస్ అండ్ టెక్నాలజీస్ అంశంపై సోమవారం విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశాభివృద్ధికి శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. పరిశోధకులు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. హుస్సేన్ శాస్త్రీయ పరిశోధనల్లో నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాల ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన ఎఆర్‌సిఐ శాస్త్రవేత్త డాక్టర్ బి.వి. శారద అధునాతన పదార్థాల తయారీ, వాటి పారిశ్రామిక వినియోగాలపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఐఐటి మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ ఎం.ఎస్. రామచంద్రరావు ఆధునిక మెటీరియల్స్, నానో సాంకేతికత, ఎలక్ట్రానిక్ పరికరాల రంగంలో జరుగుతున్న తాజా పరిశోధనలను వివరించారు. సదస్సు లక్ష్యాలను భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, సెమినార్ కన్వీనర్ ప్రొఫెసర్ వై.అపర్ణ వివరించగా, నిర్వహణ అంశాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకటరమణారెడ్డి తెలియజేశారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని అధునాతన మెటీరియల్స్, సెమీకండక్టర్ పరికరాలు, నానో సాంకేతికత, ఎనర్జీ మెటీరియల్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్ తదితర అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. పరిశోధకుల పోస్టర్ ప్రజెంటేషన్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగ మాజీ ఆచార్యులు, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదు

- మంత్రి కొలుసు పార్థసారధి



**విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే విరూపాక్షిచేసిన ఘోరాన్ని ఖండించకపోగా జగన్ సిగ్గులేకుండా సమర్థిస్తున్నారని ధ్వజమెత్తారు. దళిత, బిసి వర్గాలకు చెందిన మహిళ దుస్తులు చింపి, దుశ్శాసనుడిలా వైసిపి ఎమ్మెల్యే ప్రవర్తించారని దుయ్యబట్టారు. సోమవారం మీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడారు. గొడ్డలి పార్టీ అరాచకాలను గమనిస్తున్న ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు యువత భవిష్యత్తు కోసం శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ వారి జీవితాలను నాశనం చేస్తోందని కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. ప్రజాసేవ కాదని, అరాచకాలు, నేరాలు చేయడమే గొడ్డలి పార్టీలో కొనసాగడానికి ముఖ్య అర్హత అని ఎద్దేవా చేశారు. ఎంత పెద్ద అరాచకాలు సృష్టిస్తే జగన్ రెడ్డి దగ్గర అంత ప్రాధాన్యం లభిస్తుందని వారి అనుయాయులు అనుకుంటున్నట్లుందని విమర్శించారు. నేరాలు చేసి దొరికిపోయాక 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సింపతీ డ్రామాలు ఆడటం వీరికి అలవాటేనని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 45యేళ్లు దాటిన పేదవాడికి బతికే అర్హత లేదన్నట్లుగా జగన్ మాట్లాడారని ఆగ్రహించారు. శ్రీకాకుళంలో మహిళా పోలీసు మీద దుశ్శాసనుడి పర్వం కొనసాగించారని ధ్వజమెత్తారు. బలహీన వర్గానికి చెందిన యువకుడిని చచ్చేలా కొట్టారని కొలుసు పార్థసారథి ఫైర్ అయ్యారు. ఆడకూతురిపై రాక్షస దాడికి తెగబడిన దుశ్శాసనుడిని, బాధితుడిగా చిత్రీకరించేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కిడ్నాప్ చేసిన, మహిళలను, సిఎంను, హోంమంత్రిని అవమానించిన, అభ్యంతరకరంగా మాట్లాడిన గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు ఖండించరని ప్రశ్నించారు. ప్రజలు వైసిపిని ఘోరంగా తిరస్కరించి గద్దె దించినా ఈ పార్టీ మూకలకు ఇంకా బుద్ధి రాలేదని హెచ్చరించారు. దళిత వర్గాలకు చెందిన మహిళల దుస్తులు చింపేంతటి నీచమైన సంస్కృతిని జగన్ రెడ్డి ఎందుకు ఖండించడం లేదు? అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు.

# తండ్రి చేతిలో కుమారుడి దారుణ హత్య

- అడ్డుకోబోయిన భార్యపై హత్యాయత్నం.. తప్పించుకున్న మహిళ
- నంద్యాల జిల్లా యనకండ్ల గ్రామంలో విషాద ఘటన



కుమారుడు మధు కృష్ణ తండ్రి బాల మద్దిలేటి

**బనగానపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో తండ్రి తన కుమారుడిని గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాల మద్దిలేటి (56) గత కొంతకాలంగా కుటుంబంలో నెలకొన్న కలహాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కుమారుడు మధు కృష్ణ(30)పై కక్ష పెంచుకున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన బాల మద్దిలేటి, ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న కుమారుడు మధు కృష్ణపై గొడ్డలితో దాడి చేశాడు. తలపై తీవ్రంగా నరకడంతో మధు కృష్ణకు తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడిని రక్షించేందుకు ప్రయత్నించిన భార్య సుబ్బమ్మ(50)పై కూడా బాల మద్దిలేటి దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాడు. అయితే ఆమె చాకచక్యంగా భర్త కళ్లలో కారంపొడి చల్లి అక్కడి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకుంది.

బాల మద్దిలేటి, సుబ్బమ్మ దంపతులకు మధు కృష్ణ ఏకైక కుమారుడు. మధు కృష్ణకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా, భార్య అర్చనతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాల మద్దిలేటి మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలంటూ భార్య, కుమారుడితో తరచూ ఘర్షణ పడుతుండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ కుటుంబ కలహాలే ఈ దారుణ ఘటనకు దారితీసినట్లు తెలుస్తోంది.

ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నిందితుడు పరారవడంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భార్య అర్చన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బాల మద్దిలేటిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బనగానపల్లె సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# జగ్గయ్యపేట 'లైఫ్ స్కిల్స్ ఒకేషనల్' జూనియర్ కళాశాలకు అరుదైన గుర్తింపు



కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులను అభినందిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. ఇది చారిత్రాత్మక విజయంగా పేర్కొంటూ సోమవారం కళాశాల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరానికి కళాశాలలోని ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) విద్యార్థులకు జగ్గయ్యపేట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)లో క్లినికల్ అటాచ్‌మెంట్ నిర్వహించేందుకు అధికారిక అనుమతులు మంజూరైనట్లు యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ విద్య ద్వారా యువత ఆరోగ్య రంగంలో విశేష అవకాశాలను అందిపుచ్చుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ తక్కువ కాలంలో కళాశాల నాణ్యమైన విద్యతో ప్రత్యేక గుర్తింపు సాధించటం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ ఉపాధి అవకాశాలకు అనుగుణంగా శిక్షణ అందించటం కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ కొత్తమాసు మల్లిఖార్జునరావు, కార్యదర్శి-కరస్పాండెంట్ పెనుగొండ వెంకటరాజీవ్, జాయింట్ సెక్రటరీ పెనుగొండ వెంకట సతీష్, ఉపాధ్యక్షులు రంగాపురం నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వీరవల్లి కిరణ్, కుక్కడపు పాండురంగారావు, కళాశాల అకడమిక్ డైరెక్టర్-ప్రిన్సిపాల్ తంగెళ్ల వెంకటేశ్వరరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, పేరెంట్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

**రైతుబజార్‌లో సబ్సిడీ బియ్యం:** జగ్గయ్యపేట పట్టణంలోని రైతుబజార్‌లో సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సబ్సిడీ బియ్యం అమ్మక కౌంటర్‌ను ప్రారంభించారు. మార్కెట్ ధరల కంటె తక్కువ ధరకు బియ్యం అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బహిరంగ మార్కెట్ లో స్టీమ్డ్ బియ్యం కిలో రూ.62లు ఉండగా అదే బియ్యాన్ని రాయితీ ధర రూ.52ల వంతున ఏర్పాటు చేశామన్నారు. అలాగే రా బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.58లు ఉండగా ఇక్కడ రూ.50లకే లభిస్తుందని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తహసీల్దార్ శిరీష, మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ నూకల కుమారరాజ, డిటి వెంకట్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి శ్రీనివాసరావు, రైతుబజార్ ఇఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయంలో టిడిపి నేత పుట్టిన రోజు వేడుకలు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. కేసు నమోదు

**సత్యవేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురంలోని టిటిడి ఆధీనంలో ఉన్న శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో ఓ టిడిపి నేత తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం కలకలం రేగింది. వివరాలు.. సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి దేవాలయ బోర్డు సభ్యుడు, టిడిపి నేత నెల్సన్ మండేలా గురువారం తన పుట్టినరోజు వేడుకలను వేదనారాయణ స్వామి ఆలయ ప్రాంగణలో నిర్వహించాడు. నెల్సన్ మండేలా అనుచరులు, స్నేహితులు అతనికి శాలువ కప్పడం, బొకేలు ఇవ్వడం, పరస్పరం ప్రమాణాలు చేసుకోవడం, ఇది కాకుండా ఆలయ నియమాలకు విరుద్ధంగా, భంగం కలిగించేలా రూ.100 నోట్లను గాల్లో చల్లుకోవడం వంటి దృశ్యాలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. టిటిడి ఆధీనంలోని ఆలయంలో ఇలాంటి కార్యలు ఆలయ ప్రాంగణంలో కరెన్సీ నోట్లను గాల్లోకి చల్లుతున్న టిడిపి నేత నెల్సన్ మండేలా, నవీణ్, సాయినితీష్, చిన్న, ప్రశాంత్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

- టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

**తిరుపతి, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి బోర్డు సమావేశంలో 134వ తీర్మానం అవినీతికి కేరాఫ్ అని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. జులై 14న జరిగిన పాలక మండలి సమావేశంలో దుర్మార్గమైన నిర్ణయం తీసుకుందన్నారు. 134వ తీర్మానంతో టిటిడి పరిధిలోని బర్డ్స్, స్విమ్స్, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి మందులు, ఇంజెక్షన్లు, పరికరాల కొనుగోళ్లలో కుంభకోణానికి తెర లేపారని ఆయన సోమవారం తిరుపతిలో సంచలన ఆరోపణలు చేశారు. రోగుల ప్రాణ రక్షక మందులు, ఇంజక్షన్‌లు, పరికరాల కొనుగోలు నిబంధనలను సడలించి అవినీతికి అస్కారం కలిగేలా చేశారన్నారు. మందులు, పరికరాలు సరఫరా చేసే సంస్థకు రూ.వంద కోట్ల టర్నోవర్ అర్హతను రూ.25 కోట్లకు తగ్గించడం దారుణం అని కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. టిటిడి నిర్ణయం వెనుక మంత్రి లోకేష్ ఒత్తిడి ఉందన్నారు. ప్రజల ప్రాణాలపై కూటమి ప్రభుత్వం కమీషన్ల రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. టిటిడి ఆస్పత్రులలో మందుల, పరికరాల నాణ్యతను కాపాడాల్సిందిపోయి నిబంధనలనే బలహీనపరిచారని మండిపడ్డారు. టిటిడి బోర్డులో కీలకమైన ఓ సభ్యురాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించినా సరే ఖాతరు చేయలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్యశ్రీని బలహీన పరిచిన ప్రభుత్వం ఇప్పుడు టిటిడి వైద్య సేవలపై దాడి చేస్తుందని విమర్శించారు. 134వ తీర్మానంపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని వైసిపి తరపున డిమాండ్ చేస్తున్నట్టు భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు.

# రేపు చేనేత దినోత్సవ ముందస్తు వేడుకలు

**విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి సమీపంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడి) ప్రాంగణంలో 12వ జాతీయ చేనేత దినోత్సవం-2026 ప్రత్యేక ముందస్తు వేడుకలను ఈ నెల 5వ తేదీ బుధవారం సాయంత్రం 4.00 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు విజయవాడ చేనేత సేవా కేంద్రం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రాత్మకమైన 1905 స్వదేశీ ఉద్యమం స్ఫూర్తిని స్మరించుకుంటూ, భారతీయ చేనేత వారసత్వ పరిరక్షణలో చేనేత కళాకారులు అందిస్తున్న విశిష్ట సేవలను గౌరవించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన "జాతీయ చేనేత దినోత్సవం" నిర్వహించబడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 5వ తేదీ అమరావతి సమీపంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ప్రాంగణంలో సీనియర్ చేనేత కళాకారులచే ప్రత్యక్ష నేత ప్రదర్శనలు, జి.ఐ. గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ చేనేత ఉత్పత్తుల ప్రత్యేక ప్రదర్శన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేనేత సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, చేనేత కళాకారులు- ఫ్యాషన్ డిజైనర్లు- ఎన్‌ఐడి విద్యార్థుల మధ్య ఇంటరాక్టివ్ సెషన్, అలాగే హ్యాండ్‌లూమ్ ఫ్యాషన్ షో, సారీ డ్రేపింగ్ పోటీలు నిర్వహించబడనున్నాయని తెలిపారు.

# వచ్చేది బిసిల రాజ్యమే

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



పలువురు నాయకులకు నియామకపత్రాలు అందజేస్తున్న కేసన శంకరరావు

**గుంటూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా యువత జెన్ జి ఉద్యమ తరహాలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘంలో చేరేందుకు వేలాదిగా తరలి రావడమే రానున్న కాలంలో రాజ్యాధికారానికి వచ్చేది అణగారిన బిసి వర్గాలేనని రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఉద్ఘాటించారు. మొన్న సత్యసాయి జిల్లా, నిన్న గుంటూరు జిల్లా, ఈరోజు ప్రకాశం జిల్లా నుండి డజన్ల కొద్దీ సంఘంలో చేరేందుకు రావడమే అందుకు నిదర్శనమన్నారు. సోమవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ప్రకాశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన్నీరు వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా చింతగుంట్ల వెంకటరమణమ్మ పలువురు ప్రకాశం జిల్లా నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్నది బిసిల రాజ్యమేనంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టసభలు, స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్లలో బిసి మహిళలకు సబ్ కోటా రిజర్వేషన్ల కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖతోపాటు, సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించి, ప్రత్యేక నోడల్ ఏజెన్సీల పర్యవేక్షణలో పథకాలు అమలు జరపాలని కోరుతున్నామన్నారు. క్రీమీ లేయర్ ఎత్తేయాలని, ఎస్సీ, ఎస్టీలతో సమానంగా వర్తక, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో రాయితీలివ్వాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాలను స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ, సంఘ ఆశయాలు, లక్ష్యాల మేరకు గ్రామ గ్రామాన బిసి జెండాలు ఎగిరేలా సంఘ నిర్మాణ విస్తృతల కోసం కృషి చేస్తామన్నారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో ఈనెలలో రెండు గరుడసేవలు

- 17న గరుడపంచమి, 28న శ్రావణ పౌర్ణమి

**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్ప గరుడసేవకు ఎంతో విశిష్టత ఉంది. గరుడసేవలో స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరించి ఆలయ మాఢవీధుల్లో భక్తులకు కటాక్షిస్తారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు లక్షలాదిమంది భక్తులు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భారీగా తరలిరావడం పరిపాటి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో ప్రతినెలా పౌర్ణమి రోజున గరుడసేవ నిర్వహిస్తారు. ఆగస్టు నెలలో రెండుసార్లు గరుడసేవ జరగనుంది. 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవకు విశిష్టత ఉంది. ఈ కారణంగా ఈనెల 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినం కావడంతో ఆరోజు శేషాద్రివాసుడు గరుడవాహనంపై ఊరేగుతారు. ఆరోజు సాయంత్రం 7గంటలకు మలయప్ప వాహనంపై అధిరోహించి భక్తులకు అభయమిస్తారు. కాగా ఈనెల 28వ తేదీ శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి గరుడసేవ జరుగుతుంది. భక్తులు ఈ విషయం తెలుసుకుని గరుడసేవ వీక్షించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## అమరావతి అభివృద్ధి పనులకు శ్రీవారి ఆశీస్సులు వేడుకున్నా

- మాజీ ఎంపి, పద్మశ్రీ మురళీమోహన్



**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు మరింత వేగంగా జరిగి రాజధాని నిర్మాణంలో పురోగతి ఉండాలని, ఇందుకు అవసరమైన శక్తిని సిఎం చంద్రబాబుకు ప్రసాదించాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు మాజీ ఎంపి, సినీనటుడు పద్మశ్రీ మురళీమోహన్ తెలిపారు. అమరావతి నిర్మాణం త్వరగా పూర్తికావాలని ప్రజల ఆకాంక్ష అన్నారు. తనకు పద్మశ్రీ అవార్డు అందుకున్న తరువాత తిరుమలకు వచ్చి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశీస్సులందుకోవడం జన్మలో మరచిపోలేని సందర్భమన్నారు. తిరుమలలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం, త్వరగా దర్శనాలు వంటి విధానాలు బావున్నాయని ఆయన అభినందించారు. టిటిడి బోర్డు, అధికారులు భక్తుల సౌకర్యాల కల్పనలో నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అన్నప్రసాదాల నాణ్యత, లడ్డూల నాణ్యతపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పుష్కరిణి మరమ్మతు పనులు షురూ!



**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు మొదలయ్యాయి. గత రెండురోజులుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేయనున్నారు. ఈ నెలరోజులతోబాటు సెప్టెంబర్ 10వ తేదీ వరకు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహస్వామి ఆలయం సమీపంలో స్నాన కుళాయిలు ఏర్పాటు చేశారు. సాధారణంగా ప్రతి ఏటా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులపాటు స్వామి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేపట్టడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందుగానే తిరుమలలోని పవిత్ర పుష్కరిణిని మరమ్మతులు మొదలుపెట్టారు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించారు. దీని కారణంగా నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. స్వామిపుష్కరిణిలో నీరు నిల్వఉండే అవకాశం లేదు. పుష్కరిణిలోని నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులోఉంది. నిరంతరాయంగా కొంతశాతం నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు. పుష్కరిణి మరమ్మతుల్లో భాగంగా మొదటి పదిరోజులు నీటిని తొలగిస్తారు. ఆ తరువాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తిచేస్తారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పిహెచ్ విలువ 7ఉండేలా చేస్తారు. టిటిడి వాటర్‌వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడతారు. ప్రతిరోజూ వేకువజామున జరిగే అంగప్రదక్షణ భక్తులు స్వామివారి పుష్కరిణిలో పవిత్రస్నానాలాచరించి తడిబట్టలతో స్వామివారి ఆలయంలోనికి చేరుకుంటారు. అలాగే ఏటా మూడు సార్లు స్వామివారి చక్రత్తాళ్వార్‌కు పవిత్ర పుణ్యస్నానాలను పుష్కరిణిలో జరిపిస్తారు.



## కపిలేశ్వర ఆలయంలో 7న ఆడికృత్తిక ఉత్సవం

**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీన ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం శుక్రవారం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపి విశేష పూజలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవర్లు తిరువీధి ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని టిటిడి అధికారులు కోరారు.

## నేటి నుండి 14 వరకు ఆండాళ్ తిరువడిపురం ఉత్సవాలు



**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో నేటి నుండి 14వరకు వైష్ణవ సంప్రదాయం లో విశిష్ట స్థానం కలిగిన ఆండాళ్ అమ్మ తిరువడిపురం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఆండాళ్ అమ్మకి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులు అమ్మవారి దివ్య అనుగ్రహాన్ని పొందనున్నారు.

ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆగస్టు 14న ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర అత్యంత వైభవంగా జరుగుతుంది. ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి మహోత్సవ ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు.

అనంతరం ప్రత్యేక పూజల తర్వాత అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స్‌లోని గీతా మందిరం, ఆర్.ఎస్. మాడ వీధిలోని విఖనసాచార్యుల ఆలయం, చిన్నజీయర్ మఠం మీదుగా దివ్య ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు ఆండాళ్ అమ్మ సన్నిధిలో శాత్తుమొర నిర్వహించి ఉత్సవాలకు మంగళం పలుకుతారు. ఈ దివ్యోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేసింది.

## గరుడ నాటకోత్సవాలు ఆరంభం

**తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం టిటిడి ఆధ్వర్యంలో గరుడ అవార్డు నాటకోత్సవాలు ఆరంభమయ్యాయి. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్తు, శ్రీవేంకటేశ్వర నాట్యకళా పరిషత్తు 72వ వార్షిక జాతీయ నాటకోత్సవాలు గరుడ అవార్డు కార్యక్రమం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదట శ్రీవేంకటేశ్వర వైభవం నృత్య ప్రదర్శనలు అపూర్వంగా ప్రదర్శన చేశారు. ముఖ్యఅతిథులుగా అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, కళాకారులు చిన్నంగారి రమణ, క్యాటరింగ్ అధికారి విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు సూర్య నారాయణ రెడ్డి, ఎఇఒ మల్లం విజయకుమార్ రెడ్డి, ప్రేక్షకులు, కళాకారులు పెద్దయెత్తున మహతి ఆడిటోరియంకు విచ్చేసి కార్యక్రమాలు చూసి తరించారు.





# లిచీ.. లిచీ..

ఈ పేరెపుడైనా విన్నారా; అదో ఎర్రెర్రటి పండు తెలుపు మేళవింపుతో జెల్లీలా కనిపిస్తూ తెగ నోరూరిస్తాయి. ఎందుకంటే.. ఈపండ్లు మనకి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

❖ చినుకులు మొదలయ్యాయి. వాటితోపాటే బోలెడు ఇన్‌ఫెక్షన్లూ పలకరిస్తాయి. వాటి బారిన పడొద్దంటే రోగనిరోధకత పెంచుకోవాల్సిందే. లిచీలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని పెంచడంలో సాయపడుతుంది. ❖ బి విటమిన్లు, ఫ్లావనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తకణాల ఉత్పత్తికి ఇవి సాయపడతాయి. అందుకే నెలసరి మొదలైన అమ్మాయిలకు వీటిని తప్పక ఇవ్వమంటారు. ఇంకా మాంగనీస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, ఫోలేట్ వంటి ఖనిజలవణాలకు ఇది మంచి వనరు. పైగా రుచీ బాగుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తప్పక ఇవ్వాల్సిన పండ్లలో వీటినీ ఒకటిగా చెబుతారు.

❖ వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని ఫ్రీరాడి కల్స్‌తో పోరాడి, వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరకుండా కాపాడ తాయి

❖ విటమిన్-సి నల్లమచ్చలు, హైపర్ పిగ్మెంటేషన్‌ని తగ్గిస్తుంది. అందుకే స్కిన్‌కేర్ ఉత్పత్తుల్లోనూ దీనికి చోటిస్తారు. పైపూతల కంటే నేరుగా తీసుకోవడం మరింత మేలు కదా! అందుకే తరచూ ఆహారంలో చేర్చుకోండి. పైగా ఈ పండు బరువు తగ్గించడంలోనూ సాయపడుతుంది.

❖ ఇది మనసుకి చేసే మేలూ ఎంతో! దీని తీయనైన సువాసన అరోమా థెరపీలా పనిచేస్తుందట. విశ్రాంతి భావన కలిగించి, ఒత్తిడిని దూరం చేస్తుందట. అంటే వీటిని తినడం ద్వారా శరీరానికే కాదు.. మనసుకీ మేలు జరిగేలా చేయొచ్చన్న మాట. అయితే ఎంత నచ్చినా వీటినీ పరిమితంగానే తీసుకోవాలి. రోజుకి 7కి మించకుండా తినాలి. □

# థింతక...థింతక.. 'థింసా'!



భారతీయ గిరిజన నృత్య సంప్రదాయానికి నీరాజనం అందిన వేళ. ఒక పక్క గిన్నీస్ ఆఫ్ రికార్డు స్వయంగా ఆస్వాదించి అభినందించగా , మరో పక్క సాక్షాత్తు భారతీయ సాహితీ వికాసానికి , జానపద సంప్రదాయాలను విశ్వవ్యాప్తికి పెద్దపీట వేసే భారత ప్రధానినరేంద్ర మోడీ ఆశీస్సులు లభించాయి. మొన్న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఉత్తరాంధ్రకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి 13 వేల మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థినులంతా ఒకే రంగు చీరలు ధరించి, గిరిజన వస్త్రధారణ, ఆహార్యంతో లయబద్ధంగా 'థింసా' నృత్యం చేస్తూ ఘనస్వాగతం పలికారు. టెర్మినల్ భవనం నుంచి సభావేదిక వద్దకు ప్రజలకు అభినందనలు తెలుపుతూ జీపులో వెళుతున్న ప్రధాని ఈ ప్రదర్శనను ఎంతో ఆసక్తికరంగా తిలకించారు.


చప్పట్లు కొడుతూ వారిని అభినందించారు. 'థింసా' నృత్యాన్ని రికార్డు స్థాయిలో ప్రదర్శించడం వెనుక ఎందరో కళామతల్లుల అంకితభావం నిండి ఉంది. ఈ నృత్యంలో పాల్గొన్న 13 వేల మందినీ గుర్తించా కనే రికార్డు సాధించినట్టు 'గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి, భారతీయ గిరిజన సమాజాల, సమూహాల, నృత్య సంప్రదాయాలకు ఈ సందర్భం అద్భుత ప్రదర్శనగా ఆవిష్కరించబడింది. □

# మూడు తరాల కాన్పుల 'హస్తవాసి'



విజయవంతంగా చేసే మహిళా డాక్టర్లకైనా మంత్రసానులకయినా రాణింపు కలిగిందంటే వారి 'హస్తవాసి' మంచిదని చెప్పుకోవడం పరిపాటి. ఒకనాటి అమ్మమ్మల కాలంలో మంత్రసానులే ప్రసవాలు చేయించేవారు. ప్రస్తుత కాలంలో మహిళా డాక్టర్ల కోసం వెదికే వారంతా అనుభశాలురైన మహిళా డాక్టర్ల కోసం వెదికే వారంతా అనుభవ శాలు లైన మహిళా డాక్టర్ల కోసం అన్వేషణ ప్రారంభిస్తున్నారు. ఆధునిక కాలంలోనైతే గర్భిణుల నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ ఔషధ యాజమాన్యం డాక్టర్ల చేతిలో ఉంటే ప్రత్యేక ప్రసవాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. డాక్టర్లు, నర్సుల బృందాలు సైతం అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యతలేని రోజుల్లో ఓ మధ్యతరగతి కుటుంబంలోని ఆడకూతురు వైద్య వృత్తినభ్యసించాలని నడుంకట్టింది. అది 1950వ దశకంలోని మాట. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సూరి శ్రీమతి ఆమె 1958లో ఉస్మానియ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆపై గైనకాలజీలో స్పెషలైజేషన్ చేసారు. ప్రస్తుత ఆమెకు 92 ఏళ్లు మూడు తరాల మహిళలకు ప్రసూతి సేవలందించారు. తన గుమ్మం వద్దకు కాన్పుల కోసమో వైద్య సేవలకొచ్చిన వారిని కుదరదని వెళ్లగొట్టే మనస్తత్వం కాదామెది. భగవంతుడు ఓపిక ఇచ్చిన లక్ష్యం నెరవేరాలిగా అంటుందామె. ఆమె వివాహం చేసుకోలేదు. సోదరుడి ఇంట్లోనే ఉంటారు. శేష జీవితం కూడా మహిళలకు ప్రసూతి సేవలు అందిస్తూనే ఉంటానని ఎంతో ధీమాగా చెప్పారు శ్రీమతి. తనను కోరి వచ్చిన గర్భిణులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించి వైద్య సలహా చెప్పకుండా కాదనలేనని. ఇప్పటికీ యోగా చేయడమే తన ఆరోగ్య రహస్యమని శ్రీమతి వివరిస్తుంటారు. □

# అధరాల కోసం.. స్క్రబ్స్ !



చర్మం తేమను కోలోనవవడం వల్ల ఆ ప్రభావం పెదాలపై కూడా పడుతుంది. తద్వారా పెదాలు పొడిబారిపోయి నిర్జీవమైపోతాయి. అలాంటప్పుడు ఈ న్యాచురల్ లిప్ స్క్రబ్స్‌ని ఉపయోగిస్తే పెదాలు తిరిగి మెరుపును సంతరించుకుంటాయి.

❖ అర టీస్పూన్ చొప్పున దాల్చిన చెక్క పొడి, తేనె, ఆలివ్ నూనె తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై రాసి మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. కాసేపటి తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకొని లిప్ బామ్ రాసుకుంటే సరిపోతుంది. ❖ రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున కమలాఫలం తొక్కల పొడి, బ్రౌన్ షుగర్ తీసుకొని అందులో కొన్ని చుక్కల బాదం నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో 30 సెకన్ల పాటు పెదాలపై మర్దన చేసుకొని కడిగేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుంది. తేనె, బ్రౌన్ షుగర్.. వీటిని టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఇందులో కొన్ని చుక్కల లావెండర్ నూనె కలిపి పెదాలపై రాసుకోవాలి. రెండు నిమిషాల పాటు నెమ్మదిగా మర్దన చేసి ఆపై కడిగేసుకుంటే పెదాలు మృదువుగా మారతాయి. బరకగా ఉన్న కాఫీ పొడి, తేనె.. ఈ రెండింటినీ టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో పెదాలపై నెమ్మదిగా మర్దన చేసుకొని రెండు నిమిషాల తర్వాత కడిగేసుకుంటే పొడిబారిన పెదాలు మెరుపును సంతరాంచుకుంటాయి. కొన్ని గులాబీ రేకల్లో పచ్చి పాలు పోస్తూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్ర మంతో పెదాలపై కాసేపు మృదువుగా రుద్దుకొని కడిగేసుకుంటే ఇటు పెదాలు తేమను తిరిగి పొందడంతో పాటు అటు మంచి రంగులోకి వస్తాయి. □

# 'సుందర కాండ'

జీవితంలో ముందుకు వెళ్లాలంటే తలపెట్టిన కార్యాలు ఎన్నో సఫలీకృతం కావాలి. ఎన్నో కష్టాలుపడి పూనుకున్న కార్యాలు సఫలీకృతం కావాలంటే, అందుకు భగవంతుడి అనుగ్రహం కావాలి. భగవంతుడి అనుగ్రహంతోనే 'కల' నిజమవుతుంది .. ఆశ నెరవేరుతుంది .. నిరీక్షణ ఫలిస్తుంది. ఒక్కోసారి తలపెట్టిన కార్యాలకి అనేక రకాల అవరోధాలు ఎదురవుతూ ఉంటాయి. ఆ ఆటంకాలను .. అవరోధాలను దాటుకుని ముందుకు వెళ్లడం చాలా కష్టమవుతుంటుంది. ఆ కార్యాన్ని మధ్యలో వదిలేయడం వలన వచ్చే నష్టం ఎక్కువగా ఉం టుంది. పూర్తి చేయడా నికి అవసరమైన వనరులు అందుబాటు లోకి రాక నిరాశ నిస్పృహాలకు లోనవడం జరుగుతూ ఉంటుంది. అలాంటి పరిస్థితు ల్లోనే 'సుందర కాండ' పారాయణం చేయాలనేది మహర్షుల మాట. శ్రీరామ చంద్రుడు తనకి అప్పగించిన కార్యాన్ని ఎన్ని ఆటంకాలు ఎదురైనా లెక్కచేయక హనుమంతుడు సాధించుకు వచ్చాడు. అలాంటి హనుమంతుడిని అంకిత భావంతో పూజిస్తూ .. సేవిస్తూ 'సుందరకాండ''సుందరకాండ' పారాయణం చేయడం వలన ఆయన ప్రీతి చెందుతాడు. ఫలితంగా అడ్డంకులు తొలగి పోయి కార్యసిద్ధి కలుగుతుందని ఆధ్యాత్మిక గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి □

# చిలగడ దుంప సగ్గుబియ్యం అప్పాలు



**కావల్సినవి:**
చిలగడదుంపలు: నాలుగు
సగ్గుబియ్యం: కప్పు
అల్లం: మీడియం సైజ్ ముక్క
పచ్చిమిరపకాయలు: నాలుగు
కొత్తిమీర తరుగు: అరకప్పు
కరివేపాకు: గుప్పెడు
బియ్యప్పిండి: టేబుల్ స్పూన్
నూనె: రెండు టేబుల్ స్పూన్లు
ఉప్పు: తగినంత

**తయారీ:** చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి ముక్కలు చేసి, కుక్కర్లో ఉడకబెట్టుకోవాలి. తర్వాత చెక్కు తీసి పక్కకు పెట్టుకోవాలి. మరోపక్క సగ్గుబియ్యాన్ని నీళ్లలో ఒక గంట సేపు నానబెట్టుకోవాలి. ఇప్పుడు నీళ్లను ఒంపేసి, ఆ సగ్గుబియ్యంలో ఇందాక ఉడకబెట్టుకున్న చిలగడ దుంపల ముక్కలను మెత్తగా మెదిపి వేయాలి. అల్లం పచ్చి మిరపకాయలు ముద్ద చేసి పెట్టుకోవాలి. కరివేపాకును కడిగి సన్నగా తరగాలి. కొత్తిమీరను కూడా సన్నగా తరిగి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు సగ్గుబియ్యం మిశ్రమంలో వీటి తరుగు, అల్లం పచ్చిమిర్చి ముద్ద, బియ్యప్పిండి, ఉప్పు వేసి గట్టిగా కలుపుకోవాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లు చిలకరించుకుంటే సరి. ఇప్పుడు గుంత పొంగణాలు చేసే మూకుడును తీసుకొని ఆ గుంటల్లో కొద్దిగా నూనె రాసి ఈ మిశ్రమాన్ని నింపాలి. ఒకవైపు కాలాక మరోవైపు తిప్పుకొని మళ్లీ నూనె వేసి కాల్చుకోవాలి. బంగారు వన్నెలో వేగితే రుచికి బాగుంటాయి. వీటిని కొత్తిమీర కారం, టమాట సాస్‌లతో నంజుకుని తినొచ్చు! □

తెర

# 'చెన్నై లవ్ స్టోరీ' ప్రశంసలే అసలైన విజయం: దర్శకుడు రవి నంబూరి సత్తా



ప్రేక్షకుల ఆదరణే అసలైన విజయం.. ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు సరైన రీతిలో అందించగలిగాననే నమ్మకం ఈ విజయం కలిగించిందని రవి నంబూరి తెలిపారు. బాక్సాఫీస్ వసూళ్ల కంటే ప్రేక్షకుల ప్రశంసలు, భావోద్వేగ అనుబంధమే తనకు మరింత సంతృప్తినిచ్చిందన్నారు.

**సాయి రాజేష్ ఇచ్చిన అవకాశమే జీవితాన్ని మార్చింది..** ఈ కథను సాయి రాజేష్ స్వయంగా తనకు చెప్పారని, కథలోని భావోద్వేగాలు, సవాలు తనను బాగా ఆకట్టుకోవడంతో వెంటనే దర్శకత్వ బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు.

**డైలాగ్ రైటర్‌గా వచ్చిన ప్రశంసలు ప్రత్యేకం..** ఈ సినిమాకు డైలాగ్స్‌కు వస్తున్న ప్రశంసలు తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని చెప్పారు.

**కిరణ్ అబ్బవరం పూర్తి నమ్మకం ఇచ్చారు..**హీరో కిరణ్ అబ్బవరం ఈ చిత్రంలోని స్టీవెన్ శంకర్ పాత్రకు పూర్తి న్యాయం చేశారని ప్రశంసించారు.

**.మణిశర్మ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది..**మెలోడీ బ్రహ్మ మణిశర్మ ఈ సినిమాకు అతిపెద్ద బలమని రవి నంబూరి అన్నారు. ప్రతి సన్నివేశాన్ని తన రీ రికార్డింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారని చెప్పారు.

**.పాండిచ్చేరి షెడ్యూల్ పెద్ద సవాల్..**ఇంటర్వెల్ యాక్సిడెంట్ సీన్‌ను పాండిచ్చేరిలోని ఒరిజినల్ రోడ్లపై చిత్రీకరించడం, క్లైమాక్స్ లో డాగ్ సీక్వెన్స్‌ను సహజంగా తెరకెక్కించడం చిత్రబృందానికి అతిపెద్ద సవాల్‌గా నిలిచిందన్నారు.

**ప్రేక్షకులే సమాధానం చెప్పారు..** విడుదలైన తొలి రోజు సెకండ్ హాఫ్‌పై కొంతమంది అభిప్రాయా లు వ్యక్తం చేసినప్పటికీ, తర్వాత కథలోని ట్విస్ట్‌ను అర్థం చేసుకుని వచ్చిన ప్రేక్షకులు అదే భాగాన్ని మరింతగా ఆస్వాదించారని రవి నంబూరి తెలిపారు.

**ఇండస్ట్రీ నుంచి ప్రశంసల వెల్లువ..** సినిమా చూసిన తర్వాత హీరో సంతోష్ శోభన్, దర్శకుడు శైలేష్ కొలను సహా పలువురు సినీ ప్రముఖులు ఫోన్ చేసి అభినందించడం తనకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు.

**తదుపరి చిత్రం కూడా ఎస్‌కేఎన్‌తోనే..** తనకు తొలి అవకాశాన్ని ఇచ్చిన ఎస్‌కేఎన్‌పై ప్రత్యేక కృతజ్ఞత ఉందని, అందుకే తదుపరి చిత్రాన్ని కూడా ఆయన నిర్మాణంలోనే తెరకెక్కించనున్నట్లు వెల్లడించారు.

# 'అగధ' ట్రైలర్ లాంచ్



నా శ్వాస ఉన్నంత వరకు సినిమాలు తీస్తూనే ఉంటాను 'అగధ'ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం.ఎస్. రాజు...'అగధ'లో అద్భుతమైన కథతో పాటు స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం.ఎస్. రాజు.. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్.రాజు తెరకెక్కించిన చిత్రం అగధ. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయకుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేబోతున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ..'అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. అజయ్, కాశీ విశాలాక్షి ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేశారు.'ఆరిజిన్ ఆఫ్ అగధ్ కూడా చాలా వైరల్ అయింది. మున్ముందు ఈవెంట్లలో టీం అందరికీ గురించి చెబుతాను. ఆగస్ట్ 14న 'అగధ'రిలీజ్ కాబోతోంది. కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ.. డిఫరెంట్ కారెక్టర్స్‌ను పోషించాలని ప్రతీ నటికి ఉంటుంది. 'పొలిమేర' తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర నాకు లభించలేదు. కానీ రాజు గారు ఈ 'అగధ' కథ, అందులో నా పాత్రను చెప్పిన తర్వాత ఆశ్చర్యపోయాను. నటిగా మళ్లీ నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి చక్కటి అవకాశం లభించింది. శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. 'అగధ'జర్నీ నాకెంతో ప్రత్యేకం. నేను ఎప్పుడూ సింపుల్ సినిమాల్ని చేయలేదు. రాజుమీద నాకు నమ్మకం ఉంది. ఆయన్నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. 'డర్టీ హరి' తర్వాత 'అగధ'లో నాకు మంచి పాత్రను ఇచ్చారు. కాశీ విశాలాక్షి మాట్లాడుతూ.. అగధ చిత్రీకరణ సమయంలో నేను కూడా సెట్‌కి వెళ్లాను. ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. ...ఉల్కా గుప్తా మాట్లాడుతూ.. రాజు గారు చెప్పిన 'అగధ' కథ నాకు ఎంతో నచ్చింది. పదేళ్ల తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం ఆనందంగా ఉంది. జోవికా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. మాకు రాజు ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు.

# 'దొంగ నా కొడుకు' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పెద్ద స్టార్ హీరోలతో గ్రాండ్ ఎంటర్‌టైనర్స్ చేస్తూనే, మరోవైపు కొత్త టాలెంట్‌తో కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తోంది. తాజాగా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రశంసలు అందుకున్న మోళి తనూజ్ ప్రసాంత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా 'దొంగ నా కొడుకు' అనే క్రేజీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వినూత్నంగా డిజైన్ చేసిన లోగో సినిమా ఫన్, ఎంటర్‌టైనింగ్ టోన్‌ను పరిచయం చేస్తోంది. ఇక ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భారీ జాక్ ప్లేయింగ్ కార్డ్ నుంచి చిరునవ్వుతో స్టైలిష్‌గా ఎంట్రీ ఇస్తున్న మోళి లుక్ ఆకట్టుకుంటోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే... సరదా మనస్తత్వం ఉన్న యువకుడు వరుసగా జరిగే కామెడీ, దొంగతనాల నేపథ్యంలో సాగే థ్రిల్లింగ్ సంఘటనల్లో చిక్కుకోబోతున్నాడనే ఆసక్తిని కలిగిస్తోంది. ప్లేయింగ్ కార్డ్ కాన్సెప్ట్ సినిమాకు యూనిక్ విజువల్ ఐడెంటిటీని తీసుకొచ్చింది. పోస్టర్‌లో కనిపించే బ్లాక్ బ్యాక్‌ప్యాక్, చెల్లాచెదురుగా పడిన బంగారు నగలు, గాలిలో ఎగురుతున్న కాగితాల ముక్కలు వంటి విజువల్ ఎలిమెంట్స్ కథలోని దొంగతనం కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా సూచిస్తున్నాయి. ఈ క్రియేటివ్ పోస్టర్ సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తుండగా, అనిల్ ఎర్నేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో సుష్మిత శెట్టి, అలీ, రాజిత, రఘుబాబు, ప్రియ, గుండు సుధర్శన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# 'ఇరుముడి' సాంగ్ 'యాలాలో యాలాలో' రిలీజ్



మాస్ మహారాజా మోస్ట్ ఎవైటెడ్ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఇరుముడి' ప్రమోషన్స్ తో ఉత్సాహాన్ని పెంచుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం, తన భక్తి గీతమైన మొదటి పాట 'ఇరుముడి కట్టు'తో ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, కుటుంబ బంధాలలోని ఆప్యాయతను అందంగా చాటిచెప్పే రెండవ పాట 'యాలాలో యాలాలో'ను చిత్ర బృందం విడుదల చేసింది. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం మధ్యతరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అసలైన సంపద అనే భావాన్ని హృదయానికి హత్తుకునేలా చెబుతుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్, సాధికా కెఆర్ ఆలపించిన తీరు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించింది. ఈ పాట ద్వారా సినిమా ఎమోషనల్ కోర్‌ను కూడా మేకర్స్ చూపించారు. రవితేజ కుటుంబాన్ని ప్రాణంగా ప్రేమించే ఓ ఆటో డ్రైవర్‌గా కనిపిస్తారు. మద్యానికి బానిసైనప్పటికీ కుటుంబం కోసం తపించే తండ్రి పాత్రలో ఆయన సహజమైన నటన ఆకట్టుకుంటోంది. ప్రియ భవాని శంకర్ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకునే భార్య పాత్రలో మెప్పించగా, బేబీ నక్షత్ర తండ్రితో విడదీయలేని అనుబంధం ఉన్న కూతురిగా మనసుని తాకింది. పాటలోని ప్రతి విజువల్, ప్రతి ఎమోషన్ సాహిత్యానికి అద్భుతంగా తోడై కుటుంబ బంధాలను ఎంతో సహజంగా చూపించింది. ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకులకి ఫేవరేట్‌గా మారింది

# 50 రోజుల విజయోత్సవాన్ని జరుపుకున్న 'ఎల్‌జీబీటీ - ఏ లీగల్ బ్యాటిల్' చిత్ర బృందం



ఎల్‌జీబీటీ పార్ట్2కు తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం - మంత్రి అడ్లూరి లక్ష్మణ్..సామాజిక అంశాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశం సలు అందుకున్న 'ఎల్‌జీబీటీ - ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం విజయవంతంగా 50 రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ ఘనంగా విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ... ఈ సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా గౌరవప్రదమైన జీవితం ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆలోచన అని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రేక్షకులు తమ చిత్రాన్ని విశేషంగా ఆదరించి 50 రోజుల విజయాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం ద్వారా ప్రతి మనిషిని గౌరవించే భావన సమాజంలో పెరగాలని తాము కోరుకున్నామని, ప్రేక్షకులు ఆ సందేశాన్ని ఆదరించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రిన్స్ పిక్చర్స్ కొత్త సినిమా



ప్రిన్స్ పిక్చర్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. హీరో కార్తీ, ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా కాంబినేషన్‌లో కొత్త సినిమా అనౌన్స్ చేసింది. ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు హీరోయిజాన్ని అద్భుతంగా మేళవించిన ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది. కార్తీ, మోహన్ రాజా కలిసి పనిచేయడం ఇదే తొలిసారి. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌లో కార్తీకి ఇది వరుసగా నాలుగో చిత్రం. ఇంతకుముందు 'దేవ్', 'సర్దార్', 'సర్దార్ 2' చిత్రాల తర్వాత మరోసారి ఈ బ్యానర్‌తో ఆయన చేతులు కలపడం విశేషం. ముఖ్యంగా 'సర్దార్ 2' విడుదలకంటే ముందే ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించడం కార్తీ, ప్రిన్స్ పిక్చర్స్ మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. ఈ సినిమాపై కేవలం ప్రకటనతోనే సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. బలమైన భావోద్వేగాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మేళవిస్తూ మంచి సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న మోహన్ రాజా, ఈ చిత్రంలో కార్తీని మరో కొత్త, పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతు న్నారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం, రెగ్యులర్ షూటింగ్ తదితర వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

ఆట

# టీమిండియాకు గాయాల షాక్

## విజయవకాశాలపై తీవ్ర ప్రభావం.. మెడికల్ టీంపై బిసిసిఐ వేటు


**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టును వరుస గాయాలు తీవ్రంగా వేధిస్తున్నాయి. జట్టుకు అవసరమైన సమయంలో కీలక ఆటగాళ్లంతా జట్టుకు దూరమవుతున్నారు. ఈ గాయాలు భారత విజయవకాశాలను తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. లంక పర్యటనకు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు, నితీష్ కుమార్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ గాయాలతో జట్టుకు దూరమయ్యారు. ఐపీఎల్ 2026 సీజన్ తర్వాత హార్దిక్ పాండ్యా ఇప్పటి వరకు ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ ఆడలేదు. యువ పేసర్ ప్రిన్స్ యాదవ్ ఇటీవలే గాయపడ్డాడు. ఇలా ఆటగాళ్లు తరుచూ గాయాలతో దూరమవుతుండటంపై బిసిసిఐ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టీమ్ ఫిజియో బృందంపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. టీమ్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆటగాళ్లు తరుచూ గాయపడుతున్నారని, వారి ఇంజ్యూరీ మేనేజ్‌మెంట్ సరిగ్గా లేదనే యోచనలో ఉంది. ఈ క్రమంలోనే శ్రీలంక పర్యటన తర్వాత హెడ్ ఫిజియోథెరపిస్ట్ కమలేశ్ జైన్, టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్‌లపై వేటు వేసేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఆటగాళ్లు తరుచూ గాయాల బారిన పడటం వల్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సరైన కాంబినేషన్‌ను ఎంచుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. 15 మంది సభ్యులు ఉన్నప్పటికీ సరైన కూర్పు చేయలేకపోతున్నారు. గాయాల విషయంలో ఫిజియోలు, డైరెక్టర్లకు పూర్తి అవగాహనతో పాటు స్పష్టతతో ఉండాలి. ఆటగాళ్లను తిరిగి మైదానంలోకి పంపేందుకు పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే క్లియరెన్స్ ఇవ్వాలి. హడావుడిగా ఆడించడం వల్ల పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుంది. నితీష్, హర్షిత్ రాణాలా విషయంలో ఇదే జరిగింది. ఇలాంటి తప్పిదాలు జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తాయి. అందుకు టీమ్ మెడికల్ టీమ్ జవాబుదారీగా ఉండాల్సిందే. వారి నుంచి సరైన వివరణ లభించకపోతే, వారితో పాటు, ఫిట్‌నెస్ కోచ్‌పై కూడా వేటు పడే అవకాశాలు కన్పిస్తున్నాయి.



# పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** జాంబియా వేదికగా జరుగుతున్న ఏషియన్ లీజెండ్స్ లీగ్‌లో ఇండియన్ రాయల్స్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో పాకిస్థాన్ ప్యాంథర్స్ జట్టును 2 వికెట్ల తేడాతో భారత్ ఓడించింది. ఈ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ లీజెండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసి, భారత్ ముందు 168 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. పాకిస్థాన్ తరఫున ఇమ్రాన్ నజీర్ 29 బంతుల్లో 47 పరుగులతో రాణించగా, భారత బౌలర్లు చివరి ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియన్ రాయల్స్ ఆరంభంలోనే ఓపెనర్లు నమన్ ఓజా, అభిషేక్ల వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, ఆ తర్వాత వచ్చిన రిషి ధావన్ (33 బంతుల్లో 50 పరుగులు), సారుల్ (29 బంతుల్లో 46 పరుగులు) బాధ్యతాయుతంగా ఆడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ అవుటైన తర్వాత భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయి మళ్లీ ఒత్తిడిలో పడినప్పటికీ, ఆఖరి వరుస బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి మరో 14 బంతులు మిగిలి ఉండగానే 17.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ విజయంతో టోర్నీలో ఇండియన్ రాయల్స్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. కాగా అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు బంగ్లాదేశ్ టైగర్స్ పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. జూలై 30న ప్రారంభమైన ఈ ఏషియన్ లీజెండ్స్ లీగ్ రెండవ సీజన్ ఫైనల్ మ్యాచ్ ఈ నెల 10న జరగనుంది. భారత్ జట్టులో శిఖర్ ధావన్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, దినేష్ కార్తీక్, అంబటి రాయుడు వంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లు భాగస్వాములుగా ఉన్నారు.



# క్రిస్టినాకు మెంఫిస్ టైటిల్

**న్యూఢిల్లీ:** రష్యాకు చెందిన 16 ఏళ్ల క్రిస్టినా లియుటోవా డార్జా విద్మానోవాను 1-6, 6-1, 6-3 తేడాతో ఓడించి, తన తొలి మెయిన్‌డ్రా ప్రదర్శనలోనే డబ్ల్యూటీఏ మెంఫిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2019లో లింజ్‌లో 15 ఏళ్ల కోకో గాఫ్ విజయం సాధించిన తర్వాత, డబ్ల్యూటిఏ టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలైన క్రీడాకారిణిగా లియుటోవా నిలిచింది. ఆరంభంలో ఉన్న ఆందోళనను అధిగమించి రెండవ సెట్‌లో దూసుకుపోయిన ఆమె, మూడవ సెట్‌లో 4-0 ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత విద్మనోవా తన సర్వ్‌ను నిలబెట్టుకుని 4-1తో ఆధిక్యంలోకి వచ్చి, చివరకు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 4-2తో ఆధిక్యంలోకి వెళ్ళింది. లియుటోవా వెంటనే బ్రేక్ బ్యాక్ చేసినప్పటికీ, తన సొంత సర్వ్‌పై లభించిన మూడు మ్యాచ్ పాయింట్లను కూడా గెలుచుకోలేకపోయింది. చివరకు చెక్ క్రీడాకారిణి సర్వ్‌ను బ్రేక్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. 250-స్థాయి ఈవెంట్‌లో లియుటోవా టైటిల్ గెలుచుకునే క్రమంలో, ఆమె టాప్‌సీడెడ్ ఎకటెరినా అలెక్సాండ్రోవా మరియు ఆరవ సీడెడ్ క్యాటీ మెక్‌నల్లీలపై విజయాలు సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 229వ స్థానంలో ఉన్న లియుటోవా, క్వాలిఫైయింగ్ రౌండ్ల ద్వారా డ్రాలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అలాగే ప్రపంచ ర్యాంకింగ్‌లో 714వ స్థానంతో సంవత్సరాన్ని ప్రారంభించిన లియుటోవా, ఇప్పుడు 126వ స్థానానికి చేరుకుంటుందని అంచనా.

### మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో..

# బ్రిజ్ భూషణ్‌కు క్లీన్‌చిట్



**న్యూఢిల్లీ:** మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఫెడరేషన్‌కు చీఫ్‌గా పనిచేస్తున్న సమయంలో 2023 ఏప్రిల్‌లో ఆరుగురు మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించాడని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాదు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టారు. ఏప్రిల్ 28న అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో అతడిపై రెండు కేసులు నమోదయ్యాయి. ఒకటి లైంగిక వేధింపులు, పరువుకు భంగం కలిగించడం, వెంటపడటంపై ఫిర్యాదు కాగా. రెండోది మైనర్ రెజ్లర్ ఫిర్యాదు ద్వారా పోక్సో కేసు నమోదయ్యాయి. దీంతో అతడితో పాటు డబ్ల్యూఎఫ్ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌లపై కేసు నమోదు చేశారు. ఈ కేసు అప్పట్లో సంచలనాన్ని సృష్టించింది. 32 మంది సాక్షుల వివరణ, నిందితుల వాంగ్మూలాలపై విచారణ చేపట్టింది కోర్టు. ఈ కేసులో బ్రిజ్ భూషణ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025లో మైనర్ ఫిర్యాదుదారకు సంబంధించిన పోక్సో కేసులో ఢిల్లీ పోలీసులు సమర్పించిన క్లోజర్ రిపోర్ట్ (కేసును మూసివేసే నివేదిక)ను కూడా కోర్టు ఆమోదించింది. భారత క్రీడా రంగంలో అత్యంత ప్రముఖమైన కేసుల్లో ఒకటి అయిన ఈ కేసుకు ముగింపు పలికారు. కాగా మహిళా రెజ్లర్లు దీనిపై పై కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

# హైదరాబాద్ క్రికెటర్ అఖిలేష్‌పై 8 యేళ్ల నిషేధం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారం కలకలం రేపింది. భారత సంతతి, అమెరికా యువ క్రికెటర్ బొడుగుం అఖిలేష్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల నిషేధం విధించింది. ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్‌లోని మూడు కీలక నిబంధనలను ఉల్లంఘించినట్లు యాంటీ కరప్షన్ ట్రైబ్యునల్ నిర్ధారించడంతో బోర్డు నిర్ణయం తీసుకుంది. 2025లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన అబుదాబి టీ10 టోర్నమెంట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన నేపథ్యంలో అఖిలేష్ రెడ్డిపై ఐసీసీ కఠిన చర్యలు తీసుకుంది. అఖిలేష్ శిక్షను 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా ఐసీసీ వెల్లడించింది. అదే రోజున అతడిని క్రికెట్ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. యూఏఈ క్రికెట్ బోర్డు తరఫున అబుదాబి టీ10 లీగ్‌కు డిజిగ్నేటెడ్ యాంటీ కరప్షన్ అధికారిగా ఐసీసీ వ్యవహరించింది. మ్యాచ్ ఫలితం, మ్యాచ్ తీరును అలేష్ ప్రభావితం చేసే ప్రయత్నం చేశాడని విచారణ అనంతరం ట్రైబ్యునల్ తేల్చింది.



అలాగే మరో ఆటగాడిని కూడా ఫిక్సింగ్‌కు ప్రేరేపించే ప్రయత్నం చేసినట్లు గుర్తించింది. ఈ కేసులో అత్యంత కీలకమైన ఘటన 2025 నవంబర్ 19న అబుదాబిలోని ఓ హోటల్‌లో చోటుచేసుకుంది. ఆస్పిన్ స్టాలియన్స్ జట్టు తొలి మ్యాచ్‌కు ముందు అఖిలేష్ తన సహచర ఆటగాడితో మాట్లాడాడని, బౌలింగ్ సమయంలో ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరినట్లు విచారణలో వెల్లడైంది. జట్టు యాజమాన్యం సూచనల మేరకే ఈ ప్రతిపాదన చేశాడని కూడా ట్రైబ్యునల్ పేర్కొంది. అయితే సదరు ఆటగాడు ఫిక్సింగ్ ప్రతిపాదనను తిరస్కరించి వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం అఖిలేష్ ని మ్యాచ్‌కు ముందు తుది జట్టు నుంచి తప్పించారు. దర్యాప్తు సమయంలో అఖిలేష్ రెడ్డి తన మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ మెసేజెస్, కాల్ లిస్టును తొలగించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. దర్యాప్తుకు సంబంధించిన కీలక ఆధారాలను ఉద్దేశపూర్వకంగానే తొలగించాడని తేల్చింది.

## వాణిజ్యం

# చైనా నుంచి 1 కోటి ఎఫ్‌డీఐ ప్రతిపాదనకు ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనల్లో కేవలం ఒకదానికి మాత్రమే ఆమోదం తెలిపింది. ఆ ప్రతిపాదన విలువ రూ.1 కోటి మాత్రమే. అదే సమయంలో హాంకాంగ్ నుంచి వచ్చిన 13 ఎఫ్‌డీఐ ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ రూ.610.42 కోట్లు అని డిపిఐఐటి డేటా వెల్లడించింది. భారతదేశంతో సరిహ




ద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి అనే నిబంధనను కరోనా మహమ్మారి సమయంలో ప్రవేశపెట్టారు. భారతీయ కంపెనీలపై అవకాశవాద స్వాధీనాలు, కొనుగోళ్లను నిరోధించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మొత్తం 63 ఎఫ్‌డీఐ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ రూ.10,292.67 కోట్లుగా నమోదైంది. ఆమోదం పొందిన పెట్టుబడుల విలువ పరంగా సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఆ దేశం నుంచి వచ్చిన ఐదు ప్రతిపాదనలకు రూ.3,259.88 కోట్ల పెట్టుబడులకు అనుమతి లభించింది. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి వచ్చిన ఐదు ప్రతిపాదనలకు రూ.2,477.67 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించగా, థాయ్‌లాండ్ నుంచి వచ్చిన రెండు ప్రతిపాదనలకు రూ.1,600 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. పాతికేళ్లలో చైనా నుంచి భారత్‌లోకి మొత్తం రూ.16,162.25 కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చాయి. ఇది దేశంలో నమోదైన మొత్తం ఎఫ్‌డీఐ ఈక్విటీ ప్రవాహాల్లో కేవలం 0.32 శాతం మాత్రమే కాగా, పెట్టుబడులు పెట్టిన దేశాల్లో చైనా 23వ స్థానంలో ఉంది.

# ముత్తూట్ మైక్రోఫిన్ ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణకు సెబీ గ్రీన్‌సిగ్నల్




**ముంబయి,ఆగస్టు3:** ముత్తూట్ మైక్రోఫిన్‌లో ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణకు సెబీ అనుమతి ఇచ్చింది. ఈ ప్రక్రియలో తప్పనిసరిగా చేపట్టాల్సిన ఓపెన్ ఆఫర్ నిబంధన నుంచి మినహాయింపు నిచ్చి వారసత్వ ప్రణాళిక అమలుకు బాటలువేసింది. సెబీ అనుమతి మేరకు ముత్తూట్ కుటుంబానికి చెందిన ఆరు ట్రస్టులు, ముత్తూట్ మైక్రోఫిన్ ప్రమోటర్ సంస్థ అయిన ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో పరోక్షంగా వాటాలను సొంతం చేసుకోనున్నాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆరు కుటుంబ ట్రస్టులు ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో 63.35 శాతం వాటాను పొందనున్నాయి. ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిస్టెడ్ సంస్థ అయిన ముత్తూట్ మైక్రోఫిన్‌లో 50.21 శాతం వాటాను కలిగి ఉంది. ఈ లావాదేవీ వల్ల ముత్తూట్ మైక్రోఫిన్‌పై నియంత్రణలో ఎలాంటి మార్పు ఉండదని సెబీ స్పష్టం చేసింది. అందువల్ల ప్రజా వాటాదారులకు తప్పనిసరిగా ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. పునర్వ్యవస్థీకరణ అనంతరం ముత్తూట్ మైక్రోఫిన్‌లో ప్రమోటర్ల వాటా, ప్రజా వాటాదారుల వాటా యథాతథంగానే కొనసాగుతాయని తెలిపింది. సెబీ ప్రకారం, ఈ సవరించిన ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణను ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రతిపాదిత ఐపీఓకు అనుగుణంగా రూపొందించారు. ఇది పూర్తిగా కుటుంబ సభ్యుల మధ్య బహుమతి రూపంలో షేర్ల బదిలీ ద్వారా జరిగే అంతర్గత కుటుంబ వారసత్వ ప్రక్రియ మాత్రమేనని వివరించింది.

# పేటీఎంలో రూ.2,000 కోట్ల బ్లాక్ డీల్




**ముంబయి,ఆగస్టు 3:** పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్లు మంగళవారం మార్కెట్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశముంది. సంస్థలో తొలి పెట్టుబడిదారులైన సైఫ్ పార్టనర్స్ మరియు ఎలివేషన్ క్యాపిటల్ తమ వాటాలో కొంత భాగాన్ని బ్లాక్ డీల్ ద్వారా విక్రయించాలని నిర్ణయించాయి. ఈ రెండు సంస్థలు కలిసి 1.49 కోట్ల షేర్లను మంగళవారం బ్లాక్ డీల్ ద్వారా విక్రయించనున్నాయి. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.2,002 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పేటీఎం షేర్లలో జరిగే అతిపెద్ద సెకండరీ షేర్ విక్రయాల్లో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ బ్లాక్ డీల్‌కు మోర్గాన్ స్టాన్లీ బ్యాంకర్‌గా వ్యవహరిస్తోంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి సైఫ్ పార్ట్నర్స్ వద్ద పేటీఎంలో 3.63 శాతం వాటా ఉండగా, ఎలివేషన్ మారిషస్ కంపెనీ వద్ద 8.55 శాతం వాటా ఉంది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పేటీఎం ఆర్థిక ఫలితాలు మెరుగ్గా నమోదయ్యాయి. కంపెనీ సమీకృత ఆదాయం (కన్సాలిడేటెడ్ రెవెన్యూ) గత త్రైమాసికంలోని రూ.2,264 కోట్ల నుంచి 8.1 శాతం పెరిగి రూ.2,448 కోట్లకు చేరింది. అదే సమయంలో కంపెనీ నికర లాభం 20 శాతం పెరిగి రూ.184 కోట్ల నుంచి రూ.220 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం రూ.132 కోట్ల నుంచి 54 శాతం పెరిగి రూ.203 కోట్లకు చేరింది. దీంతో ఎబిడిటా మార్జిన్ 5.8 శాతం నుంచి 8.3 శాతానికి మెరుగుపడింది.

# డిజిటల్ చెల్లింపులు తయారీ రంగానికి ఊతం

## పన్ను చట్టాల్లో కేంద్రం కీలక మార్పులు



**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** దేశంలో పెట్టుబడులు, తయారీ రంగం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో పన్ను, నియంత్రణ సంబంధిత సంస్కరణలను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా ఆదాయపు పన్ను ఆర్డినెన్స్-2026 స్థానంలో కొత్త చట్టపరమైన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ప్రధాన ప్రతిపాదనల్లో భాగంగా డిజిటల్ చెల్లింపులపై విధించే ఛార్జీలకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని కేంద్రం భావిస్తోంది. ఇకపై ఏయే ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ఛార్జీలు విధించకూడదో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే అధికారం కలిగి ఉంటుంది. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టానికి అనుసంధానంగా ఉన్న విధానానికి బదులుగా ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి రానుంది. ముఖ్యంగా డిజిటల్ లావాదేవీలపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ విషయంలో చాలా కాలంగా ఉన్న అనిశ్చితికి ఈ చర్యతో స్పష్టత లభించే అవకాశం ఉంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా కూడా కీలక ప్రతిపాదనలు తీసుకొచ్చారు. నిర్దిష్ట షరతులకు లోబడి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మరియు బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడుల ద్వారా పొందే వడ్డీ ఆదాయం, మూలధన లాభాలపై పన్ను మినహాయింపు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. తయారీ రంగానికి ఊతమివ్వడానికి, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలకు వ క్యాపిటల్ గూడ్స్ సరఫరా చేసే విదేశీ కంపెనీలకు ప్రస్తుతం ఉన్న పన్ను రాయితీలను 2040-41 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించాలని కేంద్రం యోచిస్తోంది. అదేవిధంగా, భారతదేశంలో కాంట్రాక్ట్ తయారీ కోసం కస్టమ్స్ బాండెడ్ గిడ్డంగుల్లో విడిభాగాలను నిల్వ చేసే విదేశీ కంపెనీలకు కూడా 2040-41 వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించింది. నోటిఫై చేసిన ప్రత్యేక జోన్ల ద్వారా ముడి వజ్రాలను విక్రయించే విదేశీ డైమండ్ మైనింగ్ కంపెనీలు మరియు అనుబంధ సంస్థలకు కూడా 2040-41 వరకు పన్ను మినహాయింపు కల్పించనున్నారు.

కొత్తపన్ను విధానాన్ని ఎంచుకునే స్పెషల్‌పర్పస్ వెహికిల్స్‌పై ప్రస్తుతం ఉన్నదాని కంటే అధికంగా 25 శాతం సర్‌చార్జ్ విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.



# ఆర్బీఐ ఎంపిసి సమీక్ష!

## 5న ద్రవ్య విధాన నిర్ణయాలు వెల్లడి

**ముంబయి,ఆగస్టు 3:** ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. సమావేశం ముగిసిన అనంతరం ఆగస్టు 5న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలను ప్రకటించనున్నారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, ఈ సమావేశంలో రెపో రేటును ప్రస్తుత 5.25 శాతంవద్దే కొనసాగించే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం ఇటీవలి నెలల్లో కొంత పెరుగుతున్నప్పటికీ, అది ఇప్పటికీ ఆర్‌బీఐ నిర్దేశించిన భద్రతా పరిమితులలోనే కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సగటు ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ ఇప్పటికే అంచనా వేసింది. ఈ అంచనాలో కూడా పెద్దగా మార్పులు ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఈ సమావేశంలో రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తే, గృహ రుణాల ఈఎంఐలు, బ్యాంకుల రుణ వడ్డీ రేట్లు, డిపాజిట్ వడ్డీ రేట్లలో తక్షణ మార్పులు ఉండే అవకాశం లేదు. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి చేరుకుంది. గత 17 నెలల్లో తొలిసారిగా ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని అధిగమించినప్పటికీ, కేంద్ర బ్యాంక్ నిర్దేశించిన 2-6 శాతం సహన పరిమితిలోనే కొనసాగుతోంది. ఇదే సమయంలో కోర్ ఇన్‌ఫ్లేషన్ కూడా సుమారు 4 శాతం వద్ద స్థిరంగా ఉంది. మరోవైపు, మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు కూడా ఆర్‌బీఐ దృష్టిలో కీలక అంశంగా మారాయి. ప్రభుత్వ బాండ్ మార్కెట్‌లో కూడా ప్రస్తుతం సమృద్ధిగా ఉన్న ద్రవ్య లభ్యత కారణంగా రాబడులు స్థిరంగా కొనసాగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్‌బీఐ విదేశీ డిపాజిట్లను ఆకర్షించేందుకు తీసుకున్న చర్యల వల్ల రూపాయి లిక్విడిటీ పెరుగుతోందని, దీనివల్ల బాండ్ మార్కెట్‌కు మద్దతు లభించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐదో తేదీ వరకు జరిగే ఎంపీసీ సమావేశం అనంతరం ఆగస్టు 5 ఉదయం సుమారు 10 గంటలకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా విధాన నిర్ణయాలను ప్రకటిస్తారు. 2026లో ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ మొత్తం 100 బేసిస్ పాయింట్లు రెపో రేటును తగ్గించింది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా కొనసాగుతోంది. వాణిజ్య బ్యాంకులకు స్వల్పకాలిక నిధులను ఆర్‌బీఐ అందించే వడ్డీ రేటునే రెపో రేటుగా పరిగణిస్తారు. ఇందులో మార్పులు చోటుచేసుకుంటే రుణాల వడ్డీ రేట్లు, గృహ రుణ ఈఎంఐలు, డిపాజిట్ రాబడులు, అలాగే ఆర్థిక వ్యవస్థలో లిక్విడిటీపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుంది.

# స్టాక్ మార్కెట్లకు నాలుగో రోజు జోష్



**ముంబయి,ఆగస్టు 3:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధరలు గణనీయంగా పడిపోవడం మార్కెట్లకు ప్రధాన ఊతమిచ్చింది. గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా నిధులు పెట్టుబడి పెట్టడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విస్తృత స్థాయిలో కొనుగోళ్లు జరగడంతో దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగియగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా పాజిటివ్‌లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 544.39 పాయింట్లు ఎగిసి 78,639.03 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస సెషన్లలో సెన్సెక్స్ 2.44 శాతం, నిఫ్టీ 3.29 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ పెరుగుదలకు ముఖ్యంగా ఇన్ఫోసిస్ 4.42, యాక్సిస్ బ్యాంక్ 3.46 , ఐసీఐసీఐ బ్యాంక్ 2.57షేర్లు గణనీయమైన మద్దతు అందించాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.73 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.32 శాతం చొప్పున లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 2,358 షేర్లు పెరగగా, 1,027 షేర్లు తగ్గాయి. మరో 120 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 4.17 డాలర్లు తగ్గి 83.80 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. పాక్షిక మారకపు రూపాయి విలువ 95.4350 నుంచి 95.3100కు చేరింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీకి పసిడి ఫ్యూచర్స్ ధర 0.18 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,43,633 వద్ద ట్రేడైంది. ఇక ఐపిఒల పరంగా ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లు ఆసక్తిపెరిగింది. 39,87,491 షేర్లకు గాను 75,12,95,688 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 188.41 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.